మా భారతి

సాహితీ సౌరభము

సరస్వతీపుత్ర

పుట్టపర్తి నారాయణాచార్యులు



ప్రచురణ
శ్రీ కామరాజ భూషణ సాహిత్య పరిషత్తు
భీమవరం

ఆత్మీయ సోదరులు
లలితకళోపాసకులు
నాల్చశ్రీ
'బాలబంధు'
శ్రీ బి. వి. నరసింహారావు BABEd
గారికి,

నాప్రేమకానర్ర.

సోదరులు
భాస్కరశాస్త్రులు
కళాధ్వనులు
30.5.73.

తాతా రామేశ్వరరావు

వసుచరిత్ర సాహితీ సౌరభము

సరస్వతీపుత్ర

శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు



ప్రకాశకులు:

శ్రీ రామరాజభూషణ సాహిత్య పరిషత్తు

భీమవరం.

పశ్చిమగోదావరిజిల్లా (ఆంధ్ర)

1970

ప్రథమ ముద్రణము

వేయి ప్రతులు

సర్వస్వామ్యా సంకలితము.

శ్రీ సాధారణ శరన్ముద్రణము

నవంబరు 1970

మూల్యము : ఐదు రూపాయలు.

వేంకట్రామ్ పవర్ ప్రెస్స్

ఏలూరు.



చిత్రకారుడు : శ్రీ M. రాజాబీ.

మున్నుడి

భూషణ కిరణావళి ఆవిష్కర్తగా ఏతెంచిన సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారి ఉపన్యాసములు సాహితీ సౌరభముగ రసికనందనములకు వ్యాపింపజేయు అవకాశము లభించి నందులకు సంతసించుచున్నాము. ఈ సందర్భమున శ్రీమాన్ నారాయణాచార్యులవారు సర్వహక్కులతో ఈ గ్రంథము మా కొసంగిరి. వారికి పరిషత్తుపక్షాన ధన్యవాదములు. ఇది మా పరిషత్తు రసికాంధ్ర ప్రీతికై సమర్పించు ద్వితీయకుసుమము. ఈ గ్రంథముద్రణము ఇంత సులభప్రాప్యమగుటకు కొంతవరకు ద్రవ్యసహాయము చేసిన కవితా ప్రియులు శ్రీ తుమ్మలపల్లి మంగరాజుగారికి కృతజ్ఞులము. వారు మా పరిషత్తునకు ఉపాధ్యక్షులు. వారి దాతృత్వముచే మా పరిషత్తు దివ్య నదీమాతృకయైనది. భగవతి వాగీశ్వరి వారికి సర్వశ్రేయోధాత్రి యగుత. కోరినంతనే తమ అమూల్య అభిప్రాయము ప్రాసిపంపిన డాక్టరు దివాకర్ల వేంకటావధాని ఎం. ఏ. (ఆనర్సు) పి. హెచ్.డి. గార్కి మా హృదయ పూర్వక ధన్యవాదములు.

ఇందు ప్రకటింపబడిన రామరాజ భూషణుని చిత్రము శ్రీ యమ్. రాజాజీగారిచే కల్పింపబడినది. వారు దీనిని మా కొసగినందులకు ఈ పరిషత్తు వారియెడల సౌహార్దమును ప్రకటించుచున్నది. శ్రీ యమ్. రాజాజీగారు రాజమండ్రి శ్రీ దామెర్ల రామారావు ఆర్టుస్కూలు ప్రధానోపాధ్యాయులు. గ్రంథసంపాదనమునందు మాకుసాయపడిన శ్రీమాన్ నారాయణాచార్యులవారి శిష్యులు యస్. రాజన్న కవిగారును కృతజ్ఞతా భావస్మరణీయులు. 'వసుచరిత సాహితీసౌరభము' సర్వాంగ సుందరముగా అచ్చొత్తించి యిచ్చిన శ్రీ వేంకట్రామ్ పవర్ ప్రెస్ యజమానులు శ్రీ ఈదర వెంకట్రామయ్య బి. కామ్. గార్కి పరిషత్తు పక్షాన ధన్యవాదములు.

భీమవరం
19-11-1970

చుక్కన గంగరాజు
కార్యదర్శి.

అభిప్రాయము

విద్వత్కవిపుంగవులు, బహుభాషా కోవిదులు, సరస్వతీపుత్ర బిరుదాంకితులునైన శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు రెండేండ్లక్రింద మా విశ్వవిద్యాలయమువారి కోరికపై రామరాజ భూషణుని వసుచరిత్ర ప్రబంధమునుగూర్చి మూఁడు మహోపన్యాసము లొసంగియుండిరి. వానిని విని వారాగ్రంథమునధ్యయన మొనర్చిన విధానమును, రామరాజభూషణుఁడందుఁ బ్రదర్శించిన ప్రతిభా పాండిత్యములను గ్రహించి యపారానందమందిర హృదయారవిందుఁడ నైతిని. అప్పటినుండియు నవి ముద్రితములై యెప్పుడు సర్వాంధ్రజన పఠనయోగ్యములగునాయని యెదురుచూచుచుంటిని. భీమవరమునందలి శ్రీరామరాజభూషణ సాహిత్యపరిషత్తువారిప్పుడు వానిని పుస్తక రూపమున ముద్రించి పరిషదభిధేయమును సార్థక మొనరించుటేకాక భట్టుమూర్తి కవితాభిమానుల జిజ్ఞాసకు సాఫల్యముకూఁడ గలిగించి యున్నారు.

అనేకవిధముల నాంధ్రప్రబంధములం దగ్రగణ్యమని చెప్పఁదగినది వసుచరిత్రము. భట్టుమూర్తి యందుఁజూపిన శ్లేషధ్వని చమత్కారమును, పదప్రయోగ ప్రౌఢిమను పద్యరచనాశిల్పమును, పాండితీ శాండీర్య మును నాన్యతోదర్శనీయములు. శబ్దార్థాలంకారములను విరివిగా వాడుచు వానివలన రసమునకుఁగాని భావములకుఁగాని యించుకయు భంగముకాకుండ రచన సాగింపనేర్చిన కవిపుంగవులలో నతనిదే అగ్ర తాంబూలము.

ప్రథమోపన్యాసమున శ్రీమాన్ ఆచార్యులవారు రామరాజ భూషణుని పదప్రయోగపాటవమును సంగీతజ్యోతిశ్శాస్త్రపాండిత్యమును ఒక్కొక్కటిగాఁ బ్రదర్శించియున్నారు. నవాంబురుహాంబక, రాజీవానన, రమాకుమార మున్నగు పదములను సమగ్రముగా వ్యాఖ్యానించి వారు రామరాజభూషణుని కవితాకౌశలముతోపాటు తమ పాండితీ పరిశీలనములనుగూడ ప్రకటించియున్నారు. భట్టుమూర్తి పదప్రయోగ ప్రౌఢిమకు సంబంధించిన రహస్యములు పెక్కుపూర్వములును ఆశ్చర్యావహములునై యలరారుచున్నవి. అతఁడు సంగీతకళావహస్య నిధి. జ్యోతిర్విద్యావిచక్షణుఁడు. ఆ రెండు శాస్త్రములందు దనకుఁగల యపారపాండిత్యము నాతఁడెట్లు కావ్యమునఁ బ్రదర్శించినాఁడో

ఆచార్యులవారు సోదాహరణముగ వివరించియున్నారు. అట్లు వివరించుటకు మరల భట్టుమూర్తియంతవాడుకాని సమర్థుడుకాడనుటలో నసత్యములేదు.

వసుచరిత్ర మనుచరిత్ర తరువాత పుట్టిన కావ్యము. భట్టుమూర్తి మనుచరిత్రను చాలా శ్రద్ధతోడ జదివి యందలి పద్యములకన్న మిన్నగా ప్రాయవలెనను జిగీషతోడ బెక్కు పద్యములను ప్రాసియున్నాడు. కథనములో, సన్నివేశములలో, పాత్రలలో, పద్యరచనలో రసభావములలో నారెండింటికిఁ బోలికలు మెండుగాఁగానవచ్చును. ద్వితీయోపన్యాసమున శ్రీమాన్ ఆచార్యుల వారా పోలికలన్నిటిని జక్కగాఁ బ్రదర్శించి యున్నారు. ఆ యిరువురు మహాకవుల కవితలందలి ప్రాణమును బట్టఁగల వారేకాని యీపని నింత ప్రౌఢ సుందరముగా నిర్వహింపఁజాలరు.

కావ్యనాయకునితోడ గృతిపతికభేదాధ్యవసాయము కల్పించు సంప్రదాయము కన్నడకవులలోఁ గానవచ్చును. భట్టుమూర్తి వసుమహారాజ వర్ణనలలోఁ దనప్రభువైన రామరాయలను స్ఫురింపఁజేయుటకుఁ గావించిన ప్రయత్నము తృతీయోపన్యాసమున సహేతుకముగా వివరింపఁబడినది. తరునాత భట్టుమూర్తి పెద్దనగారి కావ్యమునువలెనే తిమ్మన, రాయల కావ్యములనుగూడ దృష్టిలో నుంచుకొని తనకావ్యమును రచించినట్లు నిరూపింపఁబడినది.

ఇందలి మూఁడుపన్యాసములును శ్రీమాన్ ఆచార్యులవారి పాండితీపరిశోధనలను, భట్టుమూర్తి కవిత్వమందలి ఆయువుపట్టులను చక్కఁగా ప్రదర్శించుచున్నవి. వారిశైలి సులభమయ్యు శక్తిమంతమై గంభీరమయ్యు సభ్యసుభోదమై యలరారుచున్నది. గ్రంథ మాకృతిని జిన్నదయ్యున పూర్వార్ధముల నెన్నిటినోయందిచ్చుచు నాంధ్రమందలి కావ్యవిమర్శ గ్రంథముల కలంకారమని చెప్పఁదగియున్నది. దీనితో వసుచరిత్ర సాహితీసౌరభ మాంధ్రదేశమున నన్నిదెసల నలముకొను ననుటలో సందేహములేదు.

డా. దివాకర్ల వేంకటావధాని, ఎం. ఏ. (ఆనర్స్) పి. హెచ్. డి.
ఆంధ్రశాఖాధ్యక్షులు,
ఉస్మానియా విశ్వవిద్యాలయము - హైదరాబాదు.

కృతజ్ఞతలు

ఈ వ్యాసములో చెప్పిన భావములు కొన్ని నేను పెద్దలతో విన్నవి. కొన్ని నేనా మార్గములో నాలోచించి కొన్నవి. వసుచరిత్ర పైన రాయలసీమలో ప్రత్యేకమైన యభిమానముకద్దు. కారణము రామరాజభూషణుడు పెనుకొండలో నివసించిన వాడగుట. ఆతని జన్మస్థలము గూడ కడపమండలములోని గ్రామమగుట. మహాకాలీనత గల సంస్కృత విద్వాంసులీ కావ్యమును గీర్వాణమున వ్రాసికొనిరి. తమిళులాగ్రంథము ననువదించి కొనిరి. కన్నడమున లక్ష్మీశుడు రామ రాజభూషణుని కవితాచ్ఛాయలకు వేమరినాడు. ఆ మహాకవి ప్రాశ స్త్యమును దెల్పుటకీ కారణములు చాలునను కొందును.

ఈ పుస్తకములో మూడు ఉపన్యాసములున్నవి. మూడును ముత్తెఱగుల సంఘటించినవి. ఉస్మానియా యూనివర్సిటీవారు నాపైని యభిమానముతో నీ ఉపన్యాసము లేర్పాటు చేసిరి. వారికి కృతజ్ఞతలు. భీమవరము శ్రీరామరాజభూషణ సాహిత్య పరిషత్తువారు దీనిసచ్చువేయు బాధ్యత స్వీకరించినారు. వారి హృదయములకు నా నమస్కారములు.

వసుచరిత్రకు సమగ్రమైన వ్యాఖ్యానము రచించు తలపు వాకున్నది. అది ఎప్పుడో ఎట్లో చెప్పలేను. నా రచనలు ముందున్నవి. సాహితీపరులు వీని నెట్లాదరింతురో చూడవలెను.

పుట్టపర్తి నారాయణాచార్యులు.

నీ రా జ న ము

ఆగర్భ శ్రీమంతులకు ఉత్తమ గుణాశయాలు, సంస్కృతీ భావ సంపన్నత, లలితకళా ప్రియత్వం, నిరాడంబరత్వం, దాతృత్వం అలవడుట అరిది. కాని మా శ్రీ తుమ్మలపల్లి మంగరాజుగా రట్లు కాదు. అన్ని సుగుణాలను తనలో విలీనంచేసుకొన్న సంస్కారపరుడు. లక్ష్మీపుత్రునిగా జనించి భోగభాగ్యాలను కరతలామలకం చేసికొన్నను ఉన్నతాశయ ప్రేరితుడై మహోదారగుణ సంపన్నుడై, సంగీత సాహిత్యకళాభిమానియై దైవభక్తి దాతృత్వములను తనవిగా జేసి కొని జీవితాన్ని ఉన్నతపథంలో నడుపుచున్న ధన్యజీవి.

వీరి జనకులు శ్రీ సీతామహాలక్ష్మి కృష్ణమూర్తిగారలు. తండ్రి శ్రీ కృష్ణమూర్తిగారు సనాతన ధర్మనిష్ఠా గరిష్ఠుడు. దాన శీలి. పెక్కురు భూసురులకు గృహ నిర్మాణానికి భూదానం చేసిన పుణ్యపురుషులు. తణుకులో 'శ్రీ తుమ్మలపల్లి కృష్ణమూర్తి విశ్రాంతి భవనం' అను పేరుతో ఒక పెద్ద విశ్రాంతి భవనమును నిర్మించి, దాని పోషణకు ముప్పది యకరముల మాగాణి భూమిని ప్రాసి యిచ్చిన వదాన్యుడు. ఈ భవనం సాలుపొడుగునా వివాహాది శుభ కార్యములకు కేంద్రమై 'నిత్యకళ్యాణం - పచ్చతోరణం' గా భాసిల్లు చున్నది.

తండ్రిగారి దాతృత్వభావం, ఆధ్యాత్మిక చింతనాసక్తి కుమారునకు సంక్రమించినవి. శ్రీ మంగరాజుగారు జన్మస్థానమైన రేలంగిలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి, హైస్కూలు భవనానికి, నరసాపురం లోని స్త్రీల కళాశాలకు, తణుకులోని ఆర్ట్స్ కళాశాలకు భూరి విరాళములిచ్చినారు. భీమవరంలోని పురమందిరం, సంస్కృత కళాశాల, ఆర్య వైశ్యసంఘం, వేదపరిషత్, శ్రీ రామ రాజభూషణ సాహిత్యపరిషత్, అంకాల ఆర్ట్స అకాడమీ-ఆదిగాగల సంస్థలు వీరి ఆర్థిక సహాయాన్ని అందుకొన్నవే. భీమవరంలోని అన్ని ప్రజాసంస్థలు వీరి ఔదార్యాన్ని చవి చూచినవే. పెక్కు-సంస్థల ఆధ్వర్యమున భీమవరంలో వీరికి జరిగిన సన్మానోత్సవం, కనకాభిషేకం

వీరి పట్ల పౌరులకున్న గౌరవాభిమానాలను, ప్రేమాను రాగాలను ప్రతిబింబించినవి.

వీరు జరుపుకొన్న షష్టిపూర్త్యుత్సవము భీమవరం చరిత్ర లోనే ఒక అపూర్వ సంచలనము కల్గించిన సంరంభముగా పేరొక్కన తగినది. రాష్ట్రం నలువైపులనుండి విచ్చేసిన ఎందరో కవి పండితులు, గాయకులు, నటకులు, రచయితలు ఉత్సవంలో ఉత్సాహంతో పాల్గొన్నారు. రాష్ట్రనాయకులు, అమాత్యులు ఉన్నత ప్రభుత్వో ద్యోగులు సభనలంకరించి వారిని ఘనంగా ప్రశంసించారు. కవితా గోష్ఠులు, కవి సమ్మేళనములు 'భువన విజయం' ప్రదర్శనం జరిగినవి. పట్టణమంతా కోలాహలం చుట్టు ముట్టినది. పసిడికాంతులు ప్రసరించి నవి. వారి యశస్సునకు తులతూగినది నాటి ఉత్సవ వైభవ దీప్తి.


సరస్వతీపుత్రుల నాదరించుట, సత్కావ్యశ్రవణం, ఆధ్యాత్మిక ప్రసంగముల నాలకించుట వీరికి ప్రీతికరమైనది. పెక్కుమారులు సకుటుంబంగా దేశములోని అన్ని పుణ్యతీర్థములు సేవించి వచ్చినారు. అనేక ధర్మకార్యము లొనర్చినారు. భీమవరంలో తనపేర 'శ్రీతుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనము' ను నిర్మించుటకు ఒక నిధిని ఏర్పాటు చేసినారు.

ఈ మహనీయుడు ఈ గ్రంథముద్రణకు మా పరిషత్తు అధ్యక్షులు శ్రీ భూపతిరాజు రామకృష్ణంరాజుగారు, గౌరవ సభ్యులు శ్రీయుతులు బొండా సత్యనారాయణమూర్తి, తటవర్తి వెంకన్న గుప్తా గారలు అడిగినదే తడవుగా నైదువందల రూపాయలు విరాళ మిచ్చి గ్రంథ ప్రచురణ శీఘ్రం గావించుటకు తోడ్పడినారు. వారికి శ్రీ రామరాజ భూషణ సాహిత్యపరిషత్ తన కృతజ్ఞతాభివందనాలు సమర్పించు కొనుచున్నది.

వైశ్య సద్వంశీయులైన శ్రీ మంగరాజుగారి సత్కార్య సేవా నిరతి ఫలించి దేశ సౌభాగ్యమునకు దోహదకారి యగుగాక!

ఇట్లు
చుక్కన గంగరాజు
కార్యదర్శి

భీమవరం
19-11-70



పరిషదుపాధ్యక్షులు, ముద్రణదాతలు :

శ్రీ తుమ్మలపల్లి మంగరాజుగారు, భీమవరం.

వసుచరిత్ర సాహితీ సౌరభము

శా. "శ్రీరామక్షితిపున్ మదగ్రజు జయశ్రీలోలు, నానాకళా
పారీణున్ బహు సంస్కృతాంధ్రకృతులం బల్మారుమెప్పించి, ద
ర్శాకారుణ్యంబున రత్నహారమయ వేదండాగ్రహారాది స
త్కారం బందితి, రామభూషణకవీ! ధన్యుండ వీ వన్నిటన్"
(1-17)

పై పద్యము వసుచరిత్ర పీఠికలోనిది. తిరుమల దేవరాయడు భట్టుమూర్తినిఁ గై వారముజేసిన శ్రీమాట. 'రామక్షితిపుఁడు' జయశ్రీలోలుఁడు. ఇందులో నతిశయోక్తి లేశమునులేదు. భేదోపాయముచే నాతఁడు బహమనీ సుల్తానులను, సూత్రధారుఁడు బ్రమానిబొమ్మలను వలెఁ దకతక లాడించెను. కడకాయుపాయుమే యాతనికొంప దీసినది. తళ్లికోట యుద్ధమున దుష్కాలమతనిని గాటువేసెను. ఆ కాటు సామ్రాజ్యమునకే వేసినట్లైనది. అటుతరువాత విద్యానగర ప్రభలు వెలుఁగలేదు. వెలిఁగినను వెలిఁగినట్లు వెలుఁగలేదు. రామరాయలు నానాకళాపారీణుఁడట! కృష్ణరాయఁడు వీణలో నేర్పరి. అళియ రాముఁడును వీణావాదన కుశలుఁడు. సంగీత సాహిత్యములలోఁ జిక్కని ప్రవేశము గల్గించుకొనుట కానాటి రాజవంశములకుఁ జిక్కని యవ కాశము లుండెను. రాజనీతిశాస్త్రములు బోధించినట్లే కళలనుగూడ వారికి బోధించుచుండిరి. సాధ్యమైనంతవఱకు నన్నివిద్యల సంప్రదాయ ములను వారెఱుఁగవలెను. దేనియందును అభినివేశముండరాదు. రాజున కొక్కదానియందే పక్షపాతమున్నచోఁ దక్కినవిద్య లుపేక్షింపఁబడును. వానిని నేర్చినవారు బస్తుండవఁసివచ్చును. అది రాజనీతిగాదు; అందుకే రామరాయలు 'నానాకళాపారీణుఁడై'నది. పారీణుఁడనగాఁ దెలిసినవాఁ డన్నమాట! పూర్వకాలమున శాస్త్రములేని సాహిత్యము రాణించుట

లేదు. దానిని వారు 'గొడ్డు సాహిత్యమ'ను చుండిరి. విజయనగర కాలమున సాహిత్యమునకు సంగీతమునుఁదోడైనది. నాచనసోముఁడు అష్టదిగ్గజములు మొదలైన వారి రచనలలో సంగీతమునకుగూడ బాలున్నది. సాధారణముగా నాటి నాగరకులు వీణె నేర్చెడివారు. అది యెంత లలితమో యంత గంభీరము. శూద్రకుఁడు వీణెను 'అసముద్రోద్భవమైన రత్నమ'ని పొగడెను, 'కిన్నెర' 'సితారు' మొదలగునవి విజయనగరవీథులలో నప్పుడప్పుడే తొంగి చూచుచున్న వాద్యములు. భట్టుమూర్తి సంగీత సాహిత్య నామకములైన సరస్వతీదేవి రెండుచన్నుల పాలును కడుపునిండ ద్రావి 'గట్టున' ద్రేన్చినవాఁడు. 'సంగీత కళా రహస్యనిధి'. వసుచరిత్రలో సంగీత విద్యా నైపుణ్యము మూఁడు పూవు లాఱుకాయలుగా నున్నది. సంస్కృతాంధ్రభాషా సామ్రాజ్య సర్వంకషమైన పరిశ్రమ యాతనిది. చతుర్విధ కవితా నిర్వాహకుఁడు పెద్దన్నగారును దమ్ముగూర్చి "చతుర్విధ కవితామ తల్లిక" యని గొప్పగాఁ జెప్పికొన్నారు. ఈ చతుర్విధ కవిత్వములేవి? ఇవి కావ్యధారకు సంబంధించినవి,

'నలుదెఱంగుల నెన్నఁగల కావ్యధారలఁ ఘనుఁడ'నని తెన్నాలి రామకృష్ణుఁడు తీడి పొగడికొనెను. 'సాహిత్య రస పోషణుఁడ'ను బిరుదముగూడ భట్టుమూర్తికిఁగద్దు. ఈ బిరుదము నాచన సోమనాథున కుండెను. సోముని చమత్కార ప్రియత్వము శ్లేషాభిమానము రామ రాజ భూషణుని రచనకుఁ గొంత పెట్టుబడి యనుటలో సత్యము లేక పోలేదు. అతనివలెనే యితఁడును క్రొవ్విన వైదుష్యము గలవాఁడు. చదివిన చదువును వ్రాతలోఁ జూపవలెనను రాజసమును రక్తియు నెక్కువ ధారాశుద్ధిని నన్నయ్యనుండి నాచన సోముఁడు నేర్చెను. మూర్తికవియు దానినే రచనలోఁదీర్చెను. రామరాయలను 'బహు సంస్కృతాంధ్ర కృతులతో' భట్టుమూర్తి 'పలుమారు' మెప్పించెనట! అది కనపడకుండుట మన దౌర్భాగ్యము. ఒకటి రెండైన సంస్కృత రచనలు దొరకినఁ బాగుండెడిది. భట్టుమూర్తికి రామరాయలే గొప్ప వైభవమును జేకూర్చినది. 'రత్నహార హాయ వేదండాగ్రహారము'లను గూర్చెను. 'రామభూషణకవీ!' అని యాదరముతో బిలిచినాఁడు.

రామరాయల కాలమున ప్రాసిన గొన్నిచాటువులు వసుచరిత్ర పీఠికలోఁ జోటుచేసికొన్న వేమో! సందర్భవశాత్తు అప్పుడప్పుడు చెప్పిన పద్యములను దమ కావ్యములోఁ జేర్చికొనుసలవాటు నాటి కవుల కుండెను. గడచిన దశాబ్దములలో మూర్తికవిపైనను గొన్ని విమర్శనములు సాఁగినవి భట్టుమూర్తియష్టదిగ్గజములలోని వాఁడని కొందఱు, కాఁడని మరికొందఱు మూర్తి కవిని గూర్చి నాల్గుముక్కలు చెప్పిన వారిలో గొంత వెలగలిగిన మాటలన్నది వర్ధుల వారే. రాయల దిగ్గజములలో భట్టుమూర్తియు నుండెననుటలో నామట్టుకునాకు నమ్మకమున్నది. మూర్తికవి రాయలకన్నను పదిసంవత్సరములు పెద్ద వాఁడనుకొన్నను సుమారు ముప్పదియవవయస్సున భువనవిజయమును జేరియుండవచ్చును. ముప్పదియేండ్లకు గొంత చెప్పదగిన పాండిత్య మబ్బుటలో నాటి విద్యా పద్ధతుల ననుసరించి యబ్బుర పడవలసినది లేదు పైఁగా రాజుల యాశ్రమములు లభించుటలో విద్యా వయస్సులే ప్రధానములుగావు. నేటివలెనే నాఁడును రాజకీయములు బనిచేసెడివి. పులివెందుల తాలూకాలో 'గసుమార'ను నొక గ్రామమున్నది. అచ్చట భట్టుమూర్తి వీధిబడి చెప్పికొను చుండెనట. రేనాటిరెడ్ల యాశ్రమముతో నాతఁడు పెమ్మసాని రామలింగనాయకుని యనుగ్రహము సంపాదించెను. రామలింగనాయకుఁడు రాయల సర్వసేనాని. ఇఁక మూర్తికవి రాయల యాస్థానములోఁ జేరుటలో నాశ్చర్యమేమున్నది? ఈ ప్రయత్నములోఁ దిమ్మరుసు వక్రించినట్లును గొన్నికథలు లేకపోలేదు. భట్టుమూర్తిని దక్కిన కవులు రక్తికి రానివ్వక రాపాడినట్లు జనశ్రుతి గలదు. రాయలకడఁ జేరినప్పటి నుండియే యాతఁడు అళియ రామయ్య నాశ్రయించుటకు శ్రీకారమును జుట్టి యుండును. దాని కంకురార్పణమే నరసభూపాలీయము. రామరాజు కాలముననే యాతఁడు వసుచరిత్ర నారంభించి యుండునని నాతలపు. ఆ చిత్తారిపని ఒకటి రెండు సంవత్సరములలో ముగిసినదిగాదు వసుచరిత్ర రచన సాఁగుచున్న దినములలోనే రామరాయలు గతించెను. విద్యానగరము పాండవ బీడైనది. తిర్మలుఁడు బెనుగొండకు బరుగెత్తినాఁడు. మూర్తికవియు నాతని వెంటనే వచ్చెను. ఆ యొంటికంటి తిరుమలునే

"లజ్జావతీ మనోజ" యని సంబోధించి యాత్మను దృప్తిపఱచి కొన్నాఁడు. తిర్మలునకుఁ దళ్ళికోట యుద్ధములో నొక కన్ను వోయినది. వసుచరిత్ర కృతి తిర్మలరాయలను వలఁచునాటికి మూర్తికవి యెనుబది యేండ్లవాఁడై యుండవచ్చును. ఆకాలమున నొకవ్యక్తి సుమారెనుబది తొంబది వర్షములు జీవించుటలో నసాధ్య మేమో నా కర్థముగాదు. తళ్ళికోట యుద్ధమునాటికి రామరాజు వయస్సు తొంబదియెను. ఆ పండుముసలి కత్తిబట్టి కాలరుద్రునివలెఁ బోరెను. పీఠికా భాగములు గ్రంథరచన యైన తరువాతనే వ్రాయుట వాడుక యని మావైపు బెద్దలచే నే విన్నమాట!

రామరాజ భూషణుఁడను నది బిరుదనామమని యంద రంగీకరించిన విషయమే. భట్టు జాతివాచకము, మూర్తియనునది సంపూర్ణ నామముగాదు ఏకదేశము. పూర్తిపేరు మఱేదో యై యుండును. ఇంటిపేరు ప్రబంధాంకముగారు. మూర్తి కనేక నిఘంటువులు నోటికి వచ్చెడివి. శ్లేష యందలి యాతని యభిరుచి కదియుఁగారణమై యుండ నోపును. అతఁడు వీథులలోఁ బోవువప్పుడు వేదపండితులు గూడఁ దమ తమ యధ్యాపనము లాపుచుండిరట! భట్టుమూర్తికి వేదమువచ్చి యుండుననుటలో నర్థములేదు, వేటివలె నాఁ డంద రన్నివిద్యల కెగఁ బ్రాకెడివారు గాదు. మరి యై కథ యాతని పాండిత్య ప్రకర్షకు ద్యోతకముగా నల్లఁబడి యుండును. భట్టుమూర్తి నెదిరించినవారిలో తెన్నాలి రామకృష్ణుడు, అయ్యలరాజు రామభద్రుఁడు మొదలైన వా రున్నారు. పెద్దనామాత్యులు గూడ నొకరీతిగా భట్టుమూర్తికిఁ బ్రతిద్వంద్వులే. ఒకనాఁడు కవులు వాకిటి కావల తిమ్మని యింటి ముందు గూర్చొని యుండిరట! వారిలోఁ గవితా పితామహులుగూడ నున్నారు. వాకిట కావలివాఁడనఁగా నా కాలమునఁ జాల గొప్ప యధికారము. వానిహోదా ఒక సామంతరాజుకన్ను చిన్నదిగాదు. ఆతని యింటిముందు పెద్దనామాత్యులవంటి వారు గూడఁ జేరియుందు రనుటలో నాశ్చర్యములేదు. 'మాధవుఁడను' దన శిష్యునితోఁ గూడఁ బోవుచు భట్టుమూర్తి—

"వాకిటి కావలి తిమ్మని
వాకిటి కవికోటి మాధవాఁకిటికోశే !"

అన్నాడట ! ఆ పలుకుల పెద్దన్నగారి చెవిలోఁబడెను. వారిట్లు విభాళించిరి—

'ప్రాకృత సంస్కృత ఘూర్జర
మూకీ కృత కుకవితుంగముస్తాతికిన్ !!
వాకిటి కావలి తిమ్మని
వాకిటి కవికోటి మాధవా ! కిటికోశే!!'

సంస్కృత ప్రాకృతాదులు భట్టుమూర్తి యెఱుఁగఁడని పై పద్యమునకుఁ దాత్పర్యము. పెద్దనామాత్యులు బెద్దలు. వారు వైదుష్యమూలముగ నాధికారికముగ నెట్లైనను మందలించి యుండవచ్చును. మన యోగ్యతకు మాత్రమామాట చాల బరువైనది. మూర్తికవి పెద్దన్నగారి శిష్యుఁడని యొక వాదమున్నది.

[1]ఆంధ్ర కౌముదీకారుఁడీ విషయమునుఁ జెప్పెను. దీని కుపష్టంభకముగా నొక కథయుఁ గలదు. పెద్దనామాత్యులు గతించిన తరువాత మూర్తికవి వారి కుటుంబము నోదార్చుటకై వెళ్ళినట !

"అమ్మా ! కవితా పితామహులు గతించిరిగదా ! వారి సంతాన మికనెట్లు బ్రతునో"యని దుఃఖమును వెలార్చినాఁడు.

ఈ మాట యాసాధ్వి యెదలోఁ గ్రుచ్చుకొన్నది. "నాయనా ! వారి తండ్రివలె మహాపండితులు, మహాకవులుగా లేక పోయినను శ్లేష కవిత్వము లల్లి యైనను బ్రతుకుదురు లెమ్మ"ని యామె బదులిచ్చినదట !

ఈ కథపై నాకంత నమ్మకములేదు. పెద్దన్నగారికుటుంబములో మరలఁ బ్రసిద్ధు లెవ్వరును గానరారు. ఒకవేళ నీకథ నిజమైనను దీనిచే మూర్తికవి పెద్దన్నగారి శిష్యుడనుటకు బలము చాలదు. పైఁగా మను వసుచరిత్రలను బోల్చి చూచినప్పుడు మూర్తికవిలో

---

(1) మత్ప్రత్యయా భావస్య, అల్లసాని పెద్దనార్య శిష్యేణ, భట్టుమూర్తి మహాకవినా, విరచితే, వసుచరిత్రే.

నడుగడుగనను, 'స్వారోచిష మనుచరిత్ర'తో స్పర్థయే గన్పడు చున్నది.

ఆంధ్ర కౌముదీ కారుని మాటపైనను నాకు ప్రత్యయములేదు. మతద్వేషములతో వైయక్తిక స్పర్థలతో వెన్నెయో యభూతకల్పనలు పుట్టిన కాలమది. అప్పయ్య దీక్షితులును చంద్రగిరిలోని తాతయ్యయును, జేసికొన్న నిందలు ప్రయత్నములు బెట్టిదములు. చిదంబరమున గోవింద రాజస్వామి పునఃప్రతిష్ఠలో జరిగిన ఘోరము శైవ వైష్ణవములకే కళంక ప్రాయము. నేఁడుమాత్ర మేమిదప్పినది! పండితులు పాండిత్యములో నెంత పెద్దలో బరస్పర నిందలలో నంతే పెద్దలు; నన్ను దమ శిష్యుఁడని చెప్పినవారే చాలమంది యున్నారు. ఒకరీతిగా నేను ప్రపంచమున కంతయును శిష్యుఁడను. కాని నేను పుస్తకమును పట్టి చదివినది మాత్రము తిరుపతిలో.

మూర్తికవి పెద్దన్నగారి కడ విద్యాభ్యాస మొనర్చినచో మను వసుచరిత్రల కట్టి స్పర్థయుండి యుండదేమో యని నా యనుమానము; లేక చిన్ననాఁడు నాలుగు ముక్కలు నేర్చికొనియున్నను, బెద్దవాఁడైన భట్టుమూర్తికి లోకము కృతఘ్నతను నేర్పి యుండవచ్చును. ఒకఁడు చదివికొన్నంత మాత్రమున వానిని సర్వ సద్గుణములును వలచి వచ్చు నన్నంత విశ్వాసము నాకులేదు. లేక వయోజ్ఞానములలోఁ బెద్దవాఁడైన దానివలన పెద్దనామాత్యులను మూర్తికవి బాహ్యాముగ గౌరవించి యుండవచ్చును. పెద్దన్న, నాటి రాజకీయములలోఁ జేయివేసినవాఁడు; రాయల యష్టమంత్రులలో నొక్కఁడు. ఆ మహామంత్రికిఁ జేదోడు వాదోడు. బంధువుగూడ నేమో! అట్టివానినిఁజూచి తక్కినవారు భయపడుటలో నాశ్చర్యములేదు. అందుకే మూర్తికవి పెద్దన్నతోడి వైమనస్యమును రచనలోఁ దీర్చికొందమని తలఁచియుండ వచ్చును. ఎట్లు చూచినను వారిరువురిలో జిగీషయే యెక్కువగా నున్నట్లు నాకుఁదోచుచున్నది.

మూర్తికవి ధారాశుద్ధి తక్కిన కవులవంటిదికాదు. సామాన్యముగ ధారాశుద్ధి యనఁగా యతిప్రాసలలోఁ గుంటువడక పదములను

తీగదిగిచినట్లు నడపుట యని యర్థము. నన్నయ మొదలు ధారాశుద్ధి గలవాఁడని మనమనుకొను కవులందఱు నీకోవకుఁజెందినవారే. భట్టు మూర్తి ధారాశుద్ధి యందుకు భిన్నము గజిబిజిగాఁ బెరిగిన యడవి వంటిదిగా దాతనిధార. పాదులుదీర్చి, ప్రోదిసేసిన చక్కని యుద్యాన వనమది. చెట్లయాకులను గూడ మట్టసముగాఁ గత్తిరించి యుంచును. [2]"దూరీకృతాః ఖలుగుణైః" అన్న కాళిదాసునకును కాదు కాదనియే, యాతని యుత్తరము. ఈ యందిము కృత్రిమముగదా! యను వారి కాతని సమాధానములేదు. అట్టివానినిఁ బ్రేమించుటయుఁ బ్రేమింపక పోవుటయుఁ బ్రత్యేక మనస్సులకు సంబంధించిన విషయము. తాను గాంక్షించినయంద మట్టిది.

కోలాహలుఁడు శుక్తిమతి చెంత కరుదెంచినపు డామె చెప్పిన యొక పద్యమున్నది. అది యీక్రిందిది.

సీ. అతుల శైవలవతీశతము లీనెడు మీకు
నా యిచ్చు విమలార్ఘ్య తోయమెంత
ప్రాలేయ నిలయ సంభవముగాంచిన మీకు
పన్నీటి నొనరించు పాద్యమెంత
సరస మందార మంజరుల రంజిలు మీకు
బెనచి పూదండ లర్పించుశెంత
గోరత్న దోహన గురులక్ష్మగల మీకు
నుపడగా మణివర్గ మొసఁగుశెంత

"అనఘ! యెవ్వారలైన కొండంత వారి
కవని కొండంత పూజ సేయంగ గలరె!
భక్తి నేనిచ్చు నీపుష్ప పత్రతోయ
మాత్రములు గైకొనుశెగాక! గోత్రతిలక!

—పైపద్యముననెంత వినయమున్నదో యంత దార్ష్ట్యమున్నది. వినయము వాచ్యమే. కాని కోలాహలునియందున్న జలము శైవాల పూరితము.

---

(2) దూరీకృతాః ఖలుగుణైరుద్యానలతా వనలతాభిః. (శాకుంతలము)

మరి తానిచ్చునది విమలార్ఘ్యతోయము. కోలాహలుఁడు ప్రాలేయ నిలయసంభవుఁడు. తానొసఁగునది పన్నీటి పాద్యము. మందార మంజరులతో రంజిలు నాతనికి భక్తిమతి పెనచి పూదండలర్పించునట! మంజరులది వెట్టి పెంపు. రత్నము లాతఁడు కొల్లలు గలవాఁడు; తానతనికి మణివర్గము నొసఁగును. పై పద్యములో భట్టుమూర్తి పదములెంత సార్థకముగా వాడినాడో పండితులకు నే జెప్పవలసినది లేదు. "శైవలవతి" "తోయము" "ప్రాలేయము మందారము రత్నము మణి" యీ శబ్దములన్నియు వాని వ్యుత్పత్తినిబట్టి సార్థకముగాఁ బొందింపఁబడినవి. పైగా గోత్రతిలక! యని వెక్కిరించు చున్నది; 'గాం భువం త్రాయతఇతి' గోత్రః అని వ్యుత్పత్తి, లోకమునకు క్షేమమును గల్పింపవలసిన వాడవుగదా! నీవే యిట్టిపనికిఁ బూనుట న్యాయమా! యని యెత్తిపొడుపు. కొండంత వాఁకి-గొండంత పూజ యనుమాట పరమసార్థకముగా వాడినాఁడు. [3]"పుష్ప పత్రతోయ మాత్ర"ములను నది భగవద్గీతా శ్లోకమును జ్ఞాపకము దెచ్చుచున్నది: ఈ క్రింది దట్టిదే మరియొక పద్యము.

సీ. ధ్యానంబు హృదయ వాస్తవ్య కుటుంబికి
నానాహనమ జగద్వ్యాపకునకు
నర్ఘ్యపాద్యములు నారాయణ ప్రియసూతి
కభిషేకమబ్ధి కన్యాంకశాయి
కరదోయిళ్లు పువ్వుల వింటిదొరకు, గం
ధము, గంధగిరి మరుద్బాంధవునకు
ధూప మప్రతిమ ప్రతాపోష్మ సురభికి
దీపంబు తిమిర భయాపహునకు

గీ. మధుర సఫలోపహారంబు, మధుపకీర
పరిజన పరాయణున కంచు భక్తి నొసఁగి
మానమథనాయ, మదనాయ, మధుసఖాయ
మనసిజాయ, నమోనమో యనుచు ప్రమొక్కి. (3-170)

---

(3) పత్రం పుష్పం ఫలంతోయం, యోమే భక్త్యాప్రయచ్ఛతి,
తదహంభక్త్యుపహృత, మశ్నామి ప్రయతాత్మనః.

గిరిక మన్మథపూజసేయు సందర్భములోని దీసీసము. ఈమెయు తల్లివలెనే సాహిత్య విద్యలో నేర్పరి; ఆమె యేమనుచున్నది? మదనున కున్న వానినే యాతనికి సమర్పించు చున్నది. ఈ పద్యమునఁ గందర్పునకు వాడిన చతుర్థ్యంతములు సహస్ర నామము నందువలె నున్నవి. సందర్భోచితములై నవి.

ప్రబంధ కవులందఱును పరిమాణమున కన్నను గుణమెక్కువగా నుండవలెనని భావించినవారు. పురాణశయ్యవేరు. కావ్యశయ్యవేరు. భట్టుమూర్తి కా గుణము మఱియు నెక్కువ. అందము లేనిచోట తానై నకల్పించికొని యాతడు తృప్తిపడును. అందుకే మూర్తికవి యెన్నోపద్యములు వేఱు వేఱుగాఁ జదువుకొన్నప్పుడును 'హాయి, హాయి' యనిపించును. తనమార్గమున నాతఁడు విశంకటుఁడు.

ఈ క్రింది పద్యమును చిత్తగింపుఁడు—

సీ॥ మోహోపదేశ తమోముద్రితములైన
కనుదమ్మ్రొల హిమాంబు లనుపరాదు,
శ్రమబిందు తారకాగమ భిన్నకుచకోక
మల చంద్రనామంబు తలఁపరాదు.
శీర్ష దాశావృంత శిథిలతాసులతాంత
మసి యాడ వివనల్ విసరరాదు
పటుతాప పుటపాక పరిహీణ తనుహేమ
మింక పల్లవ పుటార్చిడగరాదు

తే. గీ॥ లలనకానంగకీలి కీలా కలాప
పంతతాలీఢ హృదయ పాత్రాంతరాళ
పూరిత స్నేహ పూరంబు పొంగిపొరల
చల్లని పటీరసలిలఁబు చల్లరాదు.

— అర్థము దెలియక పోయినను దీనియందలి శబ్దాలంకారమే యొకటికి రెండుమారులు పాఠకునిచేతఁ జదివించికొనును. అర్థముదెలిసిన తరువాత దానిని వాఁడు పదిసారులు జదివికొనును. పై పాదములలో 'సలము' లే యెక్కువగ నడచినవి. సూర్యగణము లొకచో క్రమమునఁ

బొందింపఁ బడినవి. స్వరసాహిత్యములఁ గూర్ప నేర్పఱిచియైన నొక వాగ్గేయకారునిదీ రచన. ఏ రాగములోనైనను దీనికట్లే స్వరములను గూర్చినచో, నీ సొంపు మీ కింకను బదిలింత లర్థమగును, మొదటి పాదము పల్లవివలె నున్నది. ప్రతి చరణము నది యెంతయో సౌందర్యముతో నందికొనును. 'సాహిత్య మాలోచనామృత' మనెడు మాటను రామరాజ భూషణుని వలె మననము జేసినవారు చాల తక్కువయనిపించును. బ్రహ్మాండమైన వ్యుత్పత్తి యగుటచే శబ్దము నాతఁడు మైనముగవలె వంచికొనును. చమత్కారములో నాచనసోమఁడు వ్రేలు సూపఁగా నీతఁడు హస్తమునే ప్రమించెను. కవితలో నాతఁడు సేయు నింద్రజాలముల కంతులేదు. ఈవిషయము పైపైన మరికొంత వివరముగా మనవిసేతును.

గిరికాదేవిని భక్తిమతి యత్తవారింటి కంపుచున్నది. ఆమె కూతు నిట్లోదార్చినది.

ఉ. తమ్ములఁబంపుదున్ మణిశతమ్ములఁ బంపుదు రాజహంసపో
తమ్ములఁబంపుదున్ పరిచితమ్ములఁ గాననదేవతాళిజా
తమ్ములఁబంపుదున్, ద్రుతగతమ్ములనేనును సారణీ ప్రపా
తమ్ములవత్తు విశ్వవిదితా! ముదితా! మదితాపమేటికిన్.

—'తమ్ముల' బంపుదునని యారంభించిన భక్తిమతి యీ పద్యములో నెంతమంది తమ్ములఁ బంపినదో మీకర్థమై యుండును. పద్యము యొక్క ముగింపు తిన్నఁగాఁ బన్నీరు జల్లినట్లున్నది.

గిరికాదేవి మన్మథార్తి ననుభవించుచున్నది. అప్పటి యీమె చెలికత్తెల కలఁత యిట్టిది.

క. ఏ మంద మేమి సేయుద
మేమందని మందలింత మేమంది మె, యిం
దేమందయాన నడ గుద
మే మందర కుచు దరళహృదయాంబుజలై.

—యీ పద్యమున శబ్దాలంకార మున్నది. అదియ స్థానపతితము గాదు. అప్పటి యా చెలిక త్తెల భావస్థితి నది సమగ్రముగఁ జూపుచున్నది. ఇంతకును రామరాజభూషణునకు శబ్దాలంకారములపై మక్కువ గొంత యెక్కువ. చెవులలోఁ బడినంతనే యీడ్చికొనిపోవు చౌడయ్య గారి ఫిడిలువంటి దాతనిశై లి. అది యొడలు మఱపింపదు. ఆశ్చర్యమును గొలుపును. ఇట్టి సాధన మనుష్యునకు సాధ్యమా యని పించును. ఈ పద్యమట్టిది.

సీ॥ పవమాన మానవ ప్లవమానకై రవ
చ్యవమాన జవము మైనఁట దివురు
కరసార సాగ్రతా మరసాతి సాంద్ర శీ
ధుర సా ప్తి గన్నీరు దుడువఁగోరు
మదనానలప్రభా సదనా ప్రకోమల
చ్ఛదనార్చిపై చూపు జగపఁజూచు
సలయా హత లతాకిసలయాగ మలయాగ
నిలయా నిలునకూర్పు దెలుఁపదలఁచు

తే॥ గీ॥ గుంజపుట గుంజదళి పుంజ శింజితంబు
వెగ్గలంబైన చెవియొగ్గి విసఁగడంగు
పంచశరభూత పరిభూత పంచభూత
ముల తదీయ స్థలంబుల గలుపుకరణి.

ఇట్టి పద్యమే పెద్దనగా రొకటి ప్రాసిరి. అది యిది :

సీ॥ చనుగప్పు దొలఁగ వాసన గాలికెదురేగు
బరువొప్ప నలుగులఁ బారుకరణి
నిడుద వేనలనూనె ముడివీడఁ జిగురాకుఁ
బొదఁదూఁకుఁ గార్చిచ్చుఁ గదియుకరణి
బసిడి గాజులుపైకి వెసఁదోఁచి నునుదీఁగ
దెమలించు నురిప్రాడు నెమకుకరణి
మొలనూలు బిగియించి వెలఁది వెన్నెలఁజొచ్చు
చిఱుదీయ కేటిలో నురుకుకరణి

గీ॥ జడియ దళులకుఁ గురియు పుప్పొడుల మునుఁగు
మావికడనిల్పు, విరుల నెత్తావి గ్రోలు
విషమ సాయకునేపుల విసివి విసివి
తనువు దొఱఁగంగ దలఁచి యవ్వనరుహోక్షి.

ఇట్లై ఛందములో 'చనుగప్పు దొలఁగ' నిడుదవేసలి నూనె ముడివీడ' పసిడి గాజులు పైకి వెసత్రోచి మొలనూలు బిగియించి' యనునవి వరూధినిని, నాటకములోని పాత్రనువలె మన కన్నుల యెదుట నిల్పుచున్నవి. అభినయ సంపద చక్కగా నున్నది. కాని వాగన గాలిని నలుగులతో బోల్చుటంత పుష్టిగాలేదు' ఎదురేగు అను క్రియయే రఱుకము, గీతమంతయు విరహోద్దీపకములైన వస్తువులను మాత్రము దెల్పుచున్నది. మూర్తికవి పద్యములోని శబ్దార్థయోజనా చమత్కారము మీకు వేఱుగా వింగడింపవలసిన పనిలేదనిపించును. పంచభూతములను వానిలోనే గలుపుటయుక్తమే: గాలులు చిగురుటాకుల గదల్చుటయు 'లయానుబంధము'గా నున్నదట! గానమున నాతనికున్న దాహ మట్టిది!

ఇట్టి పద్యములు వసుచరిత్రలోఁ గొన్ని పదులకున్నవి. ప్రథమాశ్వాసములోనే వసంతవర్ణన మారంభించుచు-

సీ॥ లలనాజనాపాంగ వలనా వసదనంగ
తులనాభి కా భంగదోః ప్రసంగ
మలసానిల విలోలదళ సాసవరసాల
ఫల సాసవ రసాల పనవిశాల
మలినీ గరుదనీ కమలి నీ కృతధునీ క
మలినీ సుఖితకోకకుల వధూక
మతికాంత సలతాంతల తికాంతర నితాంత
రతికాంత రణతాంత సుతనుకాంత

తే॥ మకృత కామోద కురవకా వికలవకుల
ముకుల సకల వనాంత ప్రమోదచలిత
కలిత కలకంఠకుల కంఠకాకలీ వి
భాసురము వొలు\ మధుమాస వాసరంబు.

—అను పద్యమును జెప్పినాఁడు. దీనిని మా ప్రాంతములలో "వీణపై లయబద్ధముగా వాయింపఁగా నేను విన్నాన"ని పూజ్యులు హరి సర్వోత్తమరావుగారు ఒకసారి నాతో ననియుండిరి. అనఁగా నా పద్యము కూర్పు పాటకు సంబంధించిన నియమములైన 'పల్లవి' మొదలైన వానితోఁ గూడియున్నదన్నమాట! ఇట్లెన్ని పద్యములఁ బాడెడివారో! ఒక్కదానినైన ను వినెడు భాగ్యము నాకు లేకపోయినది.

మా వూరికొక వైణికుఁడు వచ్చియుండెను. అతఁడు తన వాద్యములో వేదమంత్రమును బలికింతునని గొప్పగాఁ జెప్పికొనెను. ఇదియొక వెట్టి లె మ్మనుకున్నాను. అతఁడు వాయించెను. అక్కడఁజేరిన రసికులు చప్పట్లు జరచిరి. ఇది వెట్టిలెన్నర లె మ్మనుకున్నాను. "వీణ వేదమంత్రములను బలికించుట కున్నదిగా"దని యా విద్వాంసుఁడు గమనింపకపోవుట దురదృష్టము.

భట్టుమూర్తి పద్యములను పాడుటయనఁగా నట్లు పాడుటగాదు. సలక్షణముగా పాటకుఁగావలసిన హంగులన్నియు దానిలోఁ జేర్చినాఁడన్నమాట!

'కవిత్వ మున్నదందుకుగాదే' యని మీరడుగవచ్చును. నిజమే. కవిత్వ మున్నదందుకుగాదు. కాని రంజక ద్రవ్యమునువలె మాత్రమే వాడికొన్నాఁడని నామనవి. సంగీతమున సాహిత్యమున్నట్లు, ముఖ్యముగా కవిత్వము, సంగీతము, నాట్యము యివి పరస్పరాశ్రయముతో జీవించునని నా విశ్వాసము. వేనికవి బ్రదుకుననుట నా యనుభవమున లేని విషయము. అట్లే మూర్తికవి వాడిన,

"ఏల యీ బాల యీ వేళ యీ విశాల
యవనికా భ్యంతరమున కరిగెననఁగ." (వ. 3-69)

"మహికాంత! నిరంతర చింతనింత విం
తనెగులు పూననేల!" (వ. 3-87)

"వచ్చగాకేమి యా వసుమహీపాలు, బా
లా మనోభవునినేలా తలంచె."

(వ. 1-116)

—ఇట్టి వన్నియు సంగీత స్వరకల్పపు బోకడలే. కొందరు ప్రబంధములా పైనవే విచిత్రమైన యాక్షేపణ సేయుదురు. వారు ధరించినవి తిక్కన్నగారి కంటి యద్దములు సోమయాజుల యౌచిత్యము వీనిలో లేదే! యని వారి చింత. నా మనవి యేమనఁగా ప్రబంధకవులు రజో గుణ పూరితులు. సాహిత్యమల్లురు. రచన వారికి గడీ. అట్టి అభిరుచి యున్ననే వానినిఁ జదివికొనవచ్చును. తిక్కన్నవలె వీరు వ్రాయలేదేమి యనుటతోఁబాటు వీరివలె తిక్కన్న యేల వ్రాయలేదు? అని ఎందుకు ప్రశ్నించికొనరాదు? ఇట్టి ప్రశ్నలు వారి వారి యభిరుచులకు సంబంధించినవి. దీనికి మౌనమే సరియైన యుత్తరము. నామట్టుకు నాకు సాహిత్యములో సాములపై నాదరము లేదు. కాని నేనిప్పుడుఁ చేయవలసినది నా భావములు చెప్పుటగాదు. మూర్తికవి రచనాపద్ధతిని వివరించుట.

భట్టుమూర్తికిఁ బ్రధానమైన చూపు చమత్కారమందే యని మొదటనే చెప్పితిని. కావ్యమే-చమత్కృతి కొఱకాతఁ డారంభించెను-యిట్లున్నది.

శా॥ శ్రీ రమ్యంబగు నై మిశంబున, తపశ్శ్రీరాజితా వ్యాజతే
జోరాజుల్, శుక శౌనకాది మునిరాజుల్, సూతజుం జూచి ము
న్నే రాజేంద్రుఁడు దివ్యచిహ్నధరుఁడై యేలెన్ మహీ మండలం
బా రాజేంద్రునిఁ దెల్పు మాకన నతండత్యంత హర్షంబునన్.

చంద్రుఁడు వ్యాజ తేజముగలవాఁడు. అనఁగా సూర్యునుండి తేజస్సును బొందువాఁడని యర్థము. ఈ మునిరాజు లవ్యాజ తేజో రాజులు. మును లడిగిన ప్రశ్నలో మూఁడు విశేషములున్నవి. సూతుఁడు వర్ణింపఁ బోవు రాజులో నింద్రునకున్న గుణము లుండవలెను. అతఁడు దివ్యచిహ్న ధరుఁడు గావలెను. మహీమండల మేలుచుండ

వలెను. ఈ ప్రశ్నలను విన్న సూతుఁడు వారిమాటతోనే పద్య మారంభించినాఁడు. ఆ పద్యమిది.

శా॥ శక్రాపాదిత దివ్య చిహ్నధరుఁడై, చంచద్వి మానాధీరా
జక్రీడా పరుఁడై, యమాత్య మహా సత్వాఢ్యుఁడై చేదిభూ
చక్రేశుండు ధరిత్రియేలె వసుఁజంజ్ఞన్ దచ్చరిత్రంబు ని
ర్వక్ర ప్రౌఢిని విన్నవింతునని వాగ్వై చిత్రితో నిట్లనున్.

మును లడిగినది వక్రప్రౌఢి. దానికి 'నిర్వక్రప్రౌఢి'తో సమాధాన మిత్తు నన్నాఁడు. ఈ విరుద్ధగుణములను బొందించుట కాతఁడేరికొన్న సాధనము వాగ్వైచిత్రి. ఈ కావ్యమంతయు నాగుణమునకుఁ బెట్టని కోట. ఆ చమత్కారము నాతఁ డన్నిరీతుల వాడికొన్నాఁడు. ఈ క్రింది పద్యమును చూడుడు.

శా॥ యాదోరాశి గభీరమూర్తి రఘునాథా ధీశుఁడుద్దండ బా
హాదర్పాంధ సపాదమల్లిక నిజామాత్యుంద్రుంపఁజ
న్యాదూరక్షితిఁ బారు కృష్ణకును గృష్ణాంకంబు నాడబ్బె, చి
చ్ఛీదివ్యన్నయనాబ్జ కజ్జల జలాభీల ప్రవాహంబునన్.

—యాదోరాశి విజృంభించినది. అందుచేఁ బ్రవాహమాభీలమైనది. ఎటు గాకుండును? అబ్జమందును 'అప్' అనఁగా జలమున్నది. కజ్జలములో జలమున్నది. జలములో జలము సరేసరి ఇట్టిదే మరియొకటి-

శా॥ ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేక, రాకానిశా
రాజశ్రీ సభమైన మోమునఁ బటాగ్రం బెత్తి యెల్లెత్తి యా
రాజీవానన యేడ్చె కిన్నర వధూరాజత్క రాంభోజ కాం
భోజీమేళ విపంచికా మృదురవా పూరంబుతోరంబుగన్.

—ఇందులోని గిరికాదేవి-రాజీవానన; కరాంభోజలో 'నంభోజ' ము గలదు. 'కాంభోజి' రాగముగూడ సాంభోజమే. అందుచే జాబిల్లి కోపమునకుఁ బారము లేకపోయిందన్నమాట! ఈ పద్యమున మరి యొక విశేషముకద్దు 'రాకానిశారాజ శ్రీసభమైన మోము'-అని మూర్తికవి యన్నాఁడు. మరల 'రాజీవానన'-యనుచున్నాఁడు. ఈ రెండుపమానములకును బొత్తుకుదురదు. కుదురక-మనము తికమక

లాడవలెననియే యాతని యాశ. దీనికిఁ బరిహారమెట్లు? రస్య ఆజీవఃరాజీవః అని విగ్రహము ఏకాక్షర నిఘంటువునుబట్టి 'రః' అనగా మన్మథుఁడు. ఆజీవమనగా జీవిక. మన్మథోద్దీపకమని తాత్పర్యము. మచ్చునకు రెండు చూపితినంతే. విద్వాంసులు చూచికొనవలెను.

కోలాహల వర్ణన పర్వత మిక్రిందిది. అతఁడే కథానాయకుఁడు. అతఁడు రంగమున నిట్లు బ్రవేశించెను.

సీ॥ సుమనోధివాస భాసుర శిఖోన్నతి వాఁడు
ఘనసారతిలక వాసనల వాఁడు-
ఘనసంకు మదసాంద్ర గండ భాగమువాఁడు
నవపద్మరాగ దంతములవాఁడు-
కలితోపకంఠ నక్షత్రమాలికవాఁడు
హరిచందన చ్ఛాయ నమరువాఁడు
తపనీయ మేఖలా ధాళ దళ్యమువాఁడు
మణిపాద వలయ ధామంబువాఁడు
"నర్ఘ్య రత్నావళీ విచిత్రాంబరాభి
రామ శృంగారములవాఁడు-హైమగర్భ
గేహమున కేగువాఁడు కోలాహలాఖ్యుఁ
డొక ధరాధీశుఁ డెదురయ్యె నువిదకపుడు.

— ఈ పద్యమందలి చమత్కృతి యేదనఁగా రాజపరమైన యర్థమే తొలుతఁ గొట్టవచ్చినట్లు భాసించుట; పర్వతార్థము ప్రయత్నముతో సాధించికొనవలెను 'గంత, దంత, నక్షత్రమాలికా'. యిత్యాదిశబ్దములు రాజపరముగాఁ బ్రసిద్ధమైన యర్థము సమర్పించుచున్నవి. పర్వతపరమైన యర్థమునకు నీకు నిఘంటువుల సాయమవసరము. ఇది యా కవిచూపిన గొప్ప చమత్కారము. ఇట్టిదే మరియొకటి!

సీ॥ తనకూటమునఁ బ్రోదిచాల్పు రంభాదులు
సరసభావముదప్పి శిరము వంప
తనలోలతల పెంపుఁగను కలకంఠులు
చేరిపై వ్రాలక చెదరి పలుక

తనవంకనలరు పద్మిను లెల్ల దమిగాన
కియివాడి, మోమలగ్గలము ముడువ
తన మహాభోగంబుల నెసంగు భోగినుల్
తెరలి నిట్టూరుపు తెరలు నెఱప
గీ. నకటకట! మంచుమలషట్టియతనుతాప
వహ్ని పాలయ్యె, ఱుక బాష్ప వారియగుచు
నిత్యభక్తి మతీధ్యాన నిశ్చలాత్మ
డగుచు, నంచిత గహన రోమాంచుడగుచు॥

ఇందు కోలాహలునికి సంభవించిన విరహము ఒకానొక దక్షిణ నాయకునకు గలిగిన యెడబాటు గడబిడవలెనే యున్నది. గిరికాదేవి మన్మధునిట్లు బూజించెను.

ఉ॥ గొజ్జగ మంచునం గలపి కూర్చిన పుప్పొడి తిన్నెమీదలా
మజ్జకకాయమాన వలమాన విమానము క్రింద నొక్కపూ
నెజ్జఘటించి, యందొక కుశేశయకర్ణిక నిల్పియందు సం
పజ్జలజేక్షణాసుతుని భావముభ్రావి కురంగనాభికన్॥

మదనుడ శరీరి అందుచే వానిభావమును మాత్రము భ్రావిసినదట వామాంకమున రతినావహించినది. భ్రమోల నుదురాజును, బుతు రాజునుగీలు కొల్పినది. ఇక్కడ నొక చిక్కున్నది. సంపజ్జలజేక్ష ణాసుతుడు ప్రద్యుమ్నుడుగదా! అతనికి రూపమున్నదే! ఈ విద్యా నై పుణ్యములో భూషణకవి మనకంటెను రెండాకులెక్కువజదివినవాడు. 'సంపజ్జలజేక్షణా సుతుడ'ను సవర్ణదీర్ఘమున నకారము బ్రక్షిప్తము. సంపజ్జలజేక్షణా అసుతుడని విభాగము. ప్రద్యుమ్నుడుగా నవతరింపని నాటి భావమన్నమాట! వానికి శరీరములేదు.

గిరికాదేవి మన్మధునిట్లు ప్రార్థించినది.

శా. వాతాందోళిత చందనాగురులతా వ్యాలీఢ కేళీవసీ
జాతంబుల్ భవదీయ నర్మగృహముల్, చై త్రుండు నీబంటు నీ
కేతత్కాననజాత వస్తునిచయంబేమిచ్చి పూజించుటల్
'శీతాంశోర మృతార్పణ'మ్మను క్రియన్, జేకొమ్ముచేతోభవా

దీనిలోని 'చేతోభవ' శబ్దము పరమసార్థకము. 'శీతాంశోర మృతార్పణ'మ్మును పలుకునాతఁ డూరకి వాడలేదు. చంద్రుఁడును చేతోభవుఁడే. 'చంద్రమామన సోజాతః' అనుశ్రుతి యుండనేయున్నది.

తృతీయాశ్వాసములోనిదీ క్రింది పద్యము.

చ. అటిమి రమాకుమారుఁడపు డగ్రతలంబున వచ్చి నిల్చిన
ట్లటిమిటి దోచినన్, గువలయాక్షివడంకి, కడంక దూలి మె
మటచి, సగంధగంధగిరి మారుత పాతితవల్లి కాభయై
యెటఁగిన, సంభ్రమించి, చెలులుద్గతబాష్ప తరంగితాక్షులై

పై పద్యమందలి, 'అటిమిటి' శబ్దము చిత్రమైనది. ఉయ్యాల తూగువలె నా పదమున్నది. దానికిఁ దగినట్లె 'రమాకుమార' శబ్దము గలదు.'రమా'కుమార'-మాకుమార-కుమార-మార-ర ఇవియన్నియును మన్మథుని పేరులే అట్లే యవరోహణ క్రమమును బోవును, తానీ పదము నిట్లు జిత్రముగాఁ బ్రయోగించితినని 'యటిమిటి' యను దానిచే మూర్తికవి సూచించుచున్నాఁడు. 'రమాకుమార' శబమున కాతఁ డెన్నిదినము లాలోచించి కొని యుండవలెనో విద్వాంసు లూహింప వలెను. అందుకే వసుచరిత్ర చిత్తారితనము స్వల్పకాలములో ముగిసి యుండలేదంటిని.

పంచమాశ్వాసములో వసురాజు వివాహ సన్నాహములను మూర్తికవి రచించెను. ఆ సందర్భములో నీ క్రింది పద్యము,

చ. హరిపరతంత్ర వృత్తియు మహోమణి చాపశరానుబంధ బం
ధురతయు, రాజహంసక వినోదనమున్, పవిషోషఘర్ఘర
స్వరమును, చిత్ర విగ్రహ విశంకటభావము బూనిశై లరా
ట్పుత్రి నరదంబులై శరదముల్ నెరనెన్ జపలాంశు సంపదన్॥

కోలాహలుని పట్టణములోని శరదము లరదము లైనవట హరి పర తంత్రవృత్తి-మొదలగు వానిచేఁగవి యభిన్నతను సాధించినాఁడు అంతమాత్రముతోఁ నాతఁడు తృప్తిపడలేదు. 'చిత్రవిగ్రహ విశంకట' యనుచోట - నొక చమత్కారమును జూపి నాఁడు వి+శ్+అంక+ట

(4) టఃపుమాన్ ఃరశేఘూమే చాపేఽర్కకిరణేధ్వనౌ (నానార్థ రత్నమాల)

అని పదవి భాగము. విగతమైన శకారము చిహ్నము గాగల ధ్వని విశేషముతోనని యర్థము. పదములోని హల్లు, శకారముపోగా మిగిలిన దరదమే. పండితులన్నారుగదా! "ఓయి భట్టుమూర్తీ! నీ చమత్కారము బాగుగనేయున్నది. ఇట్టి విగ్రహమునకు వ్యాకరణ శాస్త్రము సమ్మతింపదు గదా!" యని. దానికి మూర్తి కవి చెప్పనే చెప్పినాఁడు. 'తనది చిత్రమైన విగ్రహ వాక్యము'. ఇట్టి చమత్కారముల నన్నిటినిఁ జెప్పుచుఁ బోయినచో నొక క్రొత్త వ్యాఖ్యానమే వ్రాయవలసి వచ్చును.

గిరికాదేవి వీణ వాయించుచున్నది. తానామృతములతో నచేతనములు చేతనములైనవి. మూర్ఛనలతో చేతనముల చేతనములైనవి. తానములో 'గతి' నడచును. ముఖ్యముగా నిది వీణాది వాద్యములకు సంబంధించినది. స్వరరాగ ప్రస్తారములకు మూల సూత్రముల నిది వింగడించును. మూర్ఛనలు స్వరప్రస్తారమునకు సంబంధించినవి. తాళము హృదయమును దట్టిలేపును. జాగృతిని గల్గించును. స్వరప్రస్తారము శ్రుతితో గలిసి సాగినపుడు శరీరములు మఱతును. రెంటి సామరస్యమానంద బ్రహ్మము. ఈ వింగడింపు నెంత చక్కగా మూర్తి కవి చేసినాఁడో సంగీతజ్ఞుల మనస్సునకు రాకపోదు.

అతని పాత్రలందఱు చమత్కారప్రియులు. వసురాజు సాహిత్య రహస్యము నెఱిఁగిన (6-94) వాఁడు. చాతుర్య (2-74) ప్రియుఁడు శుక్తిమతి సర్వంకష ప్రౌఢిగలది. సరసాగ్రగణ్య, భువనాశయ సన్నివేశ వేదిని, 'వంచనాయతి' అతుల ప్రౌఢవచోఽను భావములప్రోవు, మంజువాణివి, మంజువాణీ విలాస సంపదలు, కోలాహలుఁడు గాన విద్యాభిరతుఁడు. ఇఁక గిరిక చెప్పనవసరమేలేదు. సంగీత సాహిత్యము లామెసొత్తు, పతి యొసగిన సాహిత్య విద్యనుప్రత్యలంకరణ మౌఖర్యముతో ధ్వని వ్యక్తితో నాతనికిఁ బ్రత్యుప దేశమొసఁగిన ప్రౌఢయామె. ప్రధాన పాత్రలేగాదు; నడుమ నడుమగనుపించి పోవువారును మాటలలో జేతలలో నెంతయో ప్రౌఢిమను జూపింతురు. ఈ క్రింది సన్నివేశమును దిలకింపుడు. (6-16)

సీ॥ తనుఘనంబుగ నమ్మ్ర రియు నెమ్మికి, గొవ్వు
మాన్య భోగి వొసంగి మఱిలబంచె
దనుగొండ యని వచ్చు మనుజు రక్ష గుచముగా
రుడ శిలాసరదూ వ్యలిడి మరల్చె
దనుగల్ప లతికగా దలచి వ్రాలెడు శారి
గరము రత్న ఫలాళినెరపి నిలిపె
దను బ్రహ్మమని యంట బెరుగు నంచకునంఘ్రి
హీరాంగద మృణాళమిచ్చి యనిచె

తే॥ నాత్మపోషిత వర్గంబు లవనిపావ
లోక గమనాంతరాయంబు గాకయుండ
నవయవంబులె తోడయ్యె నతివకనుచు
నెచ్చెలులు మెచ్చవచ్చె మానిని యొక ర్తు

లగ్నమునకు బయలుదేరిన వసురాజును జూడవచ్చిన యొక పౌరపురంధ్రి యీమె. ఈమె తన యడ్డంకుల నెంత చమత్కారముగ దప్పించికొని వచ్చినదో రసికులు గమనింపవలెమ, ఆమెయేగాదు.. అతడు వర్ణించిన పౌరకాంత లందరట్టివారే!

శబ్దములను వాని వాని వ్యుత్పత్తి ననుసరించి వాడుటలో భట్టుమూర్తి చాల నేర్పరి. ప్రతిపదము నాతడు సార్థకముగనే వాడును. పదములేకాదు. 'సామెతలు' 'నానుడులు' మొదలైనవానిని గూడ నతడల్లే ప్రయోగించును ఈ క్రింది పద్యము ఉదాహరణము..

శా॥ ఆ మందాకిని మౌళిభూని ననుసర్ధాంగీ కృతంజేసి తా
నౌమేల్మేలని యార్యయల్లగ బ్రణతుండై తత్పదాంభోజయో
గామర్షంబున గంగయున్ మొదయగ జూడాభోగ సమ్యక్క్రియా
సామర్థ్యంబున వేడు శంభుడు గృతిస్వామిం గృపంబ్రోవుతన్.

పై దానిలో మందాకిని 'అర్ధాంగీకృత, 'ఆర్య' యిత్యాది శబ్దములు సార్థకములని సోమకవియే వివరించినాడు. గంగాశబ్దము గూడ నట్టిదే. గాంగతేతిగంగా' యని దాని వ్యుత్పత్తి. భూమిని

బొందినదని యర్థము. పదాంభోజసమాసమును సార్థకమైనదే. తన నీటి యందు బుట్టిన కమలము పైననే దన్ను బడవేయుచున్నాఁడని స్వారస్యము, ఆర్యయల్లినది. ఆమెకున్న స్వాతంత్ర్యమంతే. గంగ మెఱసిన దట! ఈమెగయ్యాళి ఈ 'మొఱయు' పదమును రెండమూడు చోటులనిక్లే (2-43) సార్థకముగ వాడినాఁడు, అమర్షశబ్దము 'మృషూసహనే' అను ధాతువునుండి యేర్పడు చున్నది. ఓర్వలేనిదై' అనియర్థము. భట్టుమూర్తి పద్యము మనమే ప్రశ్నవేసినను దానికి సమాధాన మొసఁగును. పాఠకుఁడు 'ఏదో లాలసతకు వాడినాడు లెమ్మని' కవిని దయఁజూపవలసిన పరిస్థితియే యాతఁడు గల్పించి కొనఁడు. ఆతని మొదటి పద్యమందే యీ శక్తి యున్నది, ఆతని తొలిప్రార్థన యిది.

శా॥ "శ్రీభూపుత్రి వివాహవేళ నిజమంజీరాగ్ర రత్నస్థలీ
లాభివ్యక్తి వరాంఘ్రిరేణు భవకన్యా లీలయించున్ మదిం
దాభావింప శుభక్రమాకలనచేఁ దద్రత్నమున్ గన్నుసీ
తా భామాపతి బ్రోవుతం దిరుమ లేంద్ర శ్రీమహారాయనిన్"

[5] "అంఘ్రి రేణుభవ కన్యాలీల," ద్రౌపది, తార, మండోదరి, సీత, అహల్య వీరందఱు పంచకన్యలు[5] అందుకే మూర్తికవి యీ పదము వాడినాడు. 'భామతికుప్యతీతి భామా' అని వ్యుత్పత్తి, సీతగోపించినది గనుకనే భామయైనది. ఈ క్రింది పద్యమున 'తలోదరి' శబ్దమెంత రమణీయమో చిత్రకారుఁడు చెప్పవలెను.

మ॥ లలితా మోదలతా వితానవృత లీలాచంద్ర శాలాతలో
జ్జ్వల నీలాతత వేదివై, మొగులు క్రేవన్ మించుక్రొమ్మించు,నా
నలువై యత్తటి నత్తలోదరియు, వీణావాదన ప్రౌఢిచేఁ
జెలులన్ రంజిలఁజేయు చున్కినృపసంసేవాపరుండాత్మలో॥
(2-26)

---

(5) అహల్యా, ద్రౌపదీ, తారా, సీతా, మందోదరీతథా పంచకన్యాః
పతే న్నిత్యం, దుస్స్వప్నం తస్యనశ్యతి.
(చూ: మందరము : కిష్కిం : పుట : 265

ప్రథమా శ్వాసములో నధిష్ఠాన పట్టణమును వర్ణించుచు-

ఉ॥ చందనగంధులిందు మణిసౌధ తలంబుల గొండ్లిసల్పగా
నందలి దివ్య చిత్రముల యందొకరై యని మేషభామినుల్
కందళితాద్భుత స్ఫురణగన్గొని తన్నటనాంతగీతని
ష్యంద సజీవ చిత్రముల సందడినేగుదు రప్పురంబునన్".

అధిష్ఠాన పట్టణమందున్న స్త్రీలందఱును నాట్యము లాడలేదు. ఆడలేరుగూడ. మరి యెవరాడిరి? ఆడినవారు 'చందన గంధులు' వారు పద్మినీజాతి స్త్రీలు. వారి యాటకే దేవకాంతలు మెచ్చినది. అవి యిందు మణిహర్మ్యములు, అందచే 'సౌధము' లైనవి. అనఁగా తెల్లగా గొట్టఁబడిన సున్నముచే చలువఱాల మేడలవలె నగుపించుచున్నవని భావము. ఆ హర్మ్యములలోఁ జిత్రములు వ్రేలాడుచున్నవి. అవి దివ్యములు. అగుటచే నవిగూడ ననిమేషములే. కావుననే యనిమేష భామినులా చిత్రముల నడుమ దాగికొనగల్గినారు. అధిష్ఠాన పట్టణ మందలి స్త్రీల గాన నాట్యములు ఒడలు మఱపించునవిగావు. భట్టు మూర్తి విద్యవలెనే యవి, 'యద్భుత స్ఫురణ' గొల్పును. వారు 'లయ' ప్రధానముగ నాడి పాడుచున్నారు. కనుక చిత్రములు సజీవము లైనవి. అవియు నాడఁదొడఁగెను. వాని సందడిలో దేవకాంతలు దప్పించుకొని పోయిరట.

మ. చనవొప్పన్నగిపల్క, పాడి, కని, యాశ్వాసంబు నొండించి చే
కొనిమోమిచ్చి, కవుంగిలించి, తరులన్ గొన్నింటి మన్నించియం
గనలయ్యో! మమునెంతజేసిరనుచుం గంకేళియుం గేసరం
బును భూజానికిమ్రొక్క గుచ్ఛితంతిబూదేనె కన్నీటితోన్.

—తరులను గొన్నిటిని మన్నించిన వారంగనలు. ప్రశస్తములైన యంగములు గలవారికే యంగనలనిపేరు.

మ. లలితైణాంక శిలాల వాలమను కేళాకూళిలో, నీరుపై
జెలువొప్పం ధరియించి, తోడనెమిళచ్చిక్రోడ దంష్ట్రాదళ
త్ఫల రంధ్రంబులచే వెలార్చి, జలసూత్ర స్తంభముంబో నియ
గ్గల పుంజాయలగుజ్జు నారికడమున్ గాంచెన్ విభుండయ్యెడన్.

జలసూత్ర స్తంభములను జెప్పుసందర్భమున 'నారికేళ' శబ్ద మెంతయో జక్కగా నడికినది. 'నాళ్యాకం ఉదకం యీరయతీతి నారికేళః' అని వ్యుత్పత్తి.

శా. నానానూన, వితానవాసనల నానందించు సారంగమే
లాననొల్లదటంచు గంధఫలి బల్కాకన్ద పంబంది, యో
షానాసాకృతిఁబూని, సర్వసుమనస్సారభ్య సంవాసియై
పూనెన్ బ్రేఱణమాలికా మధుకరీ పుంజంబు నిర్వంకలన్,

—సారంగచ్ఛతీతి సారంగః అని వ్యుత్పత్తి సారము నెటిగిన వాఁడని భావము. సారంగము తన సౌరభ్యము నెఱుగలేదు. ఇది గంధఫలికిఁ బెద్ద చింత యైనది. దాని సార్థక్యమే గంధము. ఆనాయిక తపమొనర్చినది. నా సాకృతితో మరల స్త్రీజన్మమే వచ్చెను. అపు డైహికములైన వాసనలేమి దేవతలనే మభ్యపెట్టు సౌరభ్యమును సంపాదించికొన్నది. మధుకరీపుంజము దానికిఁ జెలిక త్తెలై యూడిగము శేయ నారంభించినవట! యోషిచ్ఛబ్దమేగాక 'యోషా' శబ్దముగూడ భాషలో నున్నది.

ఋక్తిమతి కోలాహలునితో ననుచున్నది.

క॥ పుడమిన చలేంద్రు లెచ్చట
జడవాహి నులెచట? నెచటి సఖ్యము? వినఁ జొ
ప్పడదు, పొడవడరు మీ యెడ
నెడపక మారసము లెచటికెక్కు మహాత్మా!

—పై పద్యములో 'వినఁ జొప్పడదు' 'పొడవడరు' 'మారసములు' యీ శబ్దము లెంత యందముగాఁ గుదురుకొన్నవో వివరింప వలసిన పనిలేదు, అంతేగాక మరియొకపదము గూడ నున్నది. అది సఖ్యము సాప్తపదీనము. ఏడడుగులు నడచిననే యది యేర్పడును. కోలాహలుఁడా యచలుఁడు.ఈమె జడవాహిని. ఇక సఖ్యమున కవకాశ మేదీ?

గిరిక చెలులతోఁ జెప్పక యుద్యానవనమునకుఁ బోయినది, అప్పుడు.

ఉ॥ అత్తరి బిత్తరిన్ మణిగృహంబునఁ గానక బోటిక త్తియల్
తత్తర మంది "హాగిరిసుతామణి! యెచ్చటికేగితే? కడుం
గ్రొత్త యటంచు" గేళివన కుంజము లారసినారట!
గిరిలో జన్మించిన మణికదలట గ్రొత్తయే గదా!

—ఈ మణి శబ్దమే మరియొకచోట వాడినాఁడు.

కం. కావున నీవనజానన
పావన జననక్రమంబు భవదీయ దయా
శ్రీవలన విన్నవించెద
నే వినుమని, యవ్వీలాసి నీ మణిపలికెన్.

ఇక్కడ గూడ మణి పలికినది. దానికిఁ గారణము, వంచనాయతి యొక్క 'దయాశ్రీ' యని మూర్తి యుత్తరము.

అచ్చట మరియొక విశేషమున్నది పవనమనఁగా నీటికినిఁ బేరు. కనుక జలసంబంధమైన జన్మయని పదార్థము. భక్తిమతికిఁ గూతురుగా జన్మించిన విధమని పిండితార్థము. వంచనాయతి యింతకుముందే యీ వృత్తాంతమును శ్లేషతో నన్నాఁడు.

చ॥ అనుపమ భాగ్య లక్షణ సమన్విత యీ రమణీలలామ, యీ
మనసిజ రాజరాజ్యరమ, మానసవీధిఁదలంప, సింధు నం
దన యచలేంద్ర నందన యనంగనయయ్యెడి, నీలతాంగి పా
వనకులగోత్ర భూతి, చెలువా చెలువారగఁ దెల్పవేయనన్,"

—పై పద్యమందును 'పావన' శబ్దమే యుండుట గమనింపఁదగినది. పూర్వాపరముల నంత జాగ్రత్తగా గమనించి 'భట్టుమూర్తి' రచన సేయును. ఈ పద్యమునకు మరికొన్ని పద్యములతో సంబంధమున్నది. ఆ విషయము పైన మనవిసేతును.

వసురాజు కోలాహల పర్వతము నెక్కునపుడు "లీలా హార్య మాసింహ సంహన నుండెక్కి" యన్నాఁడు. అహార్యము సింహ+సంహన నుండెక్కుట యుచితమే.

మ॥ కమలాభర్త భవద్విరోధిపయి జక్రంబుం బ్రయోగింప ను
త్తమ శస్త్రంబది, యాత్మనామకభిదా దర్పాంధునిన్నొల్మిం
గిమహోరాహువు దున్మి యుందును మకే గెంగాక ! జక్రంబుచేఁ
దుమురై పోవని వారలుంగలరె ! నీ దోషంబుగాదె శశీ !!

—విష్ణువు కమలాభర్త, చంద్రుఁడామెకుఁ దమ్ముఁడు అందుచేఁ దమ్ముని రక్షింపవలెనని మగనికామె సిపారసు చేసినది. భార్యమాటలు చాల తీపిగదా ! అంతమాత్రమేగాదు. చంద్రునితోఁ దనఁకుగూడ పోలికయున్నది. తానును జాబిల్లివలెనే కమలముల కభర్త. వాని నేమము జూడనివాఁడు. అందుచే నాతఁడు చక్రమును బ్రయోగించెను. అది యుత్తమ శస్త్రము. విష్ణువువలె తొందర పడునదిగాదు. పైఁగా దానికి మనస్సులోఁ జంద్రునిపై ద్వేషముకద్దు. ఆత్మనామము ధరించిన చక్రవాకములను వాఁడు హింసించును. అందుచే నది రాహువును దున్మినట్లుజేసి తునుమకపోయినది ! లేకున్నచోఁ జక్రముతోఁ జావని వారెవ్వరు ? చచ్చుటగాదు. తుమురై పోవుట. కొచ్చెరను దురిమినట్లనుట! ప్రథమాశ్వాసములో నొకపద్యమున్నది.

చ॥ చలితలతాంత కాంతియను చందురకావి చెఱంగుదోప న
మ్మిళితవయో విలాసముల, మీటినవిచ్చు ఫలస్తనాగ్రముల్
వెలువడఁగప్పె, తత్క్షణమవేల్లిత దోహద ధూపధూమకుం
తలములువిప్పె, దాడిమలతా లలితాంగి నృపాలుచెంగటన్.
(1-156)

నేటికిని బెనుగొండలో దానిమ్మతోట లెక్కువ ! దానిపూవు లెఱ్ఱగా నుండును. గాలివీచినప్పుడు అవి కదలును ఎఱ్ఱగా నన్నియు నొక్కసారి కదలువేళకు 'చందురుకావి చెఱంగు' చెదరినట్లే యుండును. వాని వెనుక వయోవిలాసములు గల పండ్లు. వాని యగ్రములు చూచు కముల వలెనే యుండును. అవిగన్పించెను. తత్క్షణము దాడిమలతా లలితాంగి వానినిగప్పి వేసినదట ! ఎట్లు కప్పినది ? దోహద ధూప ధూమములనెడు కుంతలములను విప్పినది. దోహదధూమము లొక్క సారిగాఁ బై కెగసిన వని భావము. నేటికిని పెనుగొండలో మేకపెంట పొగను ధూపద్రవ్యముగా వాడుదురు. 'దళ్యతే పక్వా వస్థాయామితి

దాడిమః అని వ్యుత్పత్తి. ఆ పదమునచోటనే కవిసార్థకముగా వాడి వాఁడు. 'మీటినవిచ్చు' అనుపదము మనుచరిత్రలో నౌపచారికము. దానిని మూర్తి కవి సార్థకముగా నుపయోగించెను. వసుచరిత్రను జదువు కొనవలసిన పద్ధతి యిట్టిదనియే నా మనవి. ప్రతిపదము నాతఁడు దూచివేయును. దార (4-13) తరుణి (2-25) కుంజరయాన (3-35) వంటి సంస్కృత శబ్దములేగాదు. (6) తొయ్యలి (3-93) చెలువ (2-110) మొదలైన ద్రావిడములను గూడ సార్థకముగా వాడును. మన ప్రతి ప్రశ్నకును బదులొసగును. "యం బ్రహ్మాణమియం దేవీ వాగ్వశ్యేవానువర్తత" అని భవభూతి తన్నంకించి కొన్నాఁడు. అట్టివాఁడు భట్టుమూర్తి.

"రెండర్థముల పద్యమొకటి నిర్మించుట చాల కష్టము. అట్లే కావ్యమంతయు నిర్మించినచో నది "యోహో !!" యన జేయదా" యని సూరన్న పొగడ్త. భట్టుమూర్తి రెండర్థముల కావ్యమును నిర్మించుటయేగాదు. మఱెవ్వరును నిర్మింపలేనంత సమర్థముగ నిర్మించిన వాఁడు. శ్లేషలో నాతఁడు వోయిన తెన్నులు మఱెవ్వరందికొనరానివి.

క॥ అన్నగరి నాట్యశాలలఁ
బెన్నగుముఱజముల రవళిచే నటియించున్
గన్నియల కన్నమున్నుగఁ
బన్నగ భుక్తతులు దృష్టి పాత్రములగుచున్॥

"ఈ దృష్టి పాత్ర" శబ్దము ఎంత సులభముగా శ్లేషనందించు చున్నదో చూడుడు. దృష్టిపాత్ర మనఁగా కట్టఁబడినది. పత్రసమూహము-పాత్రము. యీ కలగుంపు "కన్నులుగల ఈ కలగుంపని" రెండవ యర్థము.

క. అనవుడు శశికాంతదరీ
జనిత ప్రతినాదమైన సంగీత కల
స్వనము మనమున నొకానొక
యనురాగభరంబు బెనుప నవనిపు డనియెన్.

(6) తిఱుమున్ఱైత్తడత్తి దైత్తొయ్యిలెద్రుంబలుకొళ్ ముత్త మెందుద్రదైయెవన్ కొల్"
(స్తనములపై పత్రభంగములు : సిలప్పదిగారం)

ఇచ్చటి 'యనురాగ' శబ్దముగూడ నట్టిదే. రాగానుకూల చిత్త ప్రవృత్తియని యర్థము.

మ. తనరాజీవశరం బెఱుంగదు నిశాతత్వంబు, లేగల్వ తూ
పునకుం జాలదు. వేగలీల, యని యాపూములుల్కలగ్గించి క్రొ
న్నన విల్కాడు నవాంబుజోత్పల వితానంబీను మీనాడిలో
చనముల్ వింటఘటింపఁ బొల్చెనవి నిస్తంద్రాంబకఖ్యాతులన్.

పై పద్యములోఁ నంబకశబ్దము శ్లేషముగా వాడుటలో నంత యబ్బురములేదు. కాని 'వేగలీల' 'నిశాతత్వము' ఈ రెంటినిఁబొందించు నేర్పు మాత్రము మన కాశ్చర్యము గొల్పును.

సీ. అనుకూల ఖేలనాయత్త జీవనమైత్రి
నడరినర్మద బోటియై భజింప
నూర్మికా కంకణద్యుతి కలాపము దోప
శాహుదకె దండ పరిధవింప
సముదితారామ సంభ్రమ సాంద్రయైసారి
సారెవేత్రవతి పెచ్చరికఁదెల్ప
గంభీరరస గుంభసం భృతప్రౌఢిమ
తో సరస్వతి పల్కుదోడుగాగ

తే॥ గీ॥ కులములోఁ బెద్దయు నమూల్యగుణమణి ప్ర
కాండ పరిపూర్ణయునుగాన గౌరవమున
నఖిలనదులను దనుగొల్వ ననుదినంబు
నలువకొలువునకేగు నన్నది యతీంద్ర.
(2-108)

నర్మద, శాహుద, వేత్రవతి, సరస్వతి, ఇవి నదుల పేర్లు. ఇవి దినమును భక్తిమతిని గొల్చుచుండెడివట! కవియా కొలువు నిష్టము వచ్చినట్లు పంచలేదు. వారి స్వభావమున కనుగుణమైన సేవనే యెప్పించినాఁడు. 'నర్మద' బోటి మెల్లగా హాస్యగర్భముగా మాటాడుచు వెంటనడచుచున్నది. 'శాహుద' కైదండి నిచ్చినది.

'వేత్రవతి' హెచ్చరిక దెల్పుచు ముందుఁబోవుచున్నది. 'సరస్వతి' పల్కు దోడైనది. ఈ భావమునకు శ్లేషను పడికట్టుగా వాడు కొన్నాఁడు. ఏరుకొన్న పదములు యేకార్థకములైనట్లుగా మనలను మభ్యపెట్టి యంతలో విరులు విరిసి గంధమును సమర్పించునట్లు 'రెండవ యర్థమును సమర్పించుచున్నవి.

ఉ॥ సారసకైరవంబులకు చఁద్రదినేంద్ర విరోధ, మంచకున్
భారములేని మందగతి భారము, దెమ్మెరకువ్ ఫణిగ్రహ
క్రూర విభూత, మంగజున కుంగడతేరని భీమవీక్షణాం
గారకవైర, మింతదలకన్ బనిలేదు మనోజుధాటికిన్॥

మన్మథునకును, వాని పరివారములకును గ్రహములు చాలుట లేదు- వారే బాధపడుచున్నారు. గనుక మనము వారికి భయపడవలసిన పనిలేదని చెలికత్తెలను చున్నారు. సారసములకుఁ జంద్రుడు చాలఁడు, కైరవములకు రవిగ్రహము ప్రతికూలము. హంసలకు శని వక్రించినది. తెమ్మెరకు రాహుగ్రహ విరోధము. మన్మథునకు, భయంకరుఁడైన కుజుఁడే వక్రించినాఁడు. ఇఁక భయమేమున్నది? ప్రాచీనకవులలో ప్రతిభావంతులు లేకపోవచ్చును గాని యవ్యుత్పన్నులుండరు. వారు తమ వైదుష్యముతో నెన్ని యాశ్చర్యకరములైన పనులైననుఁ జేయ గలరు. కాని భట్టుమూర్తివలెఁ జేయఁగలవాఁడు మరిలేఁడు. సంస్కృత సాహిత్యమున బాణుని తరువాతవచ్చిన కవులందరాతనినేగల వరించిరి, తెనుఁగులో వసుచరిత్ర యట్టిది. మూర్తికవి తరువాత బయలుదేరినపిల్ల వసుచరిత్రలకు-వాని ఛాయలకు లెక్కలేదు.

కన్నడమున లక్ష్మీశుఁడు మూర్తికవి రచననుజూచి, యబ్బుర పడి యనుసరించినాఁడు. తమిళమున వసుచరిత్రమే యొకటివచ్చినది. సంస్కృత కవులకు కౌలీనత హెచ్చు. మేము చేయలేని సృష్టియున్నదా? యని వారి హుమ్మస్సు. వారుగూడ వసుచరిత్రను జూచి కన్నులు దేలవైచినారు. సంస్కృతమున నాటకములుగా వ్రాసికొనిరి. ఆనంద గజపతులవంటి విద్వత్కవుల యా స్థానములో వసుచరిత్రము పాండిత్య మున కొరపిడిరాయిగఁ దయారైనది. సంస్కృతమున 'విద్యా

వతాం భాగవతేపరీక్షా' యను సూక్తి ప్రసిద్ధము. మూర్తికవి తరువాత, వసుచరిత్ర కర్థము బొందించి చెప్పినవాఁడే విద్వాంసుడను మాట పుట్టినది సంవత్సరముల కొలఁది కావ్యమును దిద్ది తీర్చినవాఁడు కనుకనే మూర్తికవిలో ముందు వెనుకల చూపెక్కువ.

పౌర్వా పర్య విరోధము గాలించినను దొరుకదు. ఉదాహరణకు జూడుఁడు. ప్రథమాశ్వాస మున

మ. చతురాస్యుల్ పురుషోత్తములు బుధగురుల్ సర్వజ్ఞమూర్తుల్ మహా
శతమన్యుల్ శుచి ధర్మ పుణ్య జనతాశ్లాఘ్యుల్, ప్రచేతుల్ సదా
గతులక్షీణనవార్థకర్తలు కలాకాంతుల్ జగద్బంధులా
క్షితిదేవుల్ పుఁదేవతా మహిమలం జెన్నొందుటల్ చిత్రమే.
(1-96)

అను పద్యమున్నది. 'చతురాస్య' శబ్దమిచట శ్లిష్టము; చతుర ముగ మాటాడు వాఁడని యొక యర్థము. బ్రహ్మదేవుఁడని యర్థాంత రము. ఈ 'చతురాస్య' పదము నాతఁడు తెండు మూఁడు చోటుల (1-117, 3-12) వాడెను. ఆచోటు లందంతయు నర్థవంతముగనే వాడి నాడు.

ఈ పద్యము గమనింప వలెను.

ఉ. స్వైరవిహార ధీకలగు సారసలోచన లున్నచోటికిన్.
భోరన లాతి వారు జొరఁబూనినచో రసభంగమంచునే
జేరక పూవు దీవి యలచెంతనె నిల్చి లతాంగిరూపు క
న్నారఁగ గాంచివచ్చితి నవాంబుజ హోంబక ! నీకుదెల్పఁగన్.
(2-55)

దీనిలో 'సారసలోచనలున్న చోటికి లాతివారు బోయినచో రసభంగమనుట' యొక చమత్కారము 'సారసలోచన' శబ్దములో రసభంగమైన సాలోచనయగుచున్నది. ఇంతవఱకు వ్యాఖ్యలో నున్నదే. ఇందులో మరి రెండు విశేషములున్నవి. గిరికాదేవి వృత్తాంతమును జెప్పినంతనే వసురాజామెను వివాహమాడ నెంచెను. ఆమె యవి

వాహిత యా కాదా ? యన్న ప్రశ్న యేల దట్టలేదు ? దీనినిఁగూడ నర్మసఖుడే పరిహరించినాఁడు. అతఁ డామె 'రూపు'ను జూచినాఁడు. అవివాహితలైన స్త్రీలు మెడలో 'రూపు' అనునొక యాభరణమును గట్టికొను చుండిరట ! ఈ పద్యములో "నవాంబురుహాంబక !" విశేషణ మున్నది. వేరొక్క కవియైనచో 'యతి కోసములెమ్మ'ని మనము సరిపెట్టుకొన వచ్చును. భూషణకవి యట్టివాఁడుకాదు. దీనికి సుమారు ముప్పది పద్యముల వెనుక నొక పద్యమున్నది. అదియిది :

సీ॥ తనక ప్పునెటికొప్పునెపూని గౌరిస
మాఖ్యమించ జనించి నట్టియార్య
తన చాపలము చూపులనెచూపి సిరులెల్ల
కఁడజల్ల వచ్చిన కమలపాణి
తన పాండిమము నవ్వులనెయుంచి గాంధర్వ
మవనికి దెచ్చిన హంసయాన
తన యదృశ్య తనడుమున న దాల్చి సాంగయై
మొనసిన యతను సమ్మోహవిద్య

"గావలయు నీవెలఁది దీనికాంతిగుణక
లాభిరూప్యంబు లెటిగించి యా మహేశు
నానగోద్ధారకుని, నా బ్రజాధినాథు
నా జగన్మోహనుని దెత్తుననుచు జనియె (2-27)

ఈ పద్యములో నున్న ప్రత్యేక శిల్పముండనే యున్నది. పై పాదములకు గీతపద్యము బంగారునీరు వోసినది. అది యట్లుండగా నీ పద్యమునకు సంవాదిగా 'నవాంబురుహాంబిక' శబ్దము వాడబడినది. గిరిక గౌరీదేవి ఆతఁడు నవాంబురు హాంబకుఁడు అనగా శివుఁడు. "అంబురుట్" నీటఁబుట్టిన దగ్ని. అగ్ని యంబకముగాఁ గల వాఁడు. గిరిక లక్ష్మీదేవి. అతఁడు పుండరీకాక్షుఁడు ఈ శబ్దము విష్ణువునందు రూఢము ఈమె సరస్వతి. అతఁడు బ్రహ్మ, నూత్నమైన అంబురుహము 'అంబిక తల్లిగా' అనఁగా జననకారణముగాఁ గలవాఁడు. గిరిక మన్మథుని మోహినీ విద్య. అతఁడు అంబురుహము బాణముగాఁ గల్గిన

మన్మథుఁడు. ఇంతటి చమత్కారమును "నవాంబురు హోంబక" యను శబ్దము తనగర్భమందిమిడ్చికొన్నది.

శా॥ ఆజాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేకరాకావిశా
రాజశ్రీ సఖమైన మోమునఁ బటాగ్రంబెత్తి, యెల్లెత్తియూ
రాజీవాననయేడ్చె, కిన్నర వధూరాజత్కరాంభోజకాం
భోజీమేళవిపంచికామృదు రవా పూరంబుతోరంబు గన్.॥

ఈ పద్యమును 'ఆజాచిల్లి'యని యారంభించి నాఁడు. 'ఏ జాబిల్లి?' యని సందేహము గల్గుట సహజమే. ఇతర కవులలో నైనచో "నేదో యొక జాబిల్లి లెమ్మని" మనము తృప్తి పడవలసి వచ్చును. భట్టు మూర్తి యట్లు మనదయను గోరఁడు.

శా॥ క్రీడామందిర జాలమార్గముల చక్కన్ నిక్కిజాబిల్లిరా
గోడల్నీరుగఁ జారఁద్రోచి, నెలతళ్కుల్ జొచ్చి, వెన్నాడిమై
నాడన్, కోమలియోర్వలేక వలవంతం బద్మినీ జాతికిన్
గీడానుగ్రశిఖామణిం బలికె నక్షీణానులాపంబులన్.

ఆమెయున్నది మణిచిత్రగృహమున; దానికిఁ జంద్రకాంతపుఁ గోడలు, నెలతళ్కులా గోడలపైఁబడి వెనుకకు మిట్టించి యామె వెన్ననుదూసి శరీరమాక్రమించికొనెను. ఈ జాబిల్లి యన్నమాట! ఈ రెండు పద్యములందును 'జాబిల్లి' శబ్దమునే యాతఁడు వాడి యుండుట గమనింపఁదగినది. ఆతని కీ దృష్టి యున్నదనుటకిది గుర్తు.

వసురాజు గిరికను జూచినాఁడు. ఆమె చెలిక త్తెలతోఁగూడ నున్నది. ఆమె యెదలో 'సిగ్గు' రాగఁపుఁదమి. ఇంతలోఁ గలహాంసి వచ్చెను. తల్లి బిలువఁ బంచినదని చెప్పినది. దానికొక సహేతుకమైన కల్పన. ఆమె పోఁబోవుచుండెను. అప్పుడు -

చం॥ నెనరునఁజేయివట్టి తరుణీ ధరణీ సరణీ పురందరుం
డనుపకపోవుచెట్లు తగవా! నగవారడి బెట్టనంచు జ
వ్వని| జెలులెల్లనిల్చి మహివల్లభ! మా చెలిమిద్రిప్పేమ నీ
మనమునఁ బాయకుండుమని మానినిఁదోడ్కొనిపోవు నంతటన్.

అని, చెలికత్తెలు హాస్యము చేసినారు దానితో గిరికకుఁ గోపము వచ్చినది. అందుకే కవి 'మానిని' యన్నాఁడు. ఆ కోపము గొన్న గిరికారూపమే వసురాజుమనస్సున నిల్చినది. ఆమె కోపముగూడ నొక యందముగానున్నది. ఆ స్వరూపమునే యాతఁడు మనస్సులో నుంచికొనెను. అతఁడచటినుండి పురికేతెంచెను.

"ఆనగరాజభేదియును, నా నగరాని మనోరథంబుతో
మానిని నాత్మనిల్పు -

ఇక్కడ 'మానినీ' శబ్దము గమనింపఁదగినది. మూర్తికవియే సమయమందును తన్ను దామఱువడు.

మంజువాణి వసురాజు ముద్రిక దెచ్చి గిరికకిచ్చినది. ఏ నాయికకైన నట్టి స్థితిలో పట్టపగ్గములుండవు. అనఁగా యావేశియైన కవి సహజముగా నొడలు మఱచు ఘట్టమది. అప్పుడు గూడ భట్టుమూర్తి యెంత జాగ్రత్తగ నున్నాఁడో గమనింపుఁడు.

చ॥ అని యఖిలంబుదెల్పి రమణాంగుళి ముద్రిక మంజువాణి యి
చ్చిన, నవలా, విలాసమునఁజేకొని, కైశ్యపయోద పద్ధతిం
దనరఁగఁజేయు, నేత్రన లినంబులనొత్తు ఘటించు నున్నత
స్తనయుగళీ రథాంగముల, తద్రవితేజము నే కతంబునన్॥
(4-122)

'రవి' తేజమున కామెయనురూప సమ్మానములే యొనర్చినది. ఇట్టి సన్ని వేశములలోనే యొడలు మఱువని జాగరూకుఁడు సామాన్య సన్ని వేశములలో మఱచునా యేమి? సాధారణముగా నాతని యౌచిత్యమటిది.

కోలాహలుఁడు దేవేంద్రునిఁ బొగడుచున్నాఁడు.

మ॥ ఘనముల్ వాహనముల్ వదాన్యమణి యాకల్పంబుకల్పాగముల్
వనముల్, వేలుపుగిడ్డి దొడ్డిపసి దేవా! నీకుఁ బాదార్ఘ్య మి
త్తునొ! రత్నాంజలియిత్తునో, యలరు వెత్తుల్ దివ్యసద్వస్తులి
త్తునొ! యీ వేమిట మెత్తువేమి దగనిత్తున్ భక్తపుంజప్రియా!

ికమాలంకారము నెంత సార్థకముగ నడపినాఁడో మీరే గమనింపుము. అన్నిఁటికిఁబైఁగా 'భక్తపుంజ ప్రియా' యని పద్యమునకుఁ గోటీరము వెట్టినాఁడు.

ఇఁక నీతని సంగీతకళాపాండిత్యము కొంతచవిజూడవలసియున్నది. ఇతని దయతోఁ దిరుమలరాయఁడును "నాద రక్తి రసికుఁడై నాఁడు" (5-18) మూర్తి కవికి 'నాద' శబ్దముపై నెక్కువ ప్రణయము. సంగీత విషయము చెప్పవలసి వచ్చినప్పుడు 'నాద' పదమున కెట్లును ప్రథమతాంబూలము తప్పదు. వేఱుచోటులను మూర్తికవి సామాన్యముగా 'శబ్ద' పర్యాయముగా 'నాద' మనియే వాడును. నాదోపాసనమే సంగీతము 'నాదోపాసనతో నారాయణ విధులు తరించిరి'ని త్యాగరాజన్నాఁడు. గాన యోగులదృష్టిలో జగమంతయు నాదమయమే. పరమశివుఁడు నాదతనుఁడు "రాగరత్నమాలికచే హరిరంజిల్లు" నట. "స్వాదుఫలప్రద సప్త స్వరరాగనిచయ నిహిత, నాదలోలుఁడై బ్రహ్మానంద మందఁజేఁ! మనసా!" యని త్యాగయ్య హితబోధ. సంగీత జ్ఞానహీనులకు మోక్షము గలదా! యని యాతని సవాలు; 'నిద్దుర నిరాకరించి,' శుద్ధమైన మనస్సుతోఁ బాడినంత రాముఁడు సంతోషింపఁడు. 'ముద్దుగా తంబూర'బట్టి 'సుస్వరము'తోఁ బాడవలెనట! సంగీత మర్థముగాని మొద్దులనుజూచి, "అటుకులకుచి యెద్దులకుఁ దెలియునా?" యని త్యాగ బ్రహ్మము నవ్వినాఁడు. ఆ 'సప్త స్వర సుందరు'ల యనుభూతి యచ్చరల యాలింగనమునకు బైచేయి. కమ్మగా శ్రుతిలో లీనమై స్వరములు బల్కించుట బహుజన్మ తపఃఫలము. త్యాగరాజు రాముఁడుగూడ నిట్టివాఁడు.

ఆరభి - రూపకము

నాదసుధా రసం బిలను, నరాకృతాయెరా ॥నా॥
వేదపురాణాగమ శాస్త్రాదుల కాధారమౌ ॥నా॥
స్వరములు ఆరొక గంటలు వరరాగము కోదండము
దురనయదేశ్యము త్రిగుణము నిరతగతి శరము రా ॥నా॥
సరస సంగతి సందర్భము గలగిరములు రా
ధరభజనే భాగ్యమురా! త్యాగరాజు సేవించు ॥నా॥

నాదసుధారసమే రామ స్వరూపమైనచట; ఆ మూర్తికి రాగమే కోదండము. స్వర సుందరులే దాని గంటలు. నిరంతర రాగాలాపనమే శరము. ఓహో! ఎంత మధురమైన యుపాసన! త్యాగయ్య తన్ను మఱచి పాడినవాఁడు. భట్టుమూర్తి తన్ను మఱువక పొగడినవాఁడు. అందుకే యాతని సంగీతము చౌడయ్య ఫిడిలు వంటి దన్నాను. రామరాజ భూషణుని సంగీతాభిరతి కావ్యములో నెచ్చట బట్టినను వీణా తంత్రివలె త్రిమోయును, అతనిగిరిక 'కిన్నెరమీట వీణె' బలికింపఁగ (3-33) నేర్చినది. అంతమాత్రమేగాదు, గీతములు వాడును. ప్రబంధము లాలపించును. మరియొకరికి 'ననివారిత చాతురితో' జెప్పించును. ఈ గురుత్వము నామె 'వల్లకి' తోనే యారంభించెను అనఘ కంఠాలప్తి సౌభాగ్యము లను వ్యాలో లాంగుళి సంజ్ఞచే (2-54) వీణెకే నేర్పించు చున్నదట; సాధారణముగా గాత్రపాఠకులకు 'మేళము' 'వల్లకి' యీ రెండును ఒరవడియైన వాద్యములు. ఆ సంగతులను వారు కంఠములోఁ బల్కించుటకు యత్నింతురు. వారి గమకములు జారులు మొదలగు వాని నందియిచ్చు వాద్యములవియే 'వీణాధనం'గారట్లు పాడుచుండెడు వారని పెద్దలు చెప్పగా విన్నాను. వీణెలోఁ బాడుచుండినప్పుడామె కంఠము వేఱుగా వినిపించెడిదేగాదట. ఆ మహాసాధనకై యామె లయశుద్ధినిగూడ త్యాగము చేసియుండెనని వినికిడి. నాకామె పాటవిను భాగ్యము పట్టలేదు. మరి మన 'గిరిక' వీణకే శ్రుతిశుద్ధిని నేర్పించు చున్నది యతి, అయ్యము, (2-80) మొదలైన సంగీత పారిభాషికము లాతఁడు శ్లేషగా నుపయోగించుచుండును. ఈ పద్యమును దిలకింపుడు-

మ॥ పదమెత్తంగల హంసలీల యధరస్పందంబు సేయన్ శుభా
స్పదమౌ రాగకదంబకంబు, శ్రుతిచూపన్ శ్రీ విలాసంబుకే
ల్గదలింపన్ సుకుమార పల్లవనవై లాలఘ్మి వీక్షింప, ష
ట్పదయుంబొల్చు, దరంబె కన్నెఁగొనియాడన్ గేయవా
క్ప్రౌఢిమన్,

పై దానిలోని 'పదము'రాగ కదంబకము' 'శ్రీ విలాసము' 'ఏల' షట్పది, అన్నియు సంగీతవీథిలోని సరకులే.

"ఒకచాయన నపాయ పికగేయ సముదాయ
మొకసీమనానామ యూరనినదము" (2-7)

పంచమ మన్నంత నాతనికిఁ దోచునది షడ్జమే. శ్రుతిలో నా రెంటికిఁ జాలయొద్దిక. వసురాజు వివాహసందర్భమున నీ కూర్పున్నది.

సీ॥ వైణికవల్లకీశ్రేణి నిమ్మొలమీటి
గాయక గాంధర్వ గమకరేఖ
గాంధర్వగమకరేఖఁ బరాహతముచేసె
వాంశికవంశి కావైభవంబు
వాంశికవంశికా వైభవంబెగనూదెఁ
దాళికాధర కరతాళగరిమ
కరతాళగరిమంబు కంచుమించుగనొత్తె
నాసద్ధచటుల తూర్యవ్రజంబు.

తే॥ చటుల తూర్యవ్రజమునంట జఱచెఁ బరిణ
యాగత దిగంతనృపతి నాగాశ్వరథ ప
దాతి కోలాహలంబు, రోదసి, నఖండ
మగుచు, నాదాత్మక బ్రహ్మమతిశయిల్ల

వీణానాదమును గాంధర్వగమకరేఖ మీటినది. గంధర్వులశ్వానుఖులు. గౌళ శారీరమున గమకములు గంభీరముగా గవ్వల కెదికినట్లుఁ బలుకును, వారి హలహల నుడుపఁగలశక్తి పిల్లనగ్రోవులకే. ఇచ్చే పద్యములో నొకక్రమము పాటింపఁబడినది. కడకంతయు నాదాత్మక బ్రహ్మస్వరూపమైనదట!

ప్రథమాశ్వాసమున నీ పద్యముగలదు.

మ॥ అరిగాఁ బంచమ మేవగించి నవలాలవ్వేళ హిందోళవై
ఖరిజూపన్ పికజాతమాత్మరవ భంగవ్యాకులంబై వనీ
ధర, నాలంబితపల్లవ వ్రతవిధుల్ దాల్పన్, తదీయధ్వనిన్
సరిగాగైకొనియెన్ వసంతము మహాసంపూర్ణ భావోద్ధతిన్.

శిశిరవసంతములసంధిలో (1) హిందోళమును బాడుదురు. దీని యారోహణావరోహణములు 'రిషభపంచమ' వర్జితములు. ఇది నటభైరవి జన్యము. పంచమమును నిషేధించుటచే గోకిలలు చింతించి తపమొనర్చినవి. ఇంతలో వసంతము వచ్చినది. వసంతము పంచమమును గైకొని యాచరించెను. వసంతరాగము మాయా మాళవగౌళ జన్యము నేటి వసంతమున 'పంచమ' పున్నదని లేదని వివాద విషయము; భట్టుమూర్తి కాలమున నిది సంపూర్ణరాగము పంచమమునకు మృదు సంచారము; వసంతుడు పికజాతములపై దయఁజూపి వాని సంతోషపెట్టుటకై జేర్చుకొన్నాడు గనుక దాని కల్పసంచారమన్న మాట! 'అరిగా' యన్నచోట శత్రువుగానని యొక యర్థము. రిషభవర్జితముగానని యర్థాంతరము. హిందోళమున 'రిగ, గరి', ప్రయోగములులేవు. సరిగా ననుచోట షడ్జ - రిషభ గాంధారములని యర్థము. 'పల్లవవ్రతవిధి' యను చోట గోకిల లొంటికాలిపై నిలచి వ్రతము బట్టినవన్న మాట. గిరిక కాంభోజిలో విలపించినదని భట్టుమూర్తి యన్నాడు. ఎవరో సాహిత్యమాత్ర పర్యవసితులు పెద్దన్న తిమ్మన్న భట్టుమూర్తి పద్యము లొకచోటఁజేర్చి 'భట్టుమూర్తి బావురుమన్నాడ'ని వెక్కిరించి యాకథను తెనాలిరామకృష్ణు నెత్తికెత్తిరి. (2) ఈ ముప్పురి కంటె ముందుగా శ్రీనాథుఁడే యేడ్చినాఁడు. ఆపాత చమత్కారమైన యీ హాస్యమెట్లున్నను కాంభోజిలో నేడ్పించుటలో నొక రసికత యున్నది. ఇది హరికాంభోజి జన్యము. షాడవ సంపూర్ణము. ఏకాన్యస్వరభాషాంగ రాగము. సర్వస్వరగమకము. 'వరిక' రక్తి, రాగము. చాల ప్రాచీనము. ఆలాపన కవకాశమెక్కువ. పెద్దరాగములుగాని వానిలో రాగ ప్రస్తారము జేనెడింటిలో మూరెడుకట్టి యన్నట్లుండును. అందుకే విద్వాంసు లాలాపన విషయము వచ్చినప్పుడు తోడి, భైరవి, శ్రీరాగము మొదలగు ఘనరాగములనే యెన్నుకొందురు. కాంభోజిలో నన్యస్వర సంచారము గూడ నున్నది. 'సాని పదసా' అను ప్రయోగమున శైశికికి బదులు కాకలీ నిషాదము బలుకుచున్నది. తక్కినచోట్ల కైశికి నిషాదమే. 'దగరిసా, రిమగసా' రిపమగసా

(1) హిందోళ: సమగమద2సా-స2దమాగసా; (2) కాశీఖండము: (5-167).

అను దాటుస్వరములు ప్రసిద్ధములు, గ, మ, ప, ద, న్యాస స్వరములు, ఈ రాగవి ంత విశాలమైనది. సాయంకాలమునఁబాడఁదగినది. కాంభోజీ, కానడ, భూపాల మొదలగు వానివలె కేవల దైన్యమునే దెలుపదు. అది యెంత దీనమో యంత గంభీరము. కౌలీనతతోడి గాంభీర్యము నది సూచించును. ఈ విషయమున సందేహమున్నవా రొక్కసారి 'వడివేలు' గారు రచించిన యటతాళ వర్ణమును విన్నచో సందేహము దీరిపోవును. ఇన్ని భావములను మనసులో నుంచికొనియే సంగీత కళా రహస్యనిధి, యామెను 'కాంభోజి'లో నేడ్పించినది.

ఈ క్రింది పద్యము మరియొకటి

చ॥ అనవిని ! కేళికాసచివుడాస్వన మల్లన నాలకించి యో
జనవర ! వల్లకీరవము సంగతిఁ బాడెద రెవ్వరో వినూ
తనగతి, నిమ్మహాద్రిపయి, తన్మృదు పంచమషడ్జ శయ్యకొ
య్యన నెలుగించెవింటి, ప్రమదాకుల కోకిల కేకి లోకముల్॥

ఇందులో గిరిక 'వల్లకీరవము సంగతి' బాడుచున్నడి. అది సహజమే. ఇందులో వినూతనగతియేమున్నది? ఈ క్రిందిది వినూతన గతి. ఒకరాగములో రెండు భాగము లుండును. షడ్జమునుండి మధ్యమము వఱకు నొకటి, పంచమమునుండి తారషడ్జము వఱకు నొకటి, పంచమమును షడ్జముగాఁజేసి పాడినచో నొక రాగ భ్రాంతిగల్గును. షడ్జమును పంచమముగాఁ జేసినచో నొక రాగమగును. ఇక్కడ మృదు పంచమ మన్నాడు. కనుక గిరికాదేవి వసంతరాగమును బాడుచున్నదనియే మనమూహింప వలెను, వసంతమున షడ్జమును బంచమ మొనర్చికొన్నచో 'సరసాంగి' యను మేళకర్తయు. తజ్జన్య రాగములగును, పంచమమును షడ్జముజేసి పంచమమును వర్జించినచో 'చారుకుంతల' యనురాగమగు చున్నది. అదియే యిందలి వినూతనగతి; కోకిలలు, నెమళులు, ఏక కాలమున అనఁగా వసంతమున గూయు చున్న వనుట, సానూన్యమైన చమత్కారము.

గిరికావసురాజుల వివాహ సందర్భమున నొక పద్యముగలదు. అది యిది.

చ. అకుటిల సౌమ్యమాన నిలయస్ఫురణంబును, నాతి మాత్ర తా
రకపరివర్తనంబు శుభరాగ మిళత్పద పల్ల వాంకము
ద్రికయును బెంపు మీర నిజదృష్టులఁ బోలిన సింధు కన్యకా
ప్రకట వివాహగీతికలు పాడిరి పుణ్యపురంధ్రికామణుల్.

వివాహములందు లక్ష్మీ నారాయణుల కల్యాణమును గూర్చిన పాటలు పాడుట సంప్రదాయము. నిజదృష్టులఁ బోలిన యను నుపమానముతో నొక శ్లేషాలంకారము. ఈ పద్యమున విషయమింత మాత్రమేగాదు. వాఁడే రాగమున గానించినదియుఁ గవి తెలుపు చున్నాఁడు. 'సింధుకన్యక' యనఁగా సైంధ (3) వి. ఆ పేఁట నొకరాగ మున్నది. దానికి నిషాదమందే లయము. అనఁగా నంతవఱకే స్వర సంచారమన్న మాట. అతి మాత్రమైన తారస్వర సంచారములేదు. అనఁగా హెచ్చుస్థాయిలోఁ బాడరాదు. ఈ చమత్కారము నిందు లగించినాఁడు.

వసురాజేంద్రుఁడు గిరికకుఁ దన్ను గాన్పించి కొనునప్పుడు 'మదభృంగీరుతి' చెలఁగినది. వాని ఝంకారములు సారంగ రాగమం దుండెనట. "సారంగ" మేచక కళ్యాణి జన్యము. సరిగమ పదనిస సనిదపమరి, గమరిస, అని దానిరూపు. ప్రతిమధ్యమ రాగము మధ్యాహ్నమునఁ బాడఁదగినది. శుద్ధమధ్య మన్యస్వరము. 'రిగ', 'మద' రాగచ్ఛాయా స్వరములు. 'మరిగమరిస' అను సంచారము, గండుతుమ్మెతల ప్రమోతవలెనే యుండును. వందిమాగధులు బహుశ: సారంగరాగమందే రాజులను గీర్తించుచుండిరేమో! ఆ నాటి యట్టి గానములఁదు రాజువేషము వచ్చునప్పుడు సారంగ రాగము నాలపించు చుండిరేమో! ఇట్లు సంగీత శాస్త్రమునకు సంబంధించిన విషయములు వసుచరిత్రలోఁ గుప్పలకున్నవి. వానినన్నిటి నిక్కడ జర్చించుటకు వీలులేదు. తుమింపుడు.

భట్టమూర్తి కభిమానమైన మరియొక విషయము జ్యోతిషము. ఆఁతడు సమయమువచ్చినపుడంతయు నా సాంకేతికములను వాడును. ఈ పద్యమొకటి.

---

(3) సైంధవి : ని ద ? స రి గ మ ప ద ? - ద ప మ గ రి స. ? ద ? స.

చ॥ అళిఘట మీనకేసరి శరాసన గోమకరంబులన్, గచం
బులగుచనేత్రమధ్యముల భ్రూకుటి జంఘికలన్ జయించి, ని
స్తులత. నజాంగనాధిక యశోనిధియైన యవక్రవృత్తికిన్
గలికికి నీ యెడన్ మిథునకల్పన, యోగ్యమటంచు బల్కినన్.

గిరికా వసురాజుల వివాహము మిథునలగ్నమందు జరిగినది. మిథునము యుగ్మరాశి, వాయురాశి, దాని చిహ్నమే దాంపత్యము. మిథునము లగ్నమైనప్పుడు సప్తమశుద్ధియుండునట్లు జాగ్రత్తగ జూచి కొనవలెను. సప్తమముపై నే దృష్టియు లేకయుండుట మంచిది. మిథునమే యేలకావలసి వచ్చినది ? తక్కినలగ్నము లామెచే జయింపఁ బడినవనుచున్నాఁడు. అళి, కచములచేఁ బరాస్తము. ఘటమీనములు కుచనేత్రములకు దాసోహమన్నవి. కేసరి మధ్యమునకుఁ గ్రిందు. శరాసనము భ్రూభంగ విజితము. కటిజంఘికలు గోమకరములను జయించినవి. అళియనఁగా జ్యోతిషమున వృశ్చికలగ్నము. ఘటము కుంభము; కేసరి సింహలగ్నము; శరాసనము ధనుస్సు; గోశబ్దముచే వృషభలగ్నము నిర్దిష్టము. మకరముచే మకరలగ్నము వాక్రువ్వబడినది. గిరికాదేవి నిస్తుల. సాటిలేనిది. తులాలగ్నము నతిక్రమించినది. ఆమె యజాంగనా యశోనిధి. సరస్వతీదేవికంటె గొప్పదని తాత్పర్యము. 'అజ' అనగా మేషము. 'అంగనా' శబ్దము కన్యాలగ్న సూచకము. భాగుగనేయున్నది. కర్కాటక లగ్నమున్నదిగదా ! అదియేలకారాదు ? గిరిక యవక్రవృత్తి. కుళీరము వక్రవృత్తిగలది. అందుచేనది బనికిరాదు. ఇఁక దక్కినది మిథునలగ్నమే; గిరికా వివాహమున బృహస్పతి వారికి రక్షగట్టినాడట ! ఆ పద్యమిది.

ఉ॥ రాజకరానుషంగమున రామకరాంబుజమొప్ప, గన్యకా
రాజితహస్త యోగమున రాజకరంబు నతిప్రకాశమై
రాజిల, రక్షగట్టుకియ, రాజముఖీకర పంకజంబునన్
రాజకరంబునన్ గురుడొనర్చె, సమంత్రక కౌతుకాంకముల్".

బృహస్పతి కనుకట్టు చేసినాడు. రాజనఁగాఁజంద్రుడు. ఆతని కరానుషంగముతో నంబుజము ప్రకాశింపదు. అట్లే కన్యారాశిలో హస్తా

నక్షత్రమునఁ జంద్రుఁడున్నప్పుడాతని కతిప్రకాశముండదు. ఈ రెండును సంఘటించునట్లు రక్షకట్టినాఁడు. చిత్తలో చంద్రుఁడున్నప్పు డతిప్రకాశము, 'చిత్రా చంద్రమసోరివ' అని వాల్మీకి, "కన్యకారాజిత హస్త యోగము" రాజకరమున కెప్పుడు ఘటించును? చైత్ర శుద్ధ చతుర్దశి నాఁడు వచ్చును. ఈ విషయమునిచట నా విద్వాంసుఁడు దెలిపెను.

ఉ॥ క్షోణిబలారికిన్ బలనిషూదనదత్తములైన గొప్పక
ట్టాణి సుపాణి యెంటు లలరారె నగాత్మజ లక్షణంబు
శర్వాణికి, శుక్రురాణికిని, వాణికి, ఁగానమటంచు నాఘన
శ్రోణి విధంబుదెల్ప, గురుశుక్రులు వీనులఁ జేరరోయనన్॥

శుక్రుఁడు తెల్లని వాఁడు. ఆతెలుపెంతటిదో మన మాకాశమున జూచినఁ దెలియును. గురువు పచ్చని వాఁడు. గురువును బంగారుతోను, శుక్రుని ముత్తెములతోను బోల్చి చెప్పినాఁడు.

ఇంకనుగొన్ని జ్యోతిశ్శాస్త్ర విశేషములు వ్యాఖ్యానకారులే యక్కడక్కడఁ జేర్చినారు మరికొన్ని యూహించికొనవచ్చును. సాధారణముగా భట్టుమూర్తికి లేనివున్నట్లును, ఉన్నవి లేట్లును ఆరోపించి సంతసించుట యొక యలవాటు. ప్రథమాశ్వాసమందే యట్టి దొక పద్యమున్నది. అది యిది.

ఉ॥ కేళివనాళి నీయెడ శుకీనినదార్భటి ఁజెప్పనేల, భూ
పాలక! నీలకంఠములు పాయకమ్రోయు లతాంతవాసనా
జాలము నోడు ముట్ట, సురసాలము వీడ్కొనివచ్చుషట్పదీ
మాలికదోచు నబ్బురపుమబ్బుల యుబ్బులు గుబ్బతిల్లగన్॥

వసంతము మయూరముల కుత్సాహజనకముగాదు. కాని వసంతమున మయూరములుగూడ భ్రాంతితో నదించుచున్నవని యొక యలంకారమును గూర్చినాడు.

గిరికా వసురాజుల వివాహసందర్భ విషయమున నీపద్యమున్నది

సీ॥ నిమ్న ప్రపాతాంత నిర్ఝరపరిఖతోఁ
గనుపట్టి గోటయై కటకపరిధి
మణిచిత్ర కీరణ తోరణమాలికలతోఁ బ్ర
కాశించె గృహములై గహ్వరములు
శుచికరోపల భంగ సోపానసరణితో
చెలఁగె సౌధాళియై శిఖరపాళి
ఘనసార వసుసార గంధసారములతో
నలరె నంగడులై తటాజిరములు

గీ॥ కలమధుర కోకిలా లాప కలనతోడఁ
జెన్నలరెఁగన్నెలై కొన్ని చిన్నిలతలు
సమధికస్కంధ శాఖా భుజములతోడఁ
దనరె తరుణాగ్ర గణ్యులై తరువులెల్ల॥

ఈ పద్యమును బైదానివంటిదే. తన పాండిత్య బలముతోఁ గంద కాదుల నేర్పఱచి లేని వున్నట్లు దోపింపఁజేయుచున్నాఁడు. ఇట్టిదే మఱియొకటి.

సీ. మును సుమనో రాగమున వసంతము సూపెఁ
గాననేందిర యశోకంపు గొమ్మ
కాకొమ్మ నగుచు నెయ్యమునఁ గ్రొన్ననతేనె
మెలఁగెడు సరసాళి మీదనెరపె
నాసరసాళి సోయగపుఁ బాటలతోడ
జని, మాధవి ప్రవాళశాటి దుడిచె
నామాధవి పరాగ మఱిరాగము మించఁ
బరతెంచు కలకంఠిపై విదిర్చె

గీ॥ నిట్లు లతికలు హితకోటి నెనసి నపుడు
మదనదేవోత్సవ క్రీడ బొదలుననిన
వసులు దరుణులు విసులయో వరుల వలయు
సిరుల వలరాచ జాతరల్ సేయుటరుదె !!

పై పద్యమున వస్తువులేమున్నవి? తీగెలు తుమ్మెదలు కోకిలలు వానితోనే యొక చిన్న యేకాంకనాటక మాడించినాఁడు. అతని రచనలోని వస్తువులన్నియు నింతే పాపము! సాధ్యమైనంతవఱకు మనుష్యులనుగాని దేవతలనుగాని దనకావ్యమునకు దోడ్బడుమని వేడ లేదు అతనివస్తువులన్నియుఁ జెట్లు, చేమలు, నదులు, కాయలు, పూలు, పండ్లు. శుక్తిమతి యొక యేఱు. నాయకుఁడొక పర్వతము. గిరిక యొక వనమల్లిక. ప్రకృతినింతగా ప్రేమించు హృదయమును మనము శబ్దచమత్కారమని యొక మాటతోఁ ద్రోసివేయుట నిష్కరుణమైన దృష్టి.

ఉన్నవిలేనట్లు చూపించిన ఘట్టమిది.

సీ॥ నిరతంబు దుర్మార్గ నిరతులై తురకల
నతుల సన్మార్గ సంగతులఁ జేసె
ననియత మోహాంధులౌ పారశీకుల
స్వస్త్రీసుఖైక నిశ్చలులఁ జేసె
నతినిర్దయాత్ములౌయవనుల భూత సం
తాన తృప్తిప్రదాత్మకులఁ జేసె
ద్విజపశుపాతంబు దెగడు పాశ్చాత్యుల
ద్విజపశుపాత భావితులఁ జేసె

ననుచుఁ గడుమెచ్చి జయలక్ష్మి, యాజిరంగ
కాతర బరీదకేతన ఘటిక భద్ర
కలశమెదురుగఁ బూని యే ఘనునిఁ జొందె
నతఁడు సామాన్యుఁడే వేంకటాద్రి విభుఁడు.

'దుర్మార్గనిరతి' మోహాంధత మొదలగువానిని లేనట్లు జూప యత్నించినాఁడు. దేవేంద్రుడు వసురాజునకు 'బిసప్రసవసర' మిచ్చిన సందర్భమున నిట్టివే గొన్ని పద్యములున్నవి. కావ్యమంతయు నాతఁడిట్టి శబ్దచిత్రములతోనే నింపలేదు. తన్నుమఱచి పలికిన ఘట్టములుగూడ నున్నవి. కాని తక్కువ.

గిరికాదేవి విహారమును జూచినప్పుడు వసురాజు పనవిన మాటలు నిజముగా భట్టుమూర్తి తన్నుమఱచి వ్రాసినవి.

మ॥ కమనీయద్యుతి ధామమా ! విమలముక్తాదామమా సేమమా !
కమలామోదకుఁ దత్సఖీసమితికిన్ గల్యాణమా ! తన్మరా
ళమయూరీ శుకశారికలకెల్లన్ భద్రమా ! తెల్పుమా !
ప్రమదారత్నము పేరుగా, నెద, నినుంబాటించి ప్రార్థించెదన్.
(4-100)

మ॥ నినుభాగ్యాంకుర పంక్తిగాఁ దలతునో ! నిర్వేలమూర్ఛాపనో
దనదివ్యామృత ధారగా మనమునం దర్కింతునో ! కాక, మ
ద్ఘన పుణ్యద్రుమకోరకావలియకాఁ గన్గొందునో ! ప్రేమనే
మనివర్ణింతుఁ బ్రియాపయోధరవిహారా ! హారవంశోత్తమా !
(4-101)

చ. వనజముఖీ కుచోపరినివాస సుఖోన్నతి నున్కిమాని, నా
మనికిత మార్పవచ్చితివి మౌక్తికహారమ ! నీ గుణంబులే
మని వినుతింతు, నట్టిద కదా యవదాత సువృత్తమూర్తు లెం
దును నిజ సౌఖ్యభంగము గనుంగొన, రార్తులఁ బ్రోచువేళలన్.
(4-102)

చ. చెలుల మొఱంగినాడు మణిచిత్రగృహంబున మోమువాంచి తొ
య్యలి భవదేక దర్శిత మదాకృతి జూచెఁ గదా ! వినీలకుం
తల హృదయంబు నీకు విదితంబుగదా ! యిఁక దాచ నేటికిన్
వెఱఁదిమనంబు దెల్పఁగదవే ! మణిహారమ ! నిన్ను వేడెదన్.

ఉ. గ్రావసుతాకుచాగ్ర పరిరంభనిగుంభ సుఖోపలంభ సం
భావిత ! భావిమత్కర విమర్దన కోడకు మీ, విశుద్ధము
క్తావలి ! బాలికా నవసమాగమ యోగ్య మహోపలాలన
శ్రీవెలయింతుఁ గాని, నినుఁ జిక్కులఁ బెట్టఁజుమీ రయంబునన్.
(4-104)

శా॥ శుక్తిక్రోడ కుటీ గుహావసతివై, సూచ్యగ్రస్థాయివై
ముక్తాహారమవై, భజించితి గదా ముగ్ధాకుచద్వంద్వ సం
సక్తిన్, దాదృశభూతి తావక కృపాసంసిద్ధి లేకబ్బునే
ముక్తాహారత నున్నయంతనె, తలంపుల్ నింపు నాకింపుగన్.

పై పద్యములు జదువుచున్నప్పుడు మనమును భూషణకవితో పాటు శరీరములు మఱతుము. ఈ సందర్భమునఁ గూడ నాతఁడు శ్లేషవదలలేదే యని యాక్షేపము. వదలకున్నచో మన అబ్బి యేమి మునిఁగిపోయినది? రసానుభూతికాశ్లేష యడ్డు వచ్చుట లేదే! అతని శ్లేష యంతయు నింతే; వసుచరిత్ర! నేకార్థక కావ్యముగాఁ జదివి తృప్తిపడువారి కాతని పాండిత్యమేమియు నడ్డురాదు. "అధిక స్యాధికం ఫలం" వంటిదాతని శ్లేష.

ఆంధ్రసాహిత్యములో రామరాజ భూషణుఁడొక విచిత్రవ్యక్తి. గొప్ప గాయకుఁడు. మహాపండితుఁడు. సౌందర్యమును భావించిన, ప్రకాశించిన రసికుఁడు తన్నుఁదాను మఱువని కఠినుఁడు, మఱచు లలితుఁడును. ప్రాగ్వ్యకవి దొక్క శ్లోకమున్నది.

కింకవేస్తేన కావ్యేన, కింకాండేన ధనుష్మతాం
పరస్యహృదయే లగ్నం, నఘూర్ణయతి యచ్ఛిరః

ఈ శ్లోకమునకు సరియైన యుదాహరణ మాంధ్రములో రామరాజ భూషణుఁడుదప్ప మరిలేఁడని నాయభిప్రాయము. ఆతనిని భావించుటకు శక్తియు రక్తియుఁ గావలయును.

వసు - వసుచరిత్రములు

వసురాజు చేదిదేశమును పాలించుచుండెను. అతఁడొకనాడడవికిఁ బోయినాఁడు. నిర్వేదము జనించినది. శస్త్రములు వదలి తపమున కుపక్రమించెను. అతనిపాలి కింద్రుఁడు వచ్చెను. 'నీ తపమునకు సంతోషించితి న'ని యావసువునకు దేవత్వమొసఁగినాఁడు. ఇంద్రమాల యను పేరుగల కమలమాల నొసఁగెను. వేణియష్టియు నిచ్చినాఁడు. ఒక దివ్యవిమానము గూడ నింద్రదత్తమైనది. నాటినుండి వసురాజుపరిచరుఁడు, కృతజ్ఞతాసూచకముగా నింద్రోత్సవ మారంభించినాఁడు. అతని తరువాత రాజులా యాచారమునుసరించిరి. ఇంద్రుని వరమున నాతనికి సంతానమైనది. వారేవురు. ఆ పుత్రులు వంశకరులైరి. ఆతని పురసమీపమున శుక్తిమతియను మహానది పారుచుండినది. కోలాహలుఁడు దానినిఁగామించెను. వసురాజా పర్వతమును బాహతలమునఁ దొలఁగద్రోసినాఁడు. శుక్తిమతికి వసుపదుఁడను. కొడుకును గిరికయను కూతురును గల్గిరి. ఆమె యాయిర్వురను ఉపరిచరునకుఁ గాన్కగా నిచ్చినది. వసురాజు గిరికను బెండ్లియాడెను. వసుపదుఁ డాతనికి సేనాపతియైనాఁడు. అగ్గిరిక ఋతుమతియైనది. పితృదేవతల యాదేశముతో వసువు గిరికకు మృగమాంసమును దెచ్చిపెట్టుటకై వనమున కరిగెను. "పలుకుల ముద్దును" కలికిక్రాల్గన్నుల తెలివును"గల "గిరిక, యాతని మనస్సున మెలఁగినది. ఈ కథయిట్లే మత్స్యగంధి జననము వలుకునుఁబోవును.

పై కథనము నన్నయ్యగారిది. వారి 'హితమిత నూక్తుల' వాసన యందుండనేయున్నది. వ్యాసభగవానుఁడు చెప్పిన కథకును నన్నయ్య దానికిని ప్రధాన విషయములలో నంతభేదములేదు. వ్యాసుని వసంతవర్ణనము తెనుఁగునఁ దొలఁగింపఁబడినది. పై కథ నాధారముగా

జేసికొని భట్టుమూర్తి వసుచరిత్ర రచనకుఁ బూనుకొన్నాఁడు. ఆతఁడు గిరికా వివాహ పర్యంతముమాత్రమే కథావస్తువుగ గైకొనెను. కావ్యమున కంతేగదా ! రసోచితముగఁ గొన్ని మార్పులు చేసి కొన్నాడు. నాటకీయములైన లక్షణములు ప్రవేశపెట్టెను. వసురాజు ముఖ్యపట్టణ మధిష్ఠానపురము. ఈ పే రాతఁ డెక్కడ సంపాదించెనో ? కావ్యము వసంతముతోనే యారంభమగు చున్నది. ఇది వ్యాసుల ప్రభావమేమో ! ప్రథమాశ్వాసములోనే వసురాజు కోలాహల పర్వత మును మీటినగాథను. రంగప్రసాధనముగా సూచించినాఁడు. 'బలారి' యాతనితో సఖ్యమును పాటించెనఁట ! అంతవఱకును మహేంద్రున కొక్కడుఁ డుండెను. తాను పర్వతముల రెక్కలు మొక్కలువోఁ జేసినవాఁడు, 'అహార్యశాసనుఁడు,' వసురాజు కోలాహలమును 'బొట ద్రవేలితో' లేగవ్వమీటిన సూటితో మీటినాఁడు. దీనితో మహేంద్రుని గర్వము వీసరవోయినది. నాటనుండి వసురాజు స్వర్గమునకు రాకపోక లొనర్చుచుండెను. దేవేంద్రునితోఁబాటు సరిగద్దియ గూర్చుండు మరి యాద యాతనిది. ఆ కూర్చున్న సన్నివేశ మిట్లున్నది.

చ. ఘనుఁడతఁ డేగుదెంచి సరిగద్దియనుండ, నగారిశైల ఖం
డనకథ చారణాళి వొగడన్, నిజసన్నుతి కోసరించు నే
ర్పునఁ దలవంచి, పీఠతట రూఢమణిం బొటద్రవేల మీటు న
య్యనఘుఁడు, కొండ మీటిన మహోద్భుత కృత్యము దెల్పుచై వడిన్.
(1-121)

ఇంద్రున కహల్యా కామనారూప పాపమున్నది. వసురాజున కట్టి లోపములేదు. అందుచే నాతఁడనఘుఁడై నాఁడు. శుక్తిమతీ కోలా హలుల కాపురమును గూర్చి భట్టుమూర్తి మంజువాణిచేఁ జెప్పించెను, శ్రోత' వంచనాయతి'; ఆమె కోలాహలుని రభసమును కొంత హడా విడిగనే వర్ణించినది. మంజువాణి పుంవత్ప్రగల్భ. అది యానాటి సామాజికదృష్టి, దానిని మన మిప్పుడు విమర్శించి కొన్నచో నతనికి నష్టములేదు. మనకు లాభమునుసున్న. పెద్దన్నగారు గూడ నీవిషయ మును దక్కువగా వర్ణింపలేదు. కాని వారి వర్ణనము కథాభాగ

ములో వచ్చినది. వారి కదియొక రహకమైనది. ఇక్కడ మంజు వాణి ప్రసంగించుచున్నది పురుషునితో, గిరికయెదుట తక్కిన చెలిక త్తెలుగూడ నున్నారు. కొంత మట్టసముగఁ బలికియున్న బాగుండెడి దేమోయని మన దృష్టి కనిపించుటలోఁ దప్పులేదు. శుక్తిమతి నదీకులములోఁ బెద్ద; అమూల్య గుణమణి ప్రకాండ; అందుచేఁ దక్కిన నదులన్నియు నామెను గొల్చుచుండెను. ఆమె దినమును దన బలగ ముతో నలువ కొలువున కేగుట 'రివాజు'. కోలాహలుఁడు గూడ బ్రహ్మకొలువున కేగుచుండెను. ఒకానొకనాఁడు వారిక్వ్వరును సంధించి కొన్నారు. ఆమె కొలువునకేగి వచ్చుచున్నది. ఈతఁడు హైమగర్భ గేహమున కేగుచున్నాఁడు. కోలాహలుఁడు, తన భాగధేయ మహిమముతో మిన్నులు ముట్టి వచ్చుచుండెను. ఆతనికేమి తక్కువ గనుక ? అచలాధిపమౌళికిఁ బుత్రుఁడు; జగజ్జనని కనుఁగుఁదమ్ముఁడు, శంకరునకు ముద్దుమఱఁది. శుక్తిమతి గొప్పయౌచిత్యము నెఱిఁగినది. ఆమె యాతనినిగాంచి వినయముతో నోరగాఁజనెను. శుక్తిమతి బాహ్య సౌందర్యము కోలాహలుఁ గాఢతర ధైర్యమును గలఁచి వేసినది. వాఁడానాటికి వెడలిపోయెను. నాటనుండి వానికామె 'చింతా తన్మయత్వ' మేర్పడినది. కోలాహలుఁడు దక్షిణ నాయకుఁడు, రంభా దులు వాని మనస్సున నిల్వలేదు. పద్మినులు వాని నాకర్షింపలేదు. వాఁడతను తాపవహ్నిపాలై నాఁడు. నిత్యశుక్తిమతీ ధ్యాన నిశ్చలాత్ముఁ డై నాఁడు. అంచిత గహన రోమాంచుఁడై నాఁడు, వాని వేదన యేమిటను దీరినదికాదు కపురపుగమ్మతావి, నోవియైనది; చలిగ్రస్తుడు గొజ్జగినీరు కొందలమైనది. అచ్చపునెలరాల వెల్లువలు తల్లడమ; గూర్చి నవి. చందనవాసన భీషణమైనది. వాఁడు దట్టుకొనలేకపోయెను. కోలా హలుఁడు 'దివ్యరూపోజ్జ్వలుఁ'డై శుక్తిమతిని దరిసినాఁడు; వాఁడు వచ్చుచున్న దెందులకో శుక్తిమతి యెఱుఁగును. కాని యేమిసేయును? పెద్దవాఁడు, ఆమె యెదురేగినది. ఊర్మిమయ హస్తన్యస్త రాజీవ రాజీ రాజన్మణి భాజనములలో రజశ్రీగంధ కింజల్క రేఖా రక్తాతపతముల వహించినది. పూజావిధులు వరుసగాఁ దీర్చినది. శుక్తిమతి సాహిత్యపు మెలఁకువ లెఱిఁగినది. ఆమె జీవనమెల్ల సత్కవి నిషేవితము. భువనాశయ

సన్నివేశవేదిని, మహాప్రౌఢ. వాని స్వభావమును మృదుసుందరముగా శుక్తిమతి యెత్తిపొడిచెను.

చం. విలసిత రత్నకూటములు, వేలుపు కన్నెల కూటముల్, సుధా
కలితసరఃకృపీటములు, కామితనూతన వస్తుజాలదో
హలసురభూజవాటములొకప్పుడు పాయక గల్గునీకు న
వ్వల, నొకయర్థనీయమగు వస్తువుగల్గునె ముజ్జగంబులన్॥

కం. ఏతాదృశగుణగరిమ స
మేతాత్ములు, మీరలిచటికేతెంచుట యో
శీతాద్రితనయ! మదుపరి
జాతాభినవానురాగసంపత్తి గదా!

వేలుపు కన్నెల కూటములు నీ వెఱుఁగనివి కావుగదా! మరి తృప్తినహింపక నావరకేల వచ్చితివని యామె లలిత లలితముగా నడుగుచున్నది. 'శీతాద్రితనయ' యని పొగడుచునే నీ వంటివానికిది తగదను చున్నది. వానికీధ్వని యర్థముగాలేదు. ఒక్క లేత నవ్వొలయించినాఁడు. నిజముపల్కితివని యామె మాటలొక సర్టిఫికెట్టుగా నన్వయించి కొన్నాఁడు. 'సరసాగ్రగణ్యవ' ని యామెను బొగడినాఁడు. తన ప్రణయోదంతమును జెప్పుటకు మొదలు పెట్టినాఁడు. మాటలునేరుగనే జరిగినవి. రహస్యముంచికొన నవసరములేదు. కోలాహలుఁడు వయస్సు చెల్లినవాఁడు, శుక్తిమతిప్రౌఢయని ముందే చెప్పితిమి. కడకు వాఁడిట్లు కూటమిని యాచించెను.

ఉ. చెప్పెడిదేమి! నాకుఁగల జీవనమంతయునీక గూర్చి యె
ల్లప్పుడు, నిన్ను బాయక బ్రియాచరణం బొనరింపనేర్తు, నీ
చొప్పున కీవునియ్యకొని, చొక్కపు జక్కవగుబ్బలాడి, మే
ల్దప్పక యంతరంగమున దారిచి నన్ననదీనుఁజేయవే॥ (2-129)

నది + ఇన = యని మరియొక పదవిభాగము. ఈ ధ్వనిగరిమకు శుక్తిమతి గలఁగినది. ఆమెకు వానిపై మనస్సులేదు. వినయము నయము, భయము ఒక్కసారిగా నామె మనస్సునఁ దోబూచులాడినవి. శుక్తిమతి బదులు వల్కెను. వినయముతో నారంభించినది.

"పర్వతగ్రామణీ! నా నిలువెల్ల నీచాతినీచోపసరణము, ప్రకృతి జాడ్యపరిణతము. పెంపు గాంభీర్య మాన విహీనము. అంతరము పంకా విలము, జీవన మంచిత బుద్బుదప్రాయము; ఉదయము దుర్ది నోన్ముఖము, గతులు కుటిలప్రకార కారణములు. ఉత్సేకములు భంగాకులములు, నిలుకడయందమా! హుళక్కి, తావులు పొలసు వల్చును. నీవా అచలితోత్తుంగ ధైర్యుడవు, అలఘుమతివి, అనఘుగతివి, అభంగశీలుఁడవు, నీకు మాతోఁజెల్మి యెట్లు పొసఁగును? పైపద్య మున ప్రతిపాదమందును సర్వపర్యాయంబైన యెల్ల శబ్దంబాప్రేడిత మైనది. దీనితో శుక్తిమతి వినయమెంత జూపవలయునో యంత చూపినది. పైఁగా నామె కోలాహలునకుఁ గొన్ని విశేషణములు వాడెను. ఆ గుణములిప్పుడు వానిలోసున్న. ఆ వాడుట నీవిట్లుండవలె నని వానిని శిక్షించుట. క్రిందిపద్యములో 'మహాత్మా' యని కోలా హలునిఁదలపై దొడ్డహేమ కిరీట ముంచుచున్నది. 'మారసము లెచటి కెక్కునని అనను రూపత్వమును వాదించుచున్నది. ఈ మాటలు గట్టు రేని హృదయముపైఁ బనిసేయలేదు వాని మోము విన్నదనమైనది.

"శుక్తిమతీ! భవత్కమనీయ కాంతిధారావళిలో మున్గితిని, దయామతిఁబ్రోవక సుళ్లు బెట్టెదవో గ్రుచ్చియెత్తి ఘననిర్వృతి దెప్పలఁదేల్చెదవో నీవే ప్రమాణమ'ని శరణాగతుఁడైనాఁడు, శుక్తి మతికిఁ గొంత కఠినముగా మందలింపక తప్పలేదు. "అగ్గలమగు పంచ సాయక వికారముతో నిజగౌరవోన్నతులఁ దలఁపకున్నావు, మాదృశ జడస్థితిఁ దెప్పదేలుచున్నచో మీ కులగిరి కోటిలో లఘుత్వముగాదా! యోచించి చూడు మన్నది." ఆమె యిట్లు పలికెను.

మ: మతిగ్రీడారతి గల్గెనేని సకలశ్లాఘ్యావుణ్య దేశాళి గాం
చి, తపస్ఫూర్తి మెయిం గృశించి, వనరాశిం జెందు మాబోంట్లను
ద్ధతిచేగ్రమ్మగనేల? నీకుఁగలవే? తారుణ్యలావణ్య జృం
భిత రంభాది నిలింపభామలు .....

కోలాహలుఁడు రాగాంధుఁడు. వాఁడు హేతువాదమునకు దిగెను. వాని వాదమిది.

సీ. అతను భూతి ఘటింపదయ్యెనే! చదలేకు
సికఁదాల్చు నింధాన చిత్రకునకు
వరవంశవై ఖరి వదలెనే! రవిసుతా
పతియైన దైతేయ భంజనునకు
వసులాభసంపత్తి మసలెనే! జాహ్నవి
జేకొన్న శంతనుక్షితిపమణికి
కమలోదయఖ్యాతి దెమలెనే నానాన
దీకాంతుఁడైన రత్నాకరునకు

గీ. వారికే లాఘవమువచ్చె, ననిత? యెంత
మారుమసలెదు, వట్టి నేమములు చాలు
నేలు నన్ను..... (2-176) (136)

అని 'దీర్ఘ భుజశాఖతో' 'సతికమలాళిపట్టు' పట్టుకొన్నాఁడు. కోలాహలుఁడు పేరొక్కన్న వారందఱు నదీకాంతులే, శుక్తిమతి తన మాటలో జెప్పికొన్న వారి వంటివారే. ఇఁక మార్గమేమున్నది?.

ఉ. వేణిచలింప, కంపిత నవీన మృణాళ భుజాగ్రకంకణ
శ్రేణినటింప, లోలశఫరీనిబిరీసకటాక్ష కాంతివి
న్నాణముసూప హంసకగణక్వణనంబును మీఱ...

నా 'నైకతశ్రోణి' వివర్తితాబ్జముఖ శోభితయై కడు సంభ్రమించినది. కోలాహలున కీమె దక్కినట్లులేదు. వాని యాస్యము జేవురించెను. రూపాటోప సంరంభియైనాఁడు. శుక్తిమతి కూలంకష గాఢగర్వనిధి, ఆమె ననుసరించి భోగించుటకు సాధ్యముగాదు. ప్రాతి కూల్యపరుషోద్య క్రౌఢికిఁ బూనుకొన్నాఁడు. శుక్తిమతి గట్టిగా నఱచెను. వసురాజు గల్పించికొని కోలాహలు నెగఁజిమ్మినాఁడు. ఆ పర్వతమూర్వి క్రావాలినది. క్రావాలియు నా యేటికే గ్రుక్కళ్ళు క్రింగు చుండెనట! ఏమిసేయును? వసురాజన్న భయము, శుక్తిమతికి గర్భమైనది. ఒక కుమారుఁడు గలిగెను. కూతురును బుట్టినది. కోలాహలునితో మరల నామె మాటాడినదే లేదు. సంతానమైనప్పుడును వాఁడు శుక్తిమతిని బరామర్శింపరాలేదు. అతఁడురావలెనని యీమెకోరికయు

లేదు, కోరకున్నను వానిపాలికి మాత్రము శుక్తిమతి 'నెయ్యపుందొయ్యలి' కల్గిన సంతానముతో దనయన్వయము పావనమైనదని మురిసి నాడట! ఈ సంతోషము వసుఖీతీంద్రుచే ప్రయ్యాణవడ్డ నెవ్వగను క్రమింగివేసినది. కొడుకునకు శుక్తిమతి పేరువెట్టెను. ఆక్రమము జూడుఁడు.

మ. అమితానంది రసద్విజారవము చెన్నారన్, గుమారోదయ
ప్రమదారంభ విజృంభమాణ యగుచున్, బద్మాస్యశ్రీ లావరో
ధమువారించి తనున్ ధరించె వసుపాదంబంచు నూహించి నె
య్యముదై వార నొనర్చె, దద్వసుపదాఖ్యానంబు తొల్చూలికిన్.

సంతానము గల్గినను శుక్తిమతి యెదలో కోలాహలుని దుష్ప్ర వృత్తి మెదలుచునేయున్నది 'పేరేమి పెట్టుద'మని యాతని నడుగ లేదు. కోలాహలునకు గుణపాఠము నేర్పునట్లుగా 'వసుపదుఁ'డన్న పేరు పెట్టినది. తర్వాతఁ గూతురుపుట్టెను. శుక్తిమతియే యైనచో నే పేరు పెట్టియుండెడిదో! అప్పుడా 'జవాబ్దారి'ని మునులు దీసికొన్నారు. వారామెకు అకిల్బిషమైన ఫణితితో 'గిరిక' యని నామకరణమొనర్చిరి. గిరికాదేవిని వనదేవతలు పెంచినారు. వారే యామెకు "సైరంధ్రులు దాదులు, వయస్యలు" గిరిక మాత్రమప్పుడప్పుడు గురుసవిధ ప్రదేశము లలో నాడుకొను చుండెడిది. కోలాహలుఁడును ఆమెను ముద్దాడెడు వాఁడు. ఇంతయైనను గోలాహలుఁడు శుక్తిమతి - వీరిరువురికు నొద్దిక లేదు. గిరిక నామె యొక రీతిగ నలంకరించును. కోలాహలుఁడు వానినిఁ దీసివేసి మరియొక తొడవులుగై సేయును: నా యలంకార ములు నీవేల తీసితివని వాఁడడుగఁడు. శుక్తిమతి చెప్పదు. ఈ కిరి పద్యముఁజూడుఁడు.

ఉ. పంకజపాణి శంఖపరిభావకకంధర, తల్లి యేలకో
సంకులు గట్టెనంచు, గులశైల సుతాగ్రణిపారవై చి, ర
త్నాంచిత హారముంప, బరువానునో? బిడ్డకివేలకర్కశా
లంకృతులంచు, హల్లకకలాపములుంచు నదీ లలామయున్.

తల్లి సంకులు గట్టెను, అవి బాగలేవని తండ్రి రత్నాంకిత హారములువేసెను. ఇవి కర్కశాలంకృతులని తల్లి దొలఁగించి హల్లక కలాపములుంచినది. కోలాహలుని కార్కశ్యమునామె మఱువనేలేదు.

శుక్తిమతికి సాహిత్యమన్న బ్రాణమంటిమి. ఆమె వాణిదాల్చి సుకవి స్తోమమును రప్పించినది, గిరికకుఁ 'దద్ధనవిద్యా మహిమములు, గరామలకములు' గావించెను. వారికి నూతన పద్మోపచయమును గురుదక్షిణగా నిచ్చినది. కోలాహలునకు గానమన్నచో మెప్పు. ఆతఁడు కిన్నరకోటులను నిలిపినాఁడు. వారికి మహామణికూట సమర్పణ మొనర్చెను. గరికను గేయవిశారదను జేసినాఁడు. ఆమె కిన్నెరమీట నేర్చినది. వీణె పలికింపనేర్చినది. గీతములు ప్రబంధములు పాడనేర్చెను. ఇరులకుఁ జెప్పనేర్చెను. ఆమె చాతుర్య మనివార్యము. కోలాహలుఁడు-

శా. వీణావాదనవేళలన్ ఘుమఘుమావిర్భూతి నింపన్ జగ
త్ప్రాణా చంచలతై లశూన్య నవదీపశ్రేణికాపాదియై
రాణింపన్, ముఖలక్ష్మికిన్ ముకురమై రంజల్ల లేబట్టికిన్
మాణిక్యాయతనంబొనర్చెగిరి యాత్మశ్రీ ప్రభావంబునన్.

గిరికా వివాహసందర్భమందును భార్యాభక్తిలిఖ్వురు నొద్దికగా మాటలాడికొన్నట్లులేదు. వివాహానంతరము శుక్తిమతి తనకుమారుని పసురాజున కర్పించినది. ఆ పద్యమిది -

శా. అసదృశభక్తి శుక్తిమతియాత్మజ రత్నములన్ నిరంకుశ
ద్విస్మృమరదీప్తివాని, శుచివృత్త మహత్వమువాని, నన్నిటన్
వసునకొసంగి యయ్యెడ నవారితభూరి తదీయసామ్య వ
ద్వసుపదనామ పుత్రమణి దద్వసుపాదముజేర్చె, చేర్చినన్.

ఇది కవిచెప్పినమాటయే. ఈ పద్యమును జెప్పుచున్న భట్టుమూర్తి కోలాహలుని దుడుకుతనము శుక్తిమతి హృదయమునుండి మాయలేదని సూచించుచున్నాఁడు. కావున నీ దంపతులలోఁ బ్రేమ నాయక నిష్ఠమే గాని శుక్తిమతిలో లేదు. ఇది రసాభాసము. ఇక మంజువాణి వసురాజు మొదలైనవారందఱుఁ బ్రబంధములలో పచ్చుపాత్రలే. మావై పొక

ప్రవాదమున్నది. 'మనుచరిత్ర వేకటివఅక ను - వసుచరిత్ర చీకటి వఅకును' బాగుండునట !

రాయలకాలమున ననేక గ్రంథములు పుట్టినవి. వానితో వసు చరిత్రకుఁ బోలిక లేదు. మను-వసుచరిత్రలను పేరులుగూడ పరస్పరము వియ్యమందుచున్నవి. కథాబాహ్యశరీరమునం దీ రెంటికిని గొంత సామ్యముగలదు. మనుచరిత్రలోని యరుణా స్పదపురము 'వరణాద్వీపవతీ తటాంచలము' నందుండెను. అధిష్ఠాన పట్టణముగూడ 'శుక్తిమతి' యొడ్డున నుండినది. రెంటియందును రసాభాసమే. వసూధిని ప్రవరునిఁ గామించెను. అతఁడామెను. తొలఁగఁద్రోసికొని పోయినాఁడు. సాయం కాలమున కాతఁడిల్లు జేరెను. ఒకానొక రాగాంధుఁడు-గంధర్వుఁడు వరూధినినిగామించి యుండెను. వారిమనస్సులు హత్తలేదు. ప్రవరుఁడు వోయిన యదను గనిపెట్టి వాడతని రూపమును ధరించినాఁడు. వాసు కామరూపులుగదా ! మనుచరిత్రయందు రసాభాసము స్పష్టమే, అక్కడి కథారంగము హిమవత్పర్వతము. వసుచరిత్రలోఁ గోలాహల పర్వతము. ఆ పర్వతము హిమవంతుని సంతానమే. బహుశః భట్టు మూర్తి నూయాప్రపరునిఁజూచి, యొకవంచనాయతి నూహించి కొన్నాఁడేమో ! మనుచరిత్రలోఁ గోననువర్ణించినాఁడు. అతనితోఁ బోటిపెట్టికొని యితఁడును గోననువర్ణించెను. మనుచరిత్రలో గారుడో త్కీర్ణమైన యొకభవనమున్నది. గారుడములు మాత్రమే యేలనని మూర్తి మణులతోనే యొక భవనమును నిర్మించెను. ఆ వరూధిని వర్ణనమీ పద్యము.

మ. అతఁడావాతపరంపరా పరిమళవ్యాపారలీలన్ జనా
న్వితమిచ్ఛోటని చేరఁబోయికనియెన్ విద్యుల్ల తావిగ్రహన్
శతపత్రేక్షణ, చంచరీకచికురన్, చంద్రాస్య, చక్రస్తనిన్
నతనాభిన్ నవలానొకానొక మరున్నారీ శిరోరత్నమున్॥

గిరికాదేవి యిచ్చటను వరూధినితోఁబాటు 'ప్రపంచసుందరి'కి పోటిచేసినది. ఆమెకన్నను దా నందక త్తెనని డాబుసేసికొన్నది.

చ. తరువులపొంతఁబొంచి వసుధావర మిత్రుఁడు గాంచెనచ్చటన్
తరుణి తమోపినీలకచ తామరసోదర సోదరప్రభన్
తరళవిలోచనన్, తతనితంబ, తటిన్నిభగాత్రవల్లరిన్
తరుణ శశాంకఫాల నొకతన్వి, తరంగవళిన్ తలోదరిన్.

మనుచరిత్రమున మూడవ పాదము మాత్రమే శబ్దాలంకారము. మూర్తికవి మూడుపాదములను శబ్దములతోఁ జెక్కఁడఁపుబనిసేసెను. వరూధిని-

'అమల మణిమయ నిజమందిరాంగణస్థ
తరుణ సహకారములవితర్ది ...'

పైఁ గూర్చున్నది. చేతోహరమై వీచుచున్న శీతలానిలము. గిరిక 'లలితా మోద లతావితానవృత లీలాచంద్రశాలా తలోజ్జ్వల నీలా తతవేది' పై నధివసించినది. ఇంద్రనీలమణిమయమైన వేదిక. గిరిక తామరసోదర సోదరప్రభ తటిన్నిభగాత్రవల్లరి, అగుటచే నామె గూర్చున్న వాలకము 'మెయిలుక్రేవనున్న గ్రొమ్మించు'వలె నుండెనట! వరూధిని యింపుదళుకొత్త పిఱెవాయించెను. ధవళాంశుకము గట్టినది. దానిలోపల నంగదట్టము. అది కావిరంగుది. అంగదట్టపుఁగాంతి ధవళాంశుకమునుండి పైకి మిట్టించుచున్నది. దానితో శశికాంతమణి జాజువారినది. తరుణాంగుళీధూత తంత్రీస్వనమైన జలిబిలిపాట ముద్దులు నటించుచున్నది. ఆలాపగతితో గన్నులఱమోడ్చికొన్నది. ఆవాలకము రత్యానంద సబ్రహ్మచారి యైనది. రత్నకటకముల ఝణఁఝణలు తదానీత తాళమానములు. పెద్దన్నగారి యీ సృష్టిమూర్తి కవికన్నులు జిగేలుమనిపించెను ఆతనికేమిసేయుటకును దోచలేదు. గిరికతో 'వాదన ప్రౌఢి'ని మెఱయింపఁజేసినాఁడు. ఆమె పెద్ద కచ్చేరీ చేసినది.

సీ. వలుదగుబ్బలు ప్రసేవకవృత్తిదగు గుబ్బ
కాయలకపరంజి చాయలొసఁగ
లలితాంగుళీదళంబులు సమేళములైన
సారెలపై రాగసంపదలిడ

పాణికంకణరుతుల్ ప్రాణానుబంధంబు
గలతాళగతిగనుగ్రహము లీన
నాలాపభంగి యత్యక్తసంవాది స
మస్వరంబులకు గ్రామంబులునుప

గీ. ప్రచురతానామృతముల మూర్ఛనలచే, న
చేతనంబులు చేతనరీతిదనర
చేతనంబు లచేతన భాతిదనర
వీణవాయించు నొక యలివేణిగంటి !!

ఇంతకన్నను భట్టుమూర్తికి మార్గమేమున్నది? పెద్దన్నగారు దీర్చిన చిత్రమువంటి దానిని దీర్చుటకు సాధ్యముగాలేదు. ఆ మార్గమున నాతనిని మించలేడు. అనుగ్రహములు సంవాది సమస్వరములు గ్రామములు, మొదలగు సంగీత శాస్త్రములోని పదములనుదెచ్చి, గడబిడ చేసినాడు, ఆ తరువాత వంచనాయతి, గిరికాదేవిని నఖశిఖ పర్యంతము వర్ణించుటకు మొదలుపెట్టెను, పద్యములు చాల బాగున్నవి. అతిశయోక్తులలో నుత్ప్రేక్షలలో ప్రబంధకవులు గొడలేకయే బొమ్మలు గీయువారు.

మనచరిత్ర ప్రథమాశ్వాసములో ప్రవరుని చెంతకొక యౌషధ సిద్ధుడువచ్చెను, అతడు దాను జూచిన ప్రదేశముల నొక పద్యములో జిట్టాయిచ్చినాడు. మూడవది చూర్ణికవంటి పెద్దవచనము. దానిలో భట్టబాణుని వాసన. వంచనాయతి గూడ మంజువాణి మొదలగు వారితో నట్లే చెప్పికొనును.

సీ. కావున నుద్యాన గతుడైన మత్స్వామి
తోన మేరుసమేధమాన మంజు
లచ్ఛాయల గరంబలరుచు, నీలగీవ
నిలయాభిరామ సీమల దెలియుచు
సుమనో మనోజ్ఞ ధామములు మెచ్చుచు బుష్క
ర సరోవరోర్మి సంభ్రమము గనుచు
రంభాది లాస్య సంరంభముల్ దిలకించు
కొనుచు గిన్నర మృదు ధ్వనులు వినుచు

గీ. శిశిరశిఖరి స్థలంబు లీఱించి కొనుచు
జంపకారణ్య మరయుచు జగతినద్భు
తంబయిన పుండరీక కేదారసేతు
వైఖరికి నిచ్చగించుచు వచ్చివచ్చి.

చ. సరసదరీద్రురీ వికచ సారస సౌరభ సారపూరితాం
బరమగు నిమ్మహానగము పజ్జనె, యానవపద్మినీమనో
హరుఁడువెలుంగ నాయన కుపాయనమిచ్చటఁ గూర్చువాడనై
యరయుదు బద్మినీ సముదయంబని వచ్చితినమ్మ నెచ్చెలీ!

ఈ సందర్భమున మూర్తి కవి నడపఁబూనినది శిష్టమైన సృష్టి. అడుగడుగునను శ్లేష యాతని గొంతు బట్టుచున్నది. ఇంతకష్టమున్నను యాతని సహజగుణమైన శబ్దములలోని యొయ్యారము మాత్రము మాసిపోలేదు.

ప్రవరుని చెంతకు సిద్ధుఁడు 'కుతపకాలము'న వచ్చెను. కుతపకాల మెప్పుడని గతదశాబ్దములలో పండితులు వాదోపవాదములొఁర్చిరి. మనకు దానితో నిప్పుడంతపనిలేదు. అతఁడువచ్చినది భోజనమునకు ముందు ప్రవరుఁడాతని నర్ఘ్యపాద్యాది విధులతోఁ బూజించెను. 'ఇష్ట మృష్టాన్న' కలనతో సంతుష్టుని గావించెను. వారిర్వురినడుమ భోజనా నంతరము గొంతసంభాషణ నడచినది. ఆ 'తరుణాగ్నిహోత్రి'కి జాల దినములనుండి తీర్థ సందర్శనాభిలాషకద్దు, తనకోర్కె నతఁడాతనికెఱుక పఱచెను ఔషధసిద్ధుఁ 'డది యిది యని చెప్పక' ప్రవరుని కాలికొక పసరు రాచినాఁడు. ప్రవరునకప్పటికింకను భోజనముగానేలేదు. ఇతర విప్రసపర్యయు మిగిలియున్నది. ముసలితల్లిదండ్రులున్నారు. వారికి భోజనము గావలెను. అతఁడు కౌతుకభర వ్యగ్రాంతరంగుఁడు. పసరు దొఱకిన యుత్సాహములోనాతఁడు దాత్కాలికముగాఁ గర్తవ్యములు మఱచినాఁడు. ఆ మందిడి యతఁడఱిగెను. భూమీసురునకు దీర్థములకును క్షేత్రములకును ఆకరమైన తుహినభూధరమును జూచినచోఁ దక్కిన వానినిఁ జూచినట్లేయన్న యూహావొడమినది. ఆ పర్వతమునందలి శ్యామల కోమల కాననములు హేమాఢ్య దరీరుహులు మనసున నిల్పినవి.

వెంటనే ప్రయాణమైనాఁడు, ఆ యుత్సాహములో నాతఁడు భార్య కెటిగింపలేదు. తల్లిదండ్రులకైనను జెప్పలేదు. ప్రవరుఁడు హిమశైల మును జేరునప్పటికి మధ్యాహ్నము సమీపించుచున్నది. మరుదంకురములు వీచుచుండెను. ఎలుగులుగలఁచిన మధుకోశములనుండి లేచిన మఱికముల నడుము, దంతురితములైన యూతపములతో భూమి, నూగులు బియ్యము గలిపినట్లున్నది. ప్రవరుఁడచ్చటఁ జూలసేపుండలేదు. నిడుదపెన్నెఱిగుంపు జడగట్టగా - సగరుమ్మనుమఁడు దపము సేసిన చోటుజూచెను. జరఠకచ్ఛపకులేశ్వరు వెన్నుగానరా జగతికి మిన్నేరుదిగిన తటిని వీక్షించెను. గిరిక పుచ్చటీకతనమును బోబెట్టి భవునిగొల్వ నాయాసపడిన తలమును దరిసించెను. వలరాచరాచవాఁడు అలి కాటుగను వెచ్చతోఁగఱఁగిపోయిన ప్రాంతములను బరికించెను. వానికిఁ గనికరము గలిగినది. తపసియల్లాంద్రచెలువముతో ముచ్చిచ్చును విరాళిగొన్న యెడలుగాంచెను. కుమారస్వామి జన్మించినచోటు జూచినాఁడు. ప్రవరుఁడు దిలకించిన దింతమాత్రమే. ఆ హిమవత్పర్వతము గొప్ప తనమును పదిమాటలుగా మనస్సులో భావించికొన్నాఁడు. ఇంతలో సరిగా మట్టమధ్యాహ్నమైనది. నలినీబాంధవభానువులు తీక్ష్ణము లయ్యెను. సూర్యకాంతములపై మంచు బేరుకొనియున్నది. అది యెండ వేడిమికి గఱఁగి ఛూత్కారముతోఁ బొగలు రేప దొడఁగెను. వానికినిఁ గడుపు నకనక లాడినది. ఇంటికిఁబోదమనుకొన్నాఁడు. పాపము! పాదలేపము గఱఁగిపోయినది. ఇఁకదిక్కేమి? అయ్యో! అకలంకౌషధ సత్వములు దెలియుటకు క్షేత్రములెన్నిలేవు? ఇంతదూర మేలవచ్చితిని? అరుణాస్పదపుర మెక్కడ? హిమవత్పర్వత మెక్కడ? శ్రోత్రియులు బుద్ధిజాడ్య జనితోన్మాదులుగదా' యని తన్నుదాను నిందించికొన్నాఁడు. అప్పటి వాని భావములివి -

సీ. నను నిమిసంబుగానకయున్ననూరెల్ల
నరయుమజ్ఞనకుఁ డెం తడలునొక్కో?
యెపుడుసంధ్యలయందు నిలువెళ్లనీక న
న్నో మెడు తల్లియెంతోరలు నొక్కో?

అనుకూలవతి నాదుమనసులో వర్తించు
కులకాంత మదినెంతగుందు నొక్కొ!
గెడదోడునీడలై క్రీడించుసచ్ఛాత్రు
లింతకునెంత జంతింతు రొక్కొ?
యతిధిసంతర్పణంబు లేమయ్యెనొక్కొ?
యగ్ను లేమయ్యెనొక్కొ నిత్యంబులైన
కృత్యములఁజాపి దైవంబ కినుకనిట్లు
పాఱువై చితె మిన్నులు బడ్డచోట !!!

పై పద్యము వలన ప్రవరుని కర్మనిష్ఠ యెంతటిదో తెలియుచున్నది. నిత్యములైన కర్మలింకను గొన్ని మిగిలియేయున్నవి. వేలిమి సురార్చన విప్రసపర్య పూర్తిగాలేదు. భుక్తికివేళ యతిక్రమించినది. జననీ జనకు లాకటితో సోలుచుఁదనకై యెదురు సూచుచుందురు. అతఁడేమి సేయఁగలఁడు పాపము. ముందుకుఁ బోయినాఁడు, గాన ఘూర్ణితమైన యొక్క కోన గనిపించినది. మల్లిక లవలంబనంబుగా కాలువ కెదురుగా మణిపట్టభంగసరణి నెక్కిపోయినాఁడు. అది మున్యాశ్రమముగాదు, ముద్దులు మూటగట్టు ముగుదయున్నది. అప్పటికి మధ్యాహ్నము మీరి పోయినది. తక్కిన కథయంతయు మధ్యాహ్నము వైననే జటిగెను. వరూధినియే యిట్లనుచున్నది,

తే. కుందనమువంటి మేను మధ్యందినాత
పోష్మహతి గందె, వడదాకె నొప్పులొలుకు
వదన, మస్మద్గృహంబు పావనముసేసి
బడలికలువాసి చనుము. (మను, 2-47)

ప్రవరునకుఁ గడుపులో నాకలి. సత్క్రియాకాండము నిలిచిపోయినదని వెత; వాని కామె యుక్తి చాతుర్యముగా బట్టలేదు. వరూధినిని జూచినంతనే ప్రవరుని మొట్ట మొదటి ప్రార్థన యిది.

ఉ. ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ! యొంటిజరించె దోటలే
కివ్వనభూమి? భూసురుఁడనే ప్రవరాఖ్యుఁడ త్రోవదప్పితిన్
గ్రొవ్వున ని న్నగాగ్రమునకుం జనుదెంచి పురంబుజేర నిం
కెవ్విధిగాంతు దెల్వగదవే! తెరువెద్ది శుభంబు నీకగున్.

అతఁడు తన కథను ముక్తసరిగా మూఁడు మాటలలో ముగించి నాఁడు వరూధిని వీనిగొడవను దన విలాసములతోఁ బ్రక్కకు నెట్టినది. ఒంటిగాఁ దంగేటిజుంటివలె దొఱకినాఁడు. దాని కనుగవలో మెఱుగులు తాటంకములు, చనుగవ, నడుము, వడకి చుచు, సెలవిచ్చ నవ్వినది; నవ్వి తన యభ్రిప్రాయమును నిచ్చెను. దాని యెయ్యారము వాని మనస్సుపైఁ బని సేయలేదు.

ఉ. ఏనిక నిల్లు సేరుటకు నెద్దియుపాయము మీ మహత్వముల్
మానిని! దివ్యముల్ మదిదలంచిన నెందును మీ కసాధ్యముల్
గానము; గాన తల్లి ప్రజలన్ ననుఁగూర్పు... (మను 2-49)

మని దీనముగఁ బ్రార్థించుటకు మొదలు పెట్టినాఁడు వరూధినికి వీనివర్తనము చిత్రమైనది. అది యింతకు ముందు చానుజూచినది గంధర్వయక్షకిన్నరాదులనే. వారు భోగపురుషులు, పుణ్యలోకములలో వారినివాసము, ఒక గంధర్వు నింతకుముందే వరూధిని తృణీకరించినది. వాని రూపమామెకు నచ్చలేదు. తనకుఁ గావలసిన రూపము ప్రవరునిలోఁ జిక్కినది. కడకు బొమ్మగడ్డకు వచ్చెను. వరూధిని యన్నది.

ఉ. నిక్కముదాపనేల ధరణీ సురనందన! యింకనీపయిన్
జిక్కెమనంబు నాకు, ననుచిత్తజుబారికి నప్పగించెదో
చొక్కెమరంద మద్యముల చూరల పాటలువాడుదేంట్లు సొం
పెక్కిన యట్టిపూవు బొదరిండ్లను గౌగిటఁ గారవించెదో!
(మను. 2-51)

వరూధిని గంధర్వాంగన; వారి ప్రణయోదంతములు కులాంగనల వలె ధ్వనిపూరితములుగావు. స్పష్టముగాఁ జెప్పినది, ప్రవరుఁడుజన్మించినది కర్మభూమి, ఆతఁడు కర్మమార్గముతో ముక్తిని సాధింపఁదలఁచిన వాఁడు. "వనజేక్షణా! యిట్లుఁ బలుక వరుసయే? వ్రతులై దినములు గడపుచున్నాము. విప్రులము. మీ జాతి నీతులేవో? కామమింత విశంకటముగా నుండవచ్చునా!" యని యొక్క మాటతోఁ గొట్టివేసినాఁడు. మరలఁ దనగొడవఁ జెప్పినాఁడు.

ప్రవేలిమియున్ సురార్చనము విప్రసపర్యయు జిక్కెఁ భక్తికిన్
వేళయతిక్రమించె, జనకీ జనకుల్ గడువృద్ధు లాకటన్
సోలుచుఁ జింతతో నెదురు సూచుచునుండుదు, రాహితాగ్నిఁ దూ
దూలు సమస్త ధర్మములు తొయ్యలి నేఁ డిలఁ జేరకుండినన్॥

వారిర్వురి నడుమ వాదమారంభమయ్యెను. ప్రవరుఁడెట్లును లొంగునట్లులేదు. తానువిన్న శాస్త్రము లామె యేకరువు బెట్టినది. అదియనుభవ వాదము. ఆమె వాదమునకుఁ గోటీరమిది.

శా. ఎందేఁడెందము గందళించు రహిచే, నేకాగ్రతన్నిర్వృతిం
జెందున్ గుంభగత ప్రదీపకళికా శ్రీదోప, నెందెందు బో
కిందే నింద్రియముల్ సుఖంబుగను, నాయింపే పరబ్రహ్మ మా
నందోబ్రహ్మయటన్న ప్రాబలుకునంతర్బుద్ధి నూహింపుమా!

ప్రవరుఁడు వరూధిని 'దత్తరము' జూచి తనలోఁదాను సిగ్గుపడినాఁడు. వెగటువుట్టినది. నిస్పృహతో నొక్క చిఱునవ్వు నవ్వినాఁడు. అతఁడు బంగారువంటి యొక్కమాట నెను.

శా. ఈ పాండిత్యము నీకుఁ దక్కమరియెందేగంటిమే? కామశా
స్త్రోపాధ్యాయిని నావచించెదవు? మేలోహో! త్రయీధర్మముల్
పాపంబుల్ రతిపుణ్యమంచు, యికనేలాతర్కముల్ మోక్ష ల
క్ష్మీపథ్యాగమ సూత్రపంక్తి కివవో! మీ సంప్రదాయార్థముల్.

మ. తరుణీ! రేపునుమాపు హవ్యములచేతన్ దృప్తుఁడౌవహ్ని స
త్కరుణా దృష్టినొసంగు సౌఖ్యములెఱుంగన్ శక్యమేనీకు, నా
కరణుల్ దర్భలు నగ్నులున్ బ్రియములై నట్యన్యముల్ గావొడల్
తిరమే చెప్పకుమిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్.

వరూధినికిక వాదములేదు. హృదయము 'ఝల్లు'మన్నది. మోమువెల్లనై నది. తెలిగన్నులతో వానినిఁ బుల్కపుల్కఁగ జూచినది. మాటలలోఁ గద్గదిక. అది అనునయాలాపాతిదీనాస్యయై నన్ను వెతలఁ బెట్టకుమని ప్రవరునిపైఁబడి కౌగిలించి యధరమాసించినది 'శ్రీహరి!' యని యాతఁడోరమోమిడి దానియంసద్వయము బట్టి త్రోసెను. అది యొయ్యారముగా నేడ్చుటకు మొదలుపెట్టెను. తన వాదము మరల

నారంభించినది. ప్రవరునకిఁక వరూధినితో మాటాడుట కిష్టములేదు. దాని మేనిజవ్వాదిపస శరీరమున కంటుకొన్నదేమోనని యాతని భయము; ప్రవరుఁడు శరీరమును గడిగికొని వార్చి గార్హపత్యవహ్ని నిట్లని పొగడ నారంభించెను. గార్హపత్యము తండ్రి తాతలనుండి సంక్రమించిన నిధి.

మ. దివిషద్వర్గము నీ ముఖంబునన దృప్తింగాంచు, నిన్నీశుగా
స్తవముల్ సేయు శ్రుతుల్ సమస్తజగదంతర్యామి విన్నివ, యూ
హవనీయంబును దాక్షిణాగ్నియును నీయందుద్భవించుం
గ్రతూత్సవ సంధాయక ! నన్ను గావగదవే ! స్వాహావధూవల్లభా.

ఉ. దానజపాగ్నిహోత్ర పరతంత్రుఁడనేని భవత్పదాంబుజ
ధ్యానరతుండనేని, పరదారధనాదులఁ గోరనేని, స
న్మానముతోడనన్ను సదనంబునఁజేర్చి మినుండు పశ్చిమాం
భోనిధిలోన గ్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా !

ప్రవరుని హృదయమంతయు నీ రెండు పద్యములలోనున్నది. 'క్రతూత్సవ సంధాయక !' స్వాహావధూవల్లభా ! యను విశేషణములు ఆతనికి సౌందర్యదృష్టి యెంతయున్నదో దెలుపుచున్నవి, కాని యా సౌందర్యప్రీతి లోలుపతగాదు. మానవుడు ధర్మానుబంధియై సౌందర్యము నారాధించి సుఖము ననుభవింపవలెనను మనస్వి యైన గృహమేధి యాతఁడు, ఇనుఁడస్తమించినచో సాయంకాలము చేయవలసిన నిత్యకర్మలు గుంటువడును. అందుచే నతఁడు సూర్యాస్త మానమునకు ముందే యిల్లు చేరికొన్నాఁడు. మనుచరిత్రలోని రెండా శ్వాసములును మధ్యాహ్నమునకు గొంచెము ముందునుండి సూర్యాస్త మయమునకు గొంచెము ముందువఱకును జరిగిన కథ.

భూదేవకుమారుఁ డేగెను. వరూధిని మరల వీణముందు గూర్చున్నది. వాయింపఁబోయెను. వాని రమ్యాకృతి భావమున నిల్చినది. అంగభవుఁడు పిఁజపింజగా నేయుచున్నాఁడు. ఆమెకు వీణె గాబట్టలేదు. పిచ్చిగా నావనములలోఁబడినది. ఇంతలో సూర్యుఁడస్తాద్రిపై

నిల్చెను. అతనివైపు వరూధిని జూచినది. అతఁడెట్లున్నాఁడు? తనపైన సూర్యునకు గొప్ప సానుభూతియున్నట్లు వరూధిని వ్యాఖ్య,

చ. తరుణి నన్యకాంతి, నతిదారుణపుష్ప శిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు బారికి నగ్గము సేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితోనని, రోషభీషణ
స్ఫురణ వహించెనోయన నభోమణిదాల్చె కషాయదీధితిన్.

ఈ పద్యము తరువాత నొక భ్రాంతిమ దలంకారము రాబోవు కథకు సూచన. సూర్యుఁడస్తమించినాఁడు. చంద్రుఁడుదయించెను. వరూధిని తిరిగి తిరిగి కెందలిరు పాన్పునకు మేను సేర్చినది. మేను పొందలేదు. చెలికత్తెలతో నారామమున కేగినది. కనకన వెలుఁగు చంద్రుఁడు, ఆ రాత్రి నాల్గు జాలును "భవమిఁకఁజాలు" నన్నంత కాకకుఁ జిక్కినది. మన్మథ చంద్ర మలయానిలాది దూషణలు సాఁగెను. ఇంతలోఁ జంద్రుడస్తమించినాఁడు. వేగుచుక్క వొడిచెను. తెల్లవారినది. మరల వరూధిని నందనభూమికి వెళ్ళెను. ప్రాతఃకాలములందు. గీరశారికలకుఁ బాఠము నేర్పుట ఆమెకలవాటు ఆ పనిలో నాఁడు మనస్సు నిలువలేదు. ప్రవరుఁ డూరికెట్లుఁబోవును? దగ్గఱదాపు గాదుగదా! ఆ ప్రాంతములందే యెందోజుట్టుచుండును. నేఁడు దన, కదాటు పడ వచ్చును. మఱలనొకసారి ప్రయత్నింత మనకొన్నది. ఇంతలో నచ్చట మాయాప్రవరుఁడు దయారై నాఁడు. నుదుటిపై గంగమట్టి. చెక్కుటద్దములపై జిగివెల్లువ చిందు మణికుండలములు. పసిడిప్రాత చెఱంగు మిసిమిదోపనున్న యరుణాంశుకోత్తరీయము. నీర్కావిపిఁజె, ధవళ ధవళములైన జిన్నిదముల, కాషికాముద్ర యిడిన యుంగరము. శాంత రసమొలుకు బ్రహ్మతేజము. అచ్చముగాఁ బ్రవరుఁడేఁ వాడా యుద్యాన మండిట్లు దిరుగుచున్నాఁడు.

సీ. పసిడితోరముతోడి బాహువల్లన నెత్తి
సారెకు బొదలపైఁ జాచి చాచి
బింబాధరంబు గంపింప నొయ్యన విపం
చీ స్వరంబున జటసెప్పి చెప్పి

దిశలమార్గాన్వేషి దీర్ఘలోచన దీప్తి
గణముచేఁ దోరణకట్టి కట్టి
కమనీయ తనుకాంతి కనకద్రవంబున
నారామరంగము నలికి యలికి

గీ. యానితంబ విలంబి కాలాహికల్ప
ఘనకచాగ్రంధి నచటి భృంగముల కసిత
దీధితులు వడ్డికొసఁగుచు దేవపూజ
విరులు చిదిమెడు కపటభూసురునిఁ గనియె.

వరూధిని హృదయమం దింతకుముందే భూమిక దయారై నది. ఆమె వానితోఁ జేరికొనెను. చెలిక త్తెలు దానికిఁ బోదిగూర్చిరి. ఆ వరూధిని వానితో దన మణిమండి తాలయమునఁ బ్రవేశించినది. కనుక మనుచరిత్రలోని మూఁడాశ్వాసముల కథ జరిగినవేళ యొకటిన్నర దినము కంచెను గొంతతక్కువ, పెద్దనామాత్యులీ సందర్భములో సంగీత సాంప్రదాయికమైన యొక పద్యమును జెప్పినారు. అది ఈ క్రిందిది.

శా. వాలారుంగొనగోళ్ళ నీవలసతన్ వాయించుచో-నాటకున్
మేళంబై నవిపంచి - నిన్ను మొదలున్ నీ వంటమిన్ జేసి, యా
యాలాపంబెయవేళఁ బల్కెడు ప్రభాతాయాత వాతాహతా
లోల త్తంత్రుల మేళవింపగదవే లోలాక్షి! దేశాక్షికిన్॥

ఇందులో రెండురాగములను వారు బేరొక్కనిరి, ఒకటి నాట; ఇది ముప్పది యారవమేళకర్త జన్యము, ఉపాంగము, ఆరోహణము సంపూర్ణము. అవరోహణమున ధైవతగాంధారములు వర్జములు, ఘన రాగము సభారంభమునఁ బాడదఁగినది, 'రిమని' రాగచ్ఛాయా స్వరములు సాయంసమయమున నాలపించుటకు యోగ్యము.

ప్రవరుఁడు వెడలిపోయిన వెనుక వరూధిని పాడఁదొడగినది నాట రాగమే. అటుతరువాత నామె వీణెను ముట్టనే లేదు. ప్రాతఃకాలమునఁగూడ దంత్రులాస్వరములనే బల్కుచున్నవి. దానిని దేశాక్షికి మార్చుమని జెలిక త్తెలనుచున్నారు. దేశాక్షి హరికాంభోజి జన్యము, ఆరోహణమున 'మ-ని' వర్జితము. అవరోహణము సంపూర్ణము, ఈపద్య

ముతో-బెద్దనామాత్యుఁడు రాగముల నా యా సమయము లయందే పాడవలెనను నియమము నంగీకరించినట్లెకది. కొందరీ నియమమును సమ్మతింపని వారుగూడ నున్నారు. భట్టుమూర్తి పెద్దన్నగారు చూపిన యీ మార్గమును బట్టుకొన్నాఁడు. దీనిపై నాతఁడు కథను సూచించుచూ బోయెను.

నాలుగవ యాశ్వాసము మొదట నీ పద్యమున్నది.

చం. భవదనుజాత్మజన్ వసునృపాలుఁడు గైకొను నెల్లినేట, న
య్యవనివరప్రసాదమున నంటదువో! భవదీయజాతికిన్
పవిభయమంచు, మంచుమలపట్టికి, భావిశుభంబు లోకబాం
ధవుఁడెటిఁగింపఁబోయిన విధంబుననేగెఁ బయోధిచెంతకున్॥

పై దానిలో సూర్యాస్తమయము వర్ణితము, అతఁడు లోకబాంధవుఁడు, అందుచే గిరికా వివాహమున, నాతనికి జ్యోక్యమున్నది. భావిశుభము నాతఁడు మంచుమలపట్టి కెటిఁగింపఁబోయినాఁడు. ఇచ్చట 'నెల్లి నేట'నను నొక పదమున్నది. మనము వ్యవహారమందు త్వరగాఁ గాఁబోవుపనికి 'నేఁడో రేపో' యందుము. ఆ వ్యవహారము ననుసరించి వాడిన పదమది కాని యిది సత్యముగూడ. వసుచరిత్ర ప్రాతఃకాల ముతో నారంభమగుచున్నది. అది చైత్రము, అప్పుడప్పుడే నాగరకులు హిందోళమును విడిచి వసంతము నాలాపించుచుండిరి. హిందోళము శిశిర వసంతముల సంధికాలములఁ బాడుదురు. అరవిందాప్తుఁడు దాక్షిణ్యము మాని యుదీచికిఁ గ్రొత్తగాఁ జేరికొన్నాఁడు. చిగురు గైదువువేల్పు తెమ్మెర తేరిపైఁ గదలెను. ఆతఁడక్షీణ ధ్వజోత్క్షేప వైభవుఁడై నడచినాఁడు, వల్లివన జాస్యలు ప్రత్యగ్రసాలాగ్రహర్మ్య విటంకములు బ్రాకిరి. వారు భావిభావుకఫలోల్లాసముతో నుత్పల్ల పల్లవహస్తములనుండి గ్రొవ్వీరులు రాల్చినారు. మధుమత్త గంధవహము సగంధవిటపి ప్రాప్తితో విజృంభించినది. ఉద్యాన పాలురు వసురాజు చెంతకువచ్చి యాతని నారామమున కాహ్వానించిరి. వారు కాన్కలుగూడఁ దెచ్చినారు. వసురాజుద్యానమునకుఁ బోవుటకు కవి యొకయుపాయమును వెదకినాఁడు, గంధవహుని ధార్ష్యములు మితిమీఱినవట! ఆ పద్యమిది.

సీ. ఏ పాఱు పొదరిండ్లఁ నా పాటలాశోక
దీపార్చిఁ గనకకలాప మఱసె
సాలావలులు దాటి యేలాలతా వార
బాలాతతి పరాగ పటములూడ్చె
నానామధుపవన్య గానామృతము మెచ్చి
సూనాసవము లెల్ల చూరలిచ్చె
శంకారహితధీరహుంకార శుకభటా
హంకారముల ఫలాహతి యొనర్చె

ననుచు, నాగంధవహుని ధౌర్యములు దెలుపు
లీల ! విరిసిన విరులు, రాలినరజింబు
లొలికిన రసంబులు రలినఫలము లధిపు
క్రమోలనిడి పల్కి రుద్యానపాలురపుడు

వసురాజుద్యానమునకుఁ బ్రయాణమయ్యెను. చైత్రుఁడాతని వనపాలకుఁడు. ఎప్పుడెప్పుడు స్వామివచ్చునోయని యాతఁడెదురు సూచుచుండెను. ఆతఁడు సహజసౌభాగ్యములు చేకూర్చినాఁడు. 'ఇమ్మలై మరు హజారమ్మలై' పొదలున్నవి. 'పూజవికెలు' పూనవలసిన యవసరమేలేదు. 'తెప్పలై నెత్తావికుప్పలై పుప్పొళ్లురలుచున్నవి. ఇఁక ద్రోవలోఁ గందవొడి జిలుకవలిసిన దెందుకు ! 'సారమై హిమజలా సారమై పూదేనె' నెఱసినది. కేళాకూళి నింపవలిసినది లేదు. మారుతా యత్తమై-మొత్తమై గంబూరమెగయుచున్నది. వితానములు బిగించు శేల ? వసురాజునకు సారథియొక్కఁడు సామ్రాణికాశ్వములతోడి యరదముగొనితెచ్చినాఁడు. అప్పురందరవైభవుండు ఉపవనమున నడుగువెట్టెను. వేత్రధరులొత్తిగిలి 'చాంగుభళా' యనిరి. తేరుదిగినాఁడు; ఆరామము పుంజీభవించిన వసంతమైనది. ఒక్కొక్కనగ మొక్కొక్క చైత్రరథము; ద్విజావళులు కేసరార్ద్రాక్షతములు రాల్చినవి. తీవముత్తైదువులారతు లిచ్చిరి. గోత్రాకాంతుఁడే తెంచెనని నికుంజ నిలయములు మీరి వ్రతతీతతీసతులు తలలూపినవి. ఒక సంపెగ తావుల కొమ్మ రాఘవద్ఘన సుమనోభిరామమయి కాకవహించినది. అతఁడా

యుద్యానమున నటునిటు గొంత తిరిగినాఁడు. ఇంతలో నొకవింత జరిగినది.

ఉ॥ ఉన్నతి నన్నగాగ్రమునన్న యొకానొక కిన్నరద్వయం
బ న్నిఖిలో క్తివేదికపు డన్యదురాసదమైన యొక్క యా
సన్న శుభంబు దిన్నని ప్రసన్ననిజో క్తులఁదెల్పి తోన యే
గె న్నరదేవపాదప విభిన్నబృహన్నగకూట వాటికిన్.

వసురాజు నిఖిలో క్తి నిధి. ఆ కిన్నరద్వయము మాటలాతనికర్థ మైనవి "ప్రసన్నములైన యుక్తులాతనికిఁ గౌతూహలము గల్గించెను. ఆ కిన్నరయుగము లోకాద్భుతము. వసురాజున కతిలోకవయఃకోలా హల కోలాహలలీలా హలహలిక" చెంగలించినది. ఇంతవఱకును గడచినది ప్రాతఃకాలమం దొక యామము మాత్రమే. వసురాజుతోఁ బాటు నర్మసచివుఁడున్నాఁడు. వారిరువురు మాటాడి కొనుచుఁ బర్వత మెక్కిరి. వాఁకిఁ మాధురీధుర్యమైన సంగీతరవము వినవచ్చినది, వల్లకీ రవము సంగతి నెవ్వరో బాడుచున్నారు. ఆగానమున మృదుపంచమము. అది వసంతరాగమే యై యుండవలెను. వసంతము ప్రాతఃకాలమున నాలపింపవలసిన రాగము. నర్మసఖునితో వసురాజు కోలాహల పర్వత మున, నటు నిటు దిరిగెను. ద్వితీయప్రహారమును గడచినది. సారంగ సంగీత భంగీతరంకము లుపాంగమ్ములుగా వేల్పుగాణీలు బాడుచుండిరి. ఇచ్చట భట్టుమూర్తి 'సారంగ' రాగమును సూచించు చున్నాఁడు. ఆతఁడు గిరిక యెడఁట బ్రత్యూషమగునప్పటికి సారంగరాగ భ్రమన్మద భృంగీరవము వినవచ్చినది. (2) ఇది ద్వితీయ ప్రహారమున నాలపింప వలసినది. మధ్యాహ్నమునకుఁ గొంచెము ముందుగా వసురాజుగిరికకుఁ దన్ను గాన్పించి కొనెను. ఆ వర్ణన మిట్లున్నది.

సీ. తలరు ప్రాయమువాని వలరాజు నలరాజు
నలరాజు దెగడు సోయగము వాని
బసిడిచాయలవాని బగడంబు జగడంబు
జగడంబు గలమోవి సొగసువాని

తళుకుఁ చెక్కుల వాని దులకింపు బలుకెంపు
పలుకెంపు లొలుకు నవ్వొలుకు వాని
చికిలిచూపుల వాని సిరిమించు దొరయించు
దొరయించు కాంచనాంబరమువాని

తే. నొఱపుగలవాని, మకుటకేయూర హార
కటకకుండల చాకచక్యములవాని
నమ్మహీజాని గని లేచి, యమిత వినయ
సంభ్రమము దోప నిలిచి రబ్జాత ముఖులు.

కోలాహలుని వర్ణించిన పద్యమునకును దీనికిని రచనావిధానమున భేదమేమియును లేకుండుటఁ బాఠకులు గమనింపఁ దగినది. 'అనుపమ కాంతివైభవ సమన్వితుఁడై 'న యా వసురాజును గిరికజూచెను. ఆ పద్మిని సరసాంతరంగమున వినూతన రాగకందళము మించినది. అఖండవాసన లుప్పతిల్లెను. ఉత్కలికలు విలసిల్లినవి. ప్రమోద తరళస్థితులై తమిజూపు తుమ్మెదలు నిగిడినవి. ఇంతలో జెలులు తల్లిబిలుచుచున్నదని గిరికకుఁ జెప్పిరి. ఆమె వెడలిపోయెను. పోవుచు నా"మానిని" తన రూపమును వసురాజు చిత్తమున నిల్పిపోయినది. అప్పటినుండి యాతని "ననంగశర శరవ్యాంతరంగ కలిత భావతరంగములు" గప్పికొన్నవి. వయస్యుడాతని నోదార్చుచుండెను. ఆమెపై తలఁపుతోనే వసురాజ గకూటాగ్రము డిగ్గినాఁడు. సమగ్రాధోరణానీత గంధగజోత్తంసమునెక్కెను. నర్వ మాతనికి గిరికామయమైనది. కొండక్రింద గాంధార, సింధు, కుకుర, కాశముఖ్యులు గాచియుండిరి వారినాతఁడంపివేసెను. వసురాజిల్లు చేరుచేళకు జలకమువేళ యైనది. అతివలారతులు ద్రిప్పిరి. వానివలెనే యాతని మనస్సు భ్రమించుచుండెను. జలకమువేళయని భామలు విన్న వించినారు. పళ్ళెరము వెట్టితిమని తొయ్యలులుమనవిసేసిరి. అతఁ డనాస్థతో యథోచితవిధు లాచరించెను. ఆవరించి పూసెజ్జకు మేను సేర్చెను.

గిరికాహ్లాదయమును గూడ మన్మథుఁడు గలఁచివేసినాఁడు. ఆతఁడొజ్జయై 'పటుశాస్త్ర శ్రేణికా భ్యాసమును' జేయించెను. 'తమ్ము

లని' గిరిక తటినీగరై ళకసంజాత -కంజాత వ్రాతము మాటు సేరినది. అవి మున్మున్న యేచసాగెను. తల్లి కడవారును తండ్రిభజించు వారునునై న సద్ద్విజశిఖామణు లున్నారు. వారినాగిరిక పలుకరించుట యే లేదు. ఎరవుగంజూడసాగీనది. కారణము! ఆమె వసులుబ్ధ చిత్త యైనది. ఆ బిత్తరి మణిగృహమునుండి యొంటిగా బయలుదేరెను. బోటిక తెలు ద తరమందిరి. కేళివన కుంజము లారసినాము. ఒకానొక చోట 'చిత్తజ భల్లభగ్న'యైన యామెయుండెను. తొయ్యలులామె నోదార్చిరి. విసినవీధులలో వారి విహారములు సాగినవి, జలవిహారములును నడచెను, గిరికాదేవి మన్మధపూజ నొనర్చినది. ఈ హంగులన్నియుం దీరువేళకు సాయంకాలమైనది. కనుక వసుచరిత్రలో మూడాశ్వాసముల కథయొక్క పగలు నడచినదని చెప్పవచ్చును.

చంద్రోదయము వేళకు మంజువాణి వసురాజుచెంతకు దూతగాఁ (4-24) బ్రయాణమయ్యెను. ఆమె సంకల్పమిది.

సీ. రిక్కరాయని కళల్ జెక్కు గీటకమున్న
వెడతూపు దృగ్వీధి బడకమున్న
యెల తుమ్మెదలదిమ్మ తలగ్రమ్మకయమున్న
చిగురు చేపట్లకు దిగకమున్న
కలికి కోయిల గళగ్రహము సేయకమున్న
రాచిల్క మాటకు రాకమున్న
నిసువు తెమ్మెర దంట యసువులంటక మున్న
రాయంచ కాళ్ల దౌలకయమున్న (4-25)

తిరిగి రావలెనని మంజువాణి యాళ. ఆమెవోయిన తరువాతనే చంద్రదూపణ మన్మథ దూపణాదులు సాగినవి. కాంభోజీ రాగమున విలాపమును నడచెను. దినమును దేవేంద్రసభకుఁ బోవ్రట వసురాజున కలవాటు. అనాడాతఁడు సభకురాలేదు. దేవేంద్రునకుఁ గారణము దెలిసికొంద మనిపించినది. ఆ నిరవద్యమిత్రుని (5-58) నేచింత బీడించు చున్నదో యని యాతని యాలోచన; ఇంద్రుఁడు యోచించి చూచెను. వసురాజుకలత యాతవి కర్థమైనది. వారు దేవతలుగదా! పేరామని

చలికి - కలువల చెలికి - వసురాజెంతదలఁకెనోయని (5-59) యింద్రుఁడు కటకటఁబడినాఁడు, తెల్లవారినంతనే యాతఁడు శీతనగ పుత్రుని (5-61) చెంతకు వచ్చెను. ఆఁతడీ కన్నెను వసురాజునకు యాచించినాఁడు. సిరిరా మోకాలొడ్డు వాఁడెవడుండును? కోలాహలుఁడు సమ్మతించెను. గట్టురా పెద్దలు పుణ్యవాహినులు పెండ్లి కాహ్వానింపఁబడిరి. వినాహ మహోత్సవమున కప్పటి కప్పుడు దేవేంద్రుఁడొక పట్టణమును సృజించి నాఁడు. వివాహ మానాఁడే జరుగవలెనని యాతని. పట్టుదల ఏర్పాటు లస్నియు వడివడిగా సాఁగెను. వసురాజునకు వార్త దేవేంద్రుఁడే దెల్పెను. ఈ రేయికే యొక శుభలగ్న మేర్పాటుజేయుమని బృహస్పతికి (5-51) విన్నవించికొన్నాడు. వధూవరుల యలంకారములతో మధ్యాహ్నము జెల్లినది. అప్పటికే -

శా. పౌలోమీప్రభృతుల్ గుమారినిటు సంభావింపగా మున్ను ది
క్పాలుర్ భూపులలంకరించి, శుభలగ్నంబుం బ్రతీక్షింపగా,
నాలోదాను దదర్హవన్మణి విశేషాన్వేషసన్నద్ధుఁడో, నా
నాలోకాపుఁడుచేరె రాగమహిమన్ రత్నాకర ప్రాంతమున్.

ఇంతలో రేగన్నియ జేసిమేను తొలిగట్టుతుద (6-6) బొదలినది. ఆంగిరసుఁడు లగ్నమాసన్నమైనదని యెచ్చరించెను. దైవతవిభుఁ డాదరోక్తిఁ బిలిచినాఁడు. వసురాజు సితకరినెక్కి శీతనగోజ్జ్వల శంకరా కృతితో గోలాహలపురముచేరఁ జనెను. పురియందున్న స్త్రీలు ఆతనిఁ జూచుటకు మేడలపై నిలిచిరి. వసురాజు వేదికచెంతకు వచ్చెను ఇక్కడ నొక చిన్న చిక్కున్నది. గిరికావసురాజుల వివాహము బరిగినది మిథున లగ్నమందు; వివాహదినము చైత్రశుద్ధ చతుర్దశి; మాంగల్యధారణము సూర్యాస్తమయమైన తరువాత. చైత్రమాసమున మిథునలగ్నము రాత్రిపూటవచ్చుటకు వీలులేదు. మరి జ్యోతిషమునందుఁ బండితుడైన భట్టుమూర్తి యీ పొరపాటెట్లు చేసినాఁడు? ఈ సమస్య నన్ను చాల దినములు పీడించినది. పండితుల నడిగితిని. వారొక చిన్నసవరణ చెప్పినారు. అది యుండవచ్చుననిపించినది. వారి సమాధానమిది. "ఒక్క సంవత్సరమునకు - మేషరాశియొక్క యాదిబిందు వేబదిమూడు విలిప్తల

ప్రకారము తిరోగమించును. అనఁగా ప్రతియఱువదియేండ్లకును ఒక్క యంశతిరోగమనము; మున్నూటయఱువది యంశలు తిరోగమించుటకు-21600 సంవత్సరములు పట్టును. గాని 10800 సంవత్సరములకు గాని దాని బేసిసంఖ్యలబ్ధమునకుగాని లగ్నసప్తమ పరివర్తన మేర్పడును. అందుచేఁ బగటిరాసులు రాత్రియందును రాత్రిరాసులు పగటియందును వచ్చుటకు వీలున్నది. సూర్యచంద్రుల సంబంధముచేతనే తిథులేర్పడుచున్నవి. కనుక తిథిలోభేదము వచ్చుటకు వీలులేదు, నేఁడు చైత్రశుద్ధ చతుర్థికి చంద్రుడు హస్తలోను రవి మీనమునందుండునని యంగీకరించుచున్నాము. కాని అయనాంశను బట్టి వసురాజు నాటికి-చైత్రమునఁదు రాత్రి రాసులైన కన్యాదికుంభాంతము - ఉదయరాసులుగానుండి యుండవచ్చును

ఈ విషయమున నాకన్నను, సత్యమును దేల్చికొనుటకు మీరే యధికారులు. నాకును గణితమునకును షష్టాష్టకము. పై పండితులు చెప్పిన సమాధానమును మీకు మనివిచేసినా నంతే.

రాత్రియంతయు గల్యాణపు వేడుకలతో గడచినది. చంద్రాస్తమయమిట్లు వర్ణింపఁ బడినది.

ఉ. రాజపురందరుండు నగరాజతనూజయు నిట్లు శక్రసం
యోజిత మంగళం బెనసియున్కి గనుంగొని మున్ను వారిను
ద్వేజక తీవ్ర తేజమున వేచిన సాహసిగాన వేగ, నం
భోజ విరోధిసేఁ బరభూధర కందరకోటరాంతమున్.

దానివెనుకనే భట్టుమూర్తి సూర్యోదయమునుగూడఁ జెప్పెను-ఈ నిర్ణయమునకు బాధకముగ నొక పద్యమున్నది, అది యీక్రిందిది.

ఆ. నాతి! విను నగేంద్ర నందన గురుజనా
ధీనగాన మనసు గానకుంట
నెనఁగు సందియమున నిన్నాళ్లు నీఖేద
జలధిఁగడవఁ దెప్పగలిగె నేఁడు.

పై పద్యమున "నిన్నాళ్లు" అను పదము మన నోటిలో కరక్కాయకాని రాజు విరహావస్థ యొక దినమైనను ఆతనిపాలికి

'నాళ్ళు'గాఁ గన్పడిన దేమోనని మనము సరిపెట్టుకొనవచ్చును. ఈ భావముగూడ కవికున్న దనిపించును. దీనికి ముందటి పద్యములో 'దాహమును మోహమును'ను గూడఁ బ్రస్తావించినాఁడు. కనుక గిరికా వసురాజుల ప్రణయోదంతము చైత్రశుద్ధ త్రయోదశితో నారంభమైదది. చతుర్దశినాడు వివాహము జరిగినది. కథా శరీరమంతయు రెండుదినములు. ఇట్లు మను చరిత్రను భట్టుమూర్తి కథాకల్పనమందుగూడ ననుసరింప యత్నించినవాఁడు.

రచనా విధానములో భట్టుమూర్తి మనుచరిత్ర ననుసరించుట ప్రసిద్ధమే, నాకుఁదోచిన విషయములు మరికొన్ని మనవిసేతును. ఒక కవికే గ్రంథమపై జిజ్ఞాసగాని జిగీషగాని యుండునో దానినివాఁడు పలుమాఱు జతువుచుండును. అట్లు జదువుటలోఁ గొన్ని యెత్తుగడ లట్లట్లే వచ్చుచుండుటయుగలదు. కాళిదాసులో వాల్మీకి యెత్తుగడలు కొన్నియట్లే వచ్చినవి. ఆ మహానుభావుఁడు (1) 'రఘువంశము (2) కుమార సంభవము' యిత్యాదులను గూడ వదలలేదు. నన్నయలో పంపని పద్యపాదములు గొన్ననచ్చును. వసుచరిత్రలో నట్టివానినిఁ గొన్నిటిని జూపింతును. పెద్దన్నగారు—

మ. నలినీబాంధవ భానుతప్తరవి కాంతస్యంది నీహారకం
దళచూతాగ్ర పగంపరల్ బయిపయిన్ మధ్యాహ్నముందెల్పెడిన్..

అన్నారు. వసుచరిత్రకారుఁడును— (2-12)

మ. నలినీ భాంధవతేజ ! యీ శుభవిమానం బెక్కివేడ్కన్ విని
ర్మల సన్మార్గవిహారహారివగుచున్ ... (3-17)

అనియారంభించినాఁడు, మనుచరిత్రలో—

ఉ. అమ్మకచెల్ల వానివికచాంబకముల్ శతపత్రజైత్రముల్ (3-6)

అనిగలదు. పై పద్యమున 'నమ్మకచెల్ల' యనున దాశ్చర్య సూచకము, ఈ శబ్దమును భూషణకవి శ్లిష్టముగా వాడినాఁడు.

---

(1) రఘువంశస్య చరిత్రం, చకార భగవాన్ బుషిః (బాలకాండ)

(2) కుమార సంభవశ్చైవ, (బాల)

ఉ. అమ్మకచెల్ల! ధైర్యవిభవాతిశయమ్మునఁ దండ్రిపెంపులే
శమ్మును గానసైతి, జడజన్మమునన్ జనయిత్రిబోలి, పై
గ్రమ్మ్మనిదాఘ తాపహతి గ్రాగుచుఁ జిక్కితిలోతుదక్కిని
క్కమ్మ్మగఁ దండ్రిచాయఁ గలకన్యలుధన్యలుగా వసుంధరన్॥
(3-113)

—'అమ్మకచెల్ల' యనగా, 'అమ్మనుబోలి' యని యర్థము, ఆశ్చర్యముండనే యున్నది. స్వారోచిషమనువులోనిదీ బంధము!

మ. పవమానప్లవమాన పంకజరజఃపాళీపిశంగచ్ఛవీ
భవదభ్యర్ణవికీర్ణకృత్రిమ సరిత్పాథస్తరంగాహతైం
దవ పాషాణ వితర్దికాతలమున, న్నాళీక పత్రాతులు
త్సవ మొప్పన్ విహరించుచున్ సరసవాచాప్రౌఢిమల్ మీరగన్
—వసుచరిత్రలో (3-74)

సీ. పవమాన మానవ ప్లవమానకైరవ
చ్యవమాన రజముమైనంటఁదివురు (3-118)

పై సీసపాదమును వ్రాయునప్పుడు పెద్దనగారి 'పవమాన ప్లవమానము' మూర్తి మనస్సులో మెదలియుండునని నా యను మానము. అట్లే—

మ. సకలాశాంత నిశాంతరాజ మకుటీసంక్రాంత మాణిక్య కో
రక నీరాజనమున్ మహోకటక ధౌరంధర్యముంగాంచి, ప్రా
యక పద్మోన్నతిఁ బూనుచున్ నిజపదాభ్యాయోగ్యతన్ మించ రా
జకులగ్రామణియుంచె నవ్వసుపదున్ సైన్యాధిపత్యమ్మునన్
(6-39)

అనుమత్తేభము -

మ. సకలాశాగతి నర్మకోపవిరతి శ్రీతక్రియారంభణా
త్మక వర్ణత్రయికిన్ మదుచ్చరిత శబ్దజ్ఞానమేమూల మిం
తకుఁ బోలన్వినుఁడంచుఁ దెల్పుగతిజెంతన్ గొండపై, పల్లెలన్
గృకవాకుల్ మొఱసెన్ గృహోపరిత్రిభంగిన్ భుగ్నకంఠధ్వనిన్.
(3 55)

అనెడు పెద్దనామాత్యుల యెత్తుగడకుఁ బ్రతిరూపము, నేనిట్లనుట మీకుఁగొంత యత్యుక్తిగాఁ దోపవచ్చును. కాని పెద్దనగారి యీ పద్యముపై భట్టుమూర్తి దృష్టియున్నదనుటకు మీకు మరియొక హేతువును మనవి నేయుచున్నాను.

మ. ఒకనాఁడింద్రునియంతవేలుపు మదీయోక్తిన్ విడంబించి తా
నొకకాలంబెటిఁగింపవచ్చి మనిశాపోద్వృత్తిపాలయ్యె, మా
మకశబ్దంబిదియల్పమే త్రిమునిసంభావ్యత్రికాలీవి బో
ధకమన్రీతిఁద్రి భంగిగామొఱసెఁజెంతన్ తామ్రచూడౌఘముల్
(4-126)

రెండు పద్యములును 'కోడికూత'ను వర్ణించునవే, భట్టు బంధములో నమాత్యులు తొంగిచూచుచున్నారు. మరియొకటి -

మ. అని చింతించుచు మీనకేతన ధనుర్జ్యాముక్త నారాచదు
ర్దిన సమ్మూర్ఛితమాన సాంబురుహాయై (2-38)
వసుచరిత్రలో

మ. అని చింతించుచునొక్క ధామమునకున్ యక్షాంగనల్, బుష్కర
ధ్వనితోఁ జారణకన్యకల్, చటులవాగ్వైచిత్రితోఁ బన్నగాం
గనలుద్యన్మణి దీపమాలికలతో గంధర్వకాంతల్ సుకం
ఠ నినాదాతిశయంబుతోఁ బ్రహరి జుట్టం గంటిఁ జిత్రంబుగన్
(4-68)

ఇట్టివే మరికొన్ని వెదుకఁబోయినచో దండిగా దొఱకును. పెద్దన్నగారు కొన్ని నాముడులు వాడినాము. వాని నమాత్యులకంపెను సార్థకముగా వాడి మెప్పునందవలెనని మూర్తికవి యాశ. మనుచరిత్ర ప్రథమాశ్వాసములో

"అచటఁబుట్టిన చివురు గొమ్మైనచేవ," అనియున్నది (1-50)
దీని నిక్కడ నౌపచారికముగా నన్వయించి కొనవలెను.

భట్టుమూర్తి దానిని వనవిషయమందే వాడుచున్నాఁడు ఆ పద్య మీ క్రిందిది-

క. స్వామీ ! యేమని పొగడెద
మామనికిన్ మనికిపైన యారామమునన్
కామ నిశితాస్త్రములు
తోమల తరలతలు చిగురుఁగొమ్మల చేవల్. (1-134)

మనుచరిత్రములో రెండవ యాశ్వాసమునఁ బ్రవరుని మాటలలో
.....దై వంబ ! కినుకనిట్లు
పాఱవై చితె మిన్నులు బడ్డచోట (2-17)
అని యున్నది, ఈ 'నానుడి'ని భట్టుమూర్తి-

ఉ. ఏమని చెప్పవచ్చు ధరణీశ్వర ! యాబలుసేగి తన్మహా
భూమిధరోపరోధమునఁ బొంగుచ భంగసరిద్ధురంబుపై
పై మహి యెల్లనల్లుకొన బల్విడి నందనుబింబితాభ్రరే
ఖామహిమంబు గాననగు గ్రక్కున మిన్నులు వడ్డకై వడిన్.
(2-147)

అని యలంకార సహాయముతో సార్థకముగా వాడినాఁడనిపించి కొనఁజూచెను, వరూధిని

ఉ. నోములు నోచినమ్మలు మనోరథముల్ దయివార నిత్తటిన్
తామరతంపరై ప్రియులు దారువిహారము సల్ప వీరిలో
నీమెయి దుఃఖశీలనగు నేవసియింపఁ దరంబె (3-29)

అని యను చున్నది, తామర తంపరయనఁగా దండిగానని యర్థము, ఇది తాత్పర్యార్థము, తామరలు తంపరగా నల్లుకొనును. ఈ శబ్దమును భట్టుమూర్తి అది పుట్టినచోటనే వాడుచున్నాఁడు.

సీ. తనయిల్లు తామర తంపరై మెఱయ సం
పన్నలి నాఱిగాపున్నచోటు (3-155)

మనుచరిత్రలోఁ జెలిక త్తెలు వరూధినికి బుద్ధిగఱపిరి, ఆపద్యమిది

ఉ. పూతవసిండి వంటి తలపుం బచరించు కులంబు నీతికిన్
లేతగదమ్మ యత్తెఱఁగు, లేమ! సురాంగనలెల్ల నిట్టి నీ
చేతకు మెత్తురమ్మ, దయసేయకఁ దిన్నని మేనువెన్నెలన్
వేతురటమ్మ! యింత కనువేదురు సెల్లునటమ్మ యింతికిన్ (3-33)

భట్టుమూర్తియు

మ. చెఱగుల్ పూతపసిండి వ్రాతమిసిమిన్ చిత్రాతి చిత్రంబులై
మెఱయన్ రత్నపుగుచ్చులంబులఁ బడిన్ మించుల్ దువాళించు గ్రొ
మ్మెఱుగున్ జంద్రిక కావిపట్టు సురభూమీజార్పితంబిచ్చె నా
తఱచుంగన్నుల వేల్పుపట్టి వసుగోత్రామండల స్వామికిన్.
(5-94)

అను పద్యమున నా పదమునే వలచినాఁడు. పెద్దన్నగారు వాడివ యలంకారములు మొనలైనవానిని దిద్దుట కాతఁడు యత్నించిన పట్టులు గూడనువ్వవి. వరూధిని ప్రవరునితో

శా. ఎందేడెందము గందళించు రహిచే నేకాగ్రతన్నిర్వృతిం
జెందుంగుంభ గతప్రదీప కళికాశ్రీదోప నెందెందుబో
కిందే నింద్రియముల్ సుఖంబుగను నాయింపే పరబ్రహ్మము
(2-62)

అన్నది. కుంభగత ప్రదీపమువలె నిశ్చలముగా నుండుట యని యర్థము. భట్టుమూర్తి యింతమాత్రముతోఁ దృప్తిపడలేదు. తన పద్యములో కుంభములను దీపములను గూడఁ బట్టుకొని వచ్చినా'డు.

గీ. కుంభగతదీప శోభాని గుంభ లీలఁ
గుంభకుచమేనఁ జూడ్కులాగుచ్చుకొనఁగ
గాంచువిభుఁడంగ నా ప్రసంగంబుకతన
మంత్రివరు నెట్టకేలకు మఱలిచూచి. (2-76)

"ఆనందోబ్రహ్మ" యన్న యుపనిషద్వాక్యమును అమాత్యు లింద్రియ సుఖమున కన్వయించిరి. సందు దొఱకినదే చాలునని భట్టు మూర్తి వారిని దిద్దుటకు యత్నించెను.

క. వినులవిందై యమృతపు
సోనల పొందై యమంద సుమచలదళినీ
గానముక్రందై యాకవ
మానంద బ్రహ్మమైన నధిపతి పల్కెన్. (2-14)

కాని పెద్దన్నగారు గానము బ్రహ్మాత్మకమని గ్రహింపలేనంత యరసికులుగారు. వారిని సవరింప యత్నించిన భట్టుమూర్తియు వారి మార్గముననే యొక్కయడుగు ముందునకుఁబోయి చెప్పినపద్యమీక్రిందిది.

శా. భూనాథాగ్రణికిన్ వధూమణికి సంభోగాంతసౌఖ్యంబు బ్ర
హ్మానందానుభవంబు దెల్పె ననవద్యంబై యవేద్యాంతరం
బై నిర్లేపకలాపమైక్రమ విముక్తానేక బంధానుసం
ధానంబై యపునర్భవప్రభవ ఖేదంబై విజృంభించుచున్. (6-95)

మచ్చన కొకటి రెండు మనవి సేసితిని, తక్కిన వూహించి కొన వలెను, పెద్దనామాత్యులు తొలుతనే గణాధీపతినిగూర్చి-

ఉ. అంకము జేరిశై లతన యాస్థన దుగ్ధము లానువేళ, బా
ల్యాంకవిచేష్టఁదొండమున నవ్వలి చన్గబళింపఁబోయి యా
వంకకుచంబుగాన కపివల్లభ హారముగాంచివేమృణా
ళాంకురశంకనంజెడు గజాస్యునిఁ గొల్తునభీష్ట సిద్ధికిన్॥

దీనినిఁ జూచిమూర్తి చప్పరించినాఁడు. గజాస్యున కీభ్రమ, ఇఁక నాతఁడ భీష్టమేమియిచ్చును?

శా. దంతా ఘట్టిత రాజశాచల చలద్గౌరీస్వయంగ్రాహమున్
గంతుద్వేషికిఁగూర్చిశై లజకుఁ దద్గంగారుధారాచాంతిన
త్యంతా మోదము మున్నుగానిడికుమారా గ్రేసరుండై పితృ
స్వాంతంబుల్ వెలయింపఁ జాలు నిభరాడ్వక్త్రుం బ్రభంసించెన్॥ (1-7)

అని ప్రౌఢముగా వర్ణించినాఁడు. కేవలశై లిలోను 'పితామహుల'తోఁ బందెమువేసికొన్న చోటులును లేక పోలేదు. మనుచరిత్రలో.

కం. దిగధీశా సహ్యాధగ । ద్దగితేద్ధరుచిప్రతాప తపన స్ఫురణ
స్థగితద్యుమణికి, నిమిషా । ర్ధగృహీత కళింగరాజతన యాగ్రణికిన్॥ (1-46)

అని భీకరముగాఁ జెప్పిరి. అట్లెకానిమ్మని భట్టుమూ ర్తి

కం. ఉద్ధతరిపు విద్ధతపన
పద్ధతి కరిభవన దవనపటదంబుధి సం
పద్ధరణ సముద్ధరణ స
మిద్ధ రణరజో ప్రజోద్య దిభమదస్మృతికిన్॥ (1-88)

అని తానును నాట్యమును వెలయించినాఁడు ఇఁక నాతని కంచెను బాగుగా వర్ణింపవలెనని భట్టుమూ ర్తి చేసినప్రయత్నము లెన్నియో వర్ష్ణులవారు వివరించినారు వానినిఁబెంచి చెప్పినచోఁ బునరుక్తి మాత్రమే యగును. పెద్దనవాడిన పదములపైఁగూడ భట్టు మూ ర్తి చూపును గేంద్రీకరింపకపోలేదు. 'పిశంగమ 3-61) (3-138) విడంబించు (1-49) (5-60) హరివాణము (5_77) (5-70) ఇత్యాది శబ్దములను చూచిచూచి వాడుకొన్నాఁడు. పాపము! తనకేమో క్రొత్తని దొరుకనట్లు. అట్లే ఆ గుబ్బతిలు, నవలా, తలయేఱు, ముచ్చిచ్చు, వేల్పుగిడ్డి, మొదలగువానినిగూడ వదలలేదు. ఇనుఁడు రాత్రి, మిత్రము ఇత్యాదులను శ్లేషగావాడి పెద్దనగారిని వెక్కిరించెను. ఇఁక నాతని బ్రహ్మాస్త్రమొక్కటియుండనేయున్నది. పదసార్థక్యము, మనుచరిత్రలో గంధవాహనింద యిట్లున్నది.

ఉ. అక్కట! గంధవాహ! తగవా! హరిణాంకునిగూడి పాంథులన్
బొక్కఁగఁజేయ పావకుని పొందొనరించి జగమ్ములేర్చు నీ
యిక్కొఱగామిమానవది యట్టిద, చుక్కనివృత్తి దుర్జనుం
డొక్కనిఁజొచ్చి క్రిందుపడునొండ్లకు గీడొనరింపఁ గల్గినన్ (3-50)

హరిణాంకుఁడనఁగా జంద్రుఁడని తెలిసినదే. 'భట్టుమూ ర్తి హరిణాంకుఁడు వీఁడుగో :-

ఉ. శంబరవైరి వీవు పటుశంబర పోషణశాలియాతఁడ
జ్జాంబకధారివీవు, మధీతాబ్జుఁడతండు, నిశాటయూటద
ర్పం బడగించు బల్లిదుని పట్టివినీవు, నిశాటుడాతఁడో
యంబుచరాంక! నీకుఁదగునా హరిణాంకనితోడికూటముల్.
(4-89)

గిరిక యొనర్చిన మన్మథోపాలంభములోని దీ పద్యము. "ఓయి మదనా! నీవు శంబరువిఁ జంపినవాడవు. వాఁడు శంబరపోషణశాలి. నీవబ్జాంబకధారివి, వాఁడు మధితాబ్జుఁడు. నిశాటులదర్పమడచు విష్ణుని కుమారుఁడవునీవు, వాడా నిశాటుఁడు. నీయంకమంబుచరము, వానియంకమా భూచరము, నీకు వాఁడెక్కడిసై దోడు" అని యనుచున్నది. ఈ శబ్దము సొగసుగావాడిన మరియొకచోటున్నది.

మ. హరిదంభోరుహ లోచనల్ గగనరంగా భోగరంగత్తమో
భరనేపథ్యము నొయ్యనొయ్య సడలింపన్ రాత్రి శైలూషికిన్.
వరుసన్ మౌక్తికపట్టమున్, నిటలమున్ వక్త్రంబునుందోచెనా
హరిణాంకాకృతి వొల్చెరేకయి, సగంబై బింబమై తూర్పునన్
(4-17)

రాత్రియను శైలూషి యాడుచున్నది. ఆమె నాట్యము గగన రంగమందు; నాటకములలో వేషము వచ్చినప్పుడు తెలుబట్టుట వాడుక, హరిదంభోరుహ లోచనలు తమోభర నేపథ్యము నొయ్య నొయ్య సడలించినారు. ఆ శైలూషికి మౌక్తికపట్టము నిటలము వక్త్రమును క్రమముగాఁ దోచినవి. వక్త్రమును చంద్రునితోఁ బోల్చినాఁడు. అది రేకై సగమై బింబమై గనుపట్టినది, క్రమాలంకారము. హరిణాంకాకృతి శబ్దమిచ్చట వక్త్రముపై నున్న బొట్టును సూచించుచున్నది. ఇట్టి విద్య లాతఁడెన్నియైనను నేయును, కాని పాపము! ఇన్ని హంగులున్నను మనుచరిత్రవలెనిది పాఠకుల హృదయములను లోఁగొనుట లేదు. కారణము దురదృష్టమేనా? కావచ్చును. మరియొక్కటి గూడ నున్నది. పెద్దన్నగారిది హితమితమైన వాక్కు. వచ్చిన దంతయుఁ జూపింపనలెనను చాపల్యము వాఁకి చాల తక్కువ, భూషణ కవికా చాపల్య మెక్కువ. అతఁడు రాగద్వేషములతోఁ గావ్యమారంభించెను. అట్లు జేయకుండినచో బాగుండెడిది. కాని చేసెను. దీనికి మనమేమి చేయఁగలము?

వసు చరిత్ర - ఇతర విశేషాలు

ఉపరిచరవసువుకథ భారతములోని దంటిని; ఎంత సహృదయ ముగఁ బరిశీలించిసను ఆ వస్తువుకావ్య రచనకుఁ బనికి వచ్చునదిగా దోపదు. గిరికాదేవి తండ్రి కోలాహలుడనునొక పర్వతము. తల్లి శుక్తిమతి యనుపేరు గలయొక నది. శుక్తిమతీ కోలాహలులకు జరిగిన కూటువ గూడ రసాభాసమే; వసురా జా పర్వతము నెగమీఁటెను. "వసుక్షోణి ధవత్రస్తమై యాకొండ యయ్యేటికే గ్రుక్కళ్ళ ద్రిమ్గుచుండెఁట! వారిర్వ్యారకు గిరికాదేవి గర్భినది. గిరికా వసురాజుల వివాహముకో నింద్రుఁడు గల్పించి కొన్నాడు. ఇది యొకరీతిగా భట్టుమూర్తి చేసిన కల్పన; వేరొక కవియైనచో నీకథావస్తువు జోలికిఁబోయి యుండెడివాఁడు గాదు. మరి భట్టుమూర్తి దీనినేల గ్రహించెను? 'శ్లేష'పై నాతనికున్న యభిమానము గావచ్చును. రెండర్థములతో కావ్యమునంతయు సనితర సాధారణముగా నడిపించుశక్తి యాతని కున్నది; మూర్తి యింద్రజాలమునకు యీ వస్తువు సరిగా సరిపోయినది. రామరాజ భూషణుఁడీగాథ నెన్ని కొనుటలో నిది యొక కారణము గావచ్చును. కాని యిది యొక్కటే కారణమని నేనుదలపను. ఇంత కన్నను ప్రబలమైన మరియొక్క హేతువుండియుండునని నాయూహ. అదియేది? భూషణకవి 'శ్లేష' తేలిపోయిన ఘట్టమొక్కటున్నది. అది యీ క్రిందిది.

కోలాహలుడు శుక్తిమతి నడ్డినాడు. ఆమె వసురాజును గూర్చి గట్టిగా విలపించెను.

ఉ. ఓ వసుధామహేంద్ర! కరుణోదధి! యీతడవేల? బోవఁగా
వే వసుభూప! యంచు, నెలుగెత్తి, వెసన్ మొఱవెట్టుచాడ్పునన్
శైవలినీరవం బెసగె, శైవలినీ నినదంబుకన్న ము
న్నావిల భూరివారి విహ గారవ గౌరవ మెచ్చెనెల్లడన్॥

(2—141)

ఇంతలో నొక యవాంతరము జరిగినది. శుక్తిమతి జల ముబికి పారినది. భూజనులు సలిలోపప్లుతు లైరి. నిజనివాసస్థేమ సంశూన్యు లైనారు. వారు ఘూర్ణిల్లుటకు మొదలుపెట్టిరి. ఆ యూరావము దిక్చక్రముల గ్రమ్మినది. ఆ అంతు వసురాజు చెవులలోబడెను. ఈ యూరవమేమి? మహోదక ప్రళయసంత్రాసము' లోకములఁబై కొని కారించెనా? ఈధ్వని "శైలమథనా విర్భూతసింధూద్ధత ధ్వని' యగునా? ఈ 'కోలాహలోద్వృత్తి' యెందుకని యాతఁడాలోచించెను. ఇంతలో "నానాజనపద కటకస్థానాశ్రయులు" వసురాజును సమీపించినారు. వారికి భయమొకవైపు; దైన్యమొకవైపు. ఆ జనులు వసురాజుతో నిట్లు మొఱవెట్టికొనిరి.

సీ. ఇష్టకృత్యము నిర్వహించుగాని దినంబు,
శుచి, మలీమసగతుల్ సూపవెఱచు,
దాక్షిణ్యము వహించి తనరుగాని సదాగ
తి, రజోభరభ్రాంతి దిరుగవెఱచు,
జగతికిఁ దేజంబు సమకూర్చుగాని, మి
త్రుడు చండకరశక్తి దొడరవెఱచు,
గొలుచు నాయమెచూపి నిలుచుగాని, ధరిత్రి
జీవనదంబు గర్జింప వెఱచు

తే. దేవ! తావక కరుణాసుధావిశేష
పోషితాశేష సద్వీప భూతలమున
నేటి తుదకీఱుణంబున నాటుకొనిన
పాటు, మది జిత్తగింపవే పార్థివేంద్ర!

(2-154 ప)

ఉ. అక్కట! మిక్కుటంబగు రయంబున నెక్కడనుంచి వచ్చెనో!
యొక్కనగంబు, వచ్చి, నినదోద్ధతి నొక్కట దిక్కటాహముల్
పిక్కటిలంగఁ బెల్లున, గుభిల్లున శుక్తిమతీ స్రవంతి పై
రక్కునత్రాలి, ఆగె భువనావళి, నుద్భుట వింధ్యవై ఖరిన్.

(2-146)

"స్వామీ!" నది ఘూర్ణిల్లినది. ఆగోత్రార్భటికది యోర్వలేక పోయినది. ఆమె ధాత్రినలిమికొన్నది. ఇంకేమున్నది? సర్వసర్వంసహా చక్రము జడమైనది గ్రామములు భంగసంగతములై నవి. ఆలయ వ్రాతములు అవనభూన్యము లై నవి. సాలములు కాండశేషములై నవి. వివిధజంతు విశాన విహృతి వాంతమైనది. వస్తుజాతములు వంకలై నవి; నరలోక జీవనము కంతగతము; కలమము లప్రాప్తఫలములై నవి. తోట, చేను, కొటారము, దొడ్డి వీని యాసలన్నియు నిసుమంత లైనవి. వసురాజా! మేము మాత్రము దప్పించికొని మీదర్శనమునకు వచ్చితిమి. ఇదిమాభాగ్యము." వసురాజీ మాటలు వినెను. ఆతని కన్ను లెఱ్ఱబారినవి. అది మూర్తీభవించిన యుత్సాహమై యుండెను. భ్రూ భంగమనెడు వినూతనక్రధ్వజశ ముద్భవిల్లినది. అనగా నింతకు ముందే నహజమైన శక్రధ్వజ మాకసమున దోచిన దన్నమాట! అది వర్షాకాలమని కవిసూచించు చున్నాడు. ఈ పద్యములలో రామరాజ భూషణుని శ్లేష కల్పనాచాతురి తేలిపోయినది. అది యాతని పాండిత్య లోపము కాదు. కావ్యము మొదటినుండియు, నాత డన్నిఘట్టము లందును శ్లేషను పుష్టిగా నిర్వహించుచునే వచ్చెను. మరి యిచ్చట తేలి పోవుటకు కారణమేమి? ఇందేదో రహస్యమున్నదని నా యను మానము. వారి విన్నపము నాలించిన వసురాజు కోలాహలుని శిక్షించు టకు బయలుదేరెను. ఆతడు బయలుదేరిన వర్ణన మిట్లున్నది.

సీ. దశనశంబముల దుర్ధర మహీధర కూట
కోటి నుగ్గులు సేయు కుంజరములు,
ఖురధూత గురుధూళి శరధిలీన నగాళి
గుట్టుఘట్టించు నారట్ట జములు,
పటుచక్ర చంక్రమాకృటి, గొండలవియించు
సమిదభంగ శతాంగ శతశతంబు,
లెత్తువడ్డ మహోకుభృత్తుల నతులిత
ధృతిఁజీరికిఁ గొసని ధీర భటులు,

తే. తడయ కప్పుడు పతివెంట దవిలినడువ
నమరు బృంహిత ఘోషిత ఘుమ ఘుమిత భు
జాసమాస్ఫాలితంబుల జడికి నడికి
కులకుధర మండలము కలగుండవడియె॥

ఈ సీస పద్యమున ప్రతిపాదమునందును కొంచల గొడవ రానే వచ్చినది. పద్యాంతమునందు కులకుధ మండలములను స్మరించి నాఁడు వసురాజు. 'కోలాహ లోద్వృత్తి'ని ముందేయూహించెను. అతఁడువానిని 'లేగవ్వమీటిన సూటి' తో నెగమీఁటెనని ముందే చెప్పినాము. మరియింత యూర్ధ్వాటమెందుకు ? భారతకథ నాత డెన్నికొనుటకుఁ గారణమీ ఘట్టమున నిమిడియున్నదని నా యనుమానము. కృష్ణరాయల కాలమునఁగాబోలు పెన్నానది నుండి యొక్క కాలువ పెనుగొండకుఁ దీసికొనిరాఁబడినది. 'పర్తాపు బుక్కయ్య'యనునాత డానాటి జలయంత్ర ప్రవీణుడు. అతడాకాలువను దీసికొనివచ్చెను. దానిని గొనివచ్చుటలో పెనుగొండ కొండయొక్కప్రత్యంత పర్వతమునఁను ఛేదించి మార్గ మేర్పరుపవలసి వచ్చెను. ఈ కార్యము రామరాయలపర్యవేక్షణక్రింద జరిగి యుండవచ్చుమ; ఆచ్ఛేదనమే దాని పెక్కలను ముక్కలు జేయుటగా నూహించుటకెడ మున్నది. పెనుగొండకు సుమారు రెండుమైళ్లదూరమున నొక యేరిప్పటికి నున్నది నాచిన్నతనమునఁగూడ నది కొంతవి స్తృతమై లోతుగానుండెను. దానిని నేటికిని జనులు "ముత్యాలవంక" యనియే పిలుతురు. దానినే భట్టుమూర్తి శుక్తిమతిగాఁజేసికొన్నాడు. దాని ప్రక్కననే పెనుగొండ కొండయున్నది. అది యాయేటి నడ్డగించినట్లే యుండును. భూషణకవి కోలాహలపర్వతముగా దానినూహించికొనెను. ఊహించికొనకున్నచో -

తే. అమరునతివేల కోలాహలముల కలిమి
నధిప యీయద్రి కోలాహలాఖ్యమొక్కొ ! (2-7)

అని యా పర్వతనామమును సమర్థించుటకు కవి ప్రయత్నింప వలసిన యవసరములేదు. కన్నడకవులలో నొక సంప్రదాయమున్నది. వారు దమకాశ్రయమొసగిన రాజు గుణములను తమకావ్య నాయకునిలో నారోపింతురు. 'కవికులాలంకారుఁడైన పంపఁడు తన్ను

బోషించుచున్న నరికేసరి మహారాజును తమ కథానాయకుడైన యర్జునునిలోఁ దోపింపజేసెను. శక్తికవియైన రన్నఁడు నూర్మడి తైలపదేవుని భీమునిలో ధ్వనింపజేసినాఁడు. అట్లేనన్నయ్య తన భారత భాగమందు రాజరాజనరేంద్రుని వ్యంజితమె నర్చి యుండునన్న యూహానాకున్నది. అది విషయాంతరము, కృష్ణరాయల కాలమందును కవులాతని 'నచ్యుతాంశ సంభవుడ'ని పొగడిరి. పారిజాతాపహరణమున చిన్నమదేవి జీవితనాయకుడు' వ్యంజితుడైనాడనుట కొక కథయే యున్నది. ఈ పద్ధతిననుసరించి భూషణకవి వసురాజులో రామరాయల దోపింపఁజేసెనని నాయూహ, అళియరామని పుట్టుక యిట్లు-ఉత్ప్రేక్షింపఁబడినది.

గీ. రవికులంబలరింప శ్రీరాముడైన
శౌరి తన రెండు కన్నులు సరియకాగ
దలచి సోమాన్వయము పవిత్రంబు నేయ
నవని శ్రీరంగ విభురాముడై జనించె. (1–42)

ఒకనాడు రాముడు సూర్యవంశమందవతరించెను. శ్రీమహావిష్ణువునకు సూర్యచంద్రులిరువురును రెండుకన్నులు. అందుచే నాతడు దనకు భేదబుద్ధి బనికిరాదను కొన్నాడట! 'సోమాన్వయము పవిత్ర' మొనర్చుటకై రాముడు రామరాయలుగా జన్మించెనని భూషణకవి వాదము. దానితో నాతఁడాగలేదు. రామరాయల చరిత్రమును రామాయణముగాఁ జేసినాఁడు. ఆ పద్యమిది.

సీ. పట్టాభిషేక విపర్యయంబునఁబ్రోలు
వెడలి ప్రియానుజుల్ వెంటగొలువ,
జిత్రకూటాభిఖ్యఁ జెలగు పెన్గొండ సాం
ద్ర హరిద్వి పేంద్ర నాదవని జెంది,
ఖల జనస్థాన వాసులఁ బల్వుర వధించి
మహిమసలక ఖరస్మయమడంచి,
హరివీర భట మహోద్ధతినబ్ధి గంపింప,
దురమున గదిసి, తద్రోహిదునిమి,

తే. యనఘతర పార్థి వేందిర నధిగమించి,
సాధుకర్ణాట విభవ సంస్థాపనంబు,
పూని, శరణాగతుల నెల్ల బ్రోచెరాము
డతడు నిజచరితంబు రామాయణముగ॥ (1-43)

రామరాజ భూషణుని బ్రహ్మాస్త్రము 'వాగ్వైచిత్రి'యని మన మెఱుగుదము. అతఁడు దాని సహాయముతో రామరాయల చరిత్రను రామాయణమేననెను రామునకు పట్టాభిషేకము జరుగలేదు. అతడరణ్యములకు జనెను. ప్రియానుజులు వెంటనడచిరి; తొలుత చిత్రకూటమును బ్రవేశించి నాడు. అటనుండి దండకారణ్యమును జొచ్చెను. జనస్థాన మందున్న యనేక రాక్షసులను వధించినాడు. ఖరాసురుని జంపెను. హరి వీరభటమహోద్ధతితో నబ్ధిగంపింపగా దురమున రావణాసురు నిద్రుంచెను. ఆ పైన పార్థివేందిర నధిగమించినాడు. కర్ణాటుడు వృద్ధ శ్రవసుడు. అనగానింద్రుడు. ఆతనివిభవసంస్థాపనమొనర్చివిభీషణాదులను శరణాగతులను రక్షించినాడు. ఇది రామకథ. అచ్యుతరాయల భావ మరది సలకముతిమ్మడు. వాఁడు వరదాంబికను జంపెను. అచ్యుత రాయల కుమారుని వధించెను. వాఁడే సర్వస్వమై సింహాసనము నాక్ర మించికొన్నాడు. కృష్ణరాయల యనంతరము తిరుమలదేవి, చిన్నాదేవి యిరువురును బ్రతికియుండిరి. వారుదమ యల్లుండ్రకు రాజ్యము నొప్పింప యత్నము లొసర్చినారు. అవి సాగిరాలేదు. రాయలమరణ శాసనము ననుసరించి కులువంశాంకురమైన యచ్యుతుడు రాజయ్యెను. అంతఃపుర మున కుట్రలు జరుగుచునే యుండినవి. ఆరాణులిర్వురును రహస్యముగ బిజాపూరు నవాబుతో రాయభారములు నడుపువరకును బోయిరి. అచ్యుతుఁడు మరణించిన వెనుక రామరాయలు రాజ్యము నాక్రమించు కొనజూచెను. ఆ ప్రయత్నము ఫలింపలేదు. ఆతడు దమ్ములతోఁ బెనుగొండను జేరెను. ఆదవేనిని జయించినాఁడు. సదాశివుడు తుళువంశీయుడు. గుత్తిలో బంధింపబడియుండెను. వానిని రామరాయలు విడిపించి సింహాసనమునకు సదాశివునిదని యుద్ఘోషించెను. ఎట్లైన నేమి ? సలకముతిమ్మడు మరణించెను. రామరాయలే వానిని జంపెనని వసుచరిత్రయనుచున్నది. దీనికాధారముగ మార్కాపురములోని

చెన్న కేశవస్వామి ఆలయమున నొక శాసనమును గలదు. రామరాయలు విజయనగరమును లోబరచుకొని సదాశివుని రాజుగా నిలిపినాడు. కర్ణాటదేశవిభవము నాతడుద్ధరించెను. ఇట్లు శబ్దచిత్రముతో అళియ రామునికథ రామాయణమైనది. దశరథరాముని కన్న నీతడు గొప్ప వాడనుటకును భట్టుమూర్తి జంకలేదు. ఆతడు ముక్తకంఠముగ నా విషయము జెప్పనే చెప్పెను.

శా॥ విశ్వామిత్రునిగొల్చి, రాముడతడుర్వింజెండె గల్యాణమున్,
విశ్వామిత్రులు గొల్వ రాముడితడుర్వింజెండె గల్యాణమున్,
శశ్వత్కీర్తి రాములయ్యిరువురున్, సాధించు కల్యాణలా
భైశ్వర్యంబులు ధర్మనిర్మథన ధర్మాలంబన వ్యక్తముల్॥ (1-46)

విశ్వామిత్రుని గొల్చి దశరథరాముడు గల్యాణమునందెను. విశ్వామిత్రులు గొల్వగా నళియరాముడు గల్యాణ పట్టణమును సాధించినాడు. శ్రీరాముడు ధర్మనిర్మథన మొనర్చి కల్యాణ మందెనట! శివధనువును విరిచెనని యర్థాంతరము. ఈతడు ధర్మాలంబన మొనర్చినాడట! అందుచే రఘురాముని కన్నను అళియరాముడెక్కువను చున్నాడుకవి; నిజాముడు రామరాయలతో యుద్ధమునకు దిగెను. వాడు పరాజితుడై పరువెత్తినాడు. ఆవర్ణన మిట్లున్నది.

సీ. ప్రబలావలేప విగ్రహ జాయ మానాగ్ర
హముడించి బహుధావ నాప్తిగాంచు
బురమెల్ల ప్రత్యగ్ర భూతిపాలుగ జేసి
యచలాసనా భ్యాసియైకృశించు,
రతిసిభరామానుగతవైభవైపైరోసి
కలనైన కళ్యాణ కాంక్షయిడదు,
సరవి ప్రాణా యామ సంసిద్ధికై సారె
కు గుండలి స్థానమంటు!

తే. మానక నిజాముడపవర్గ మార్గ వృత్తి
బెరయ పరబుద్ధి నెవ్వాని పేరుదలచి,
యతడు శ్రీరాము డఖిలసన్నుతికి దగడె
సేతు కాశీ తలాంతర ఖ్యాతయశుడు॥ (1-47)

నిజాముడు భూషణకవి దయతో యోగియైనాడు. ఈ పద్య మందు 'విగ్రహము', 'బహుధావనాప్తి' పురము, 'అచలాసనాభ్యాసి, రతినిభరామానుగతమైత్రి', 'కల్యాణకాండ', 'ప్రాణాయామము,' 'కుండలి' 'అపవర్గమార్గము', 'పరబుద్ధి' అను పదములన్నియు శ్లిష్టములు. వీనిసాయముతో రామరాజ భూషణుడు ఒక యోగి యొక్క సాధనను వర్ణించెను. ఇబ్రహీం ఆదిల్ షా "ఇభరాముడై" నాడు. ఈ కల్పనలకుఁ బ్రబోధకమేది ? భూషణకవి గాలి వాటుగా వర్ణించెనా ? లేదు. అళియరామునికి 'కోదండరాముడ'ను బిరుదుండెను. బహుశః విలువిద్యానాతఁడు బెద్దగా సాధించెనేమో ! బోయవారందరును విలువిద్య నానాడు వెగ్గలముగ నేర్చుచుండిరి. నేటికిని వారికి 'గురికాండ్ర'ని పేరు. ప్రతాపరుద్రుని కడనుండిన 'నవలక్షధనుర్ధరులు' రాయలసీమవారని మొన్నటివరకు మావైపు బెద్దలాడు మాట. కావ్యమునఁగూడ రామరాయలకు వసువుతో నభేదప్రతిపత్తి కల్పించిన ఘట్టములున్నవి. ఒకటిరెండు మనవిసేతును.

రామరాయల నొకచోట "అభిరామనరేంద్రుఁడ"ని కవి వాకొన్నాఁడు. ఆ పద్యమిది.

చం. అరిజయకీర్తి సాంద్రుడగు, నయ్యభిరామ నరేంద్రసోదరున్
దిరుమలదేవరాయల నుతింపదరంబె, తదీయ హేతిశా
కరి, యతిలోహితావయవగాదను నాత్మహృదంతరంబులన్
దరలకదాల్పి వారలకు. దార్ఢ్యసురీవరణీయ వైఖరుల్.
(1-48)

తిరుమలదేవరాయలిందు వర్ణితుఁడు. ఈ 'యభిరామ' శబ్దమే గిరికావసురాజుల వివాహమైన తరువాతగూడ వచ్చును.

సీ॥ లాలింతునే బాదనాళీక యుగళి నా
కటికేశ్వరత్వంబు గణనమీర,
బాలింతునే ! గటిస్పర్శ వైభవము నా
నేత్రాహ్వాయంబు వన్నియకునెక్క

శీలింతునే, గుచ్ఛశీలాభగరిమ నా
నాయకత్వము సార్థతాయుతముగ
శీలింతునే, గర్ణసీమాంతికంబు నా
కువలయ రాజ్యత్వమవనిఁ బొసగ

తే. నిగనిగని సంజెకెంజాయ పొగడుదెగడు
మోవిమానికమాని సంపూర్ణరుచిస
మగ్రత వహింతు నేనింతి! మామకాభి
రామ వసునామ ముచిత గౌరవముదాల్ప॥ (6-85)

దీనిలో 'అభిరామ వసునామ'ము జాగ్రత్తగా గమనింప దగినది. రామరాయలకును వసురాజునకును అభేద ప్రతిపత్తిని సాధించుట కవి యభిప్రాయమనుట, కిది దోహదము: ఇచ్చట మరియొక కీలకమున్నది. కటకేశ్వరత్వము; విజయనగరరాజుల కెప్పుడును కటకముపైఁ జూపు, సంగమవంశము నాటినుండియు వారితోరవరవలు చెలరేగినవి; రాయల కాలమున వారు విర్యంకులైరి. కానివారి విద్వేషము చల్లారలేదు. రాయల యనంతరము గజపతి యెత్తి వచ్చెను. మరల నచ్యుతుని కాలమున వారితో యుద్ధము జరిగినది. అతని యనంతరము మరల దలనెత్తిరి. రామరాయలు మరల వారిపైకి నడచినాడు. తాము కటకేశ్వరుల మనిపించికొన వలెననివిజయనగరరాజులకు బెద్దయాశ. ఈ రెండు రాజ్యములును పరస్పరావహేళనము లొనర్చుకొనుచునే యుండెను. తెనాలిరామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యములో నిగమశర్మను గూర్చి చెప్పుచు.

కం. అతడు కళింగోద్భవుడగు
కతమునకో, వ్రేల జూప గసుగందక యో
యతమస్వీకారమునకు
నితరుండై యుండె మునికులేశ్వర ! వింటే ! (కి. 17)

అని వెక్కిరించినాడు అట్లు వెక్కిరించు వరకు నాతనికి నిద్ర పట్టలేదు; భట్టుమూర్తియు వసురాజు, సామంతులలోఁ గాళింగులను

(1-146) మఱువలేదు. కనుక 'కటకేశ్వరత్వము' వసురాజు రామరాయలేననును. దానిక్రిందనే మరియొక పద్యము గలదు. అది యిది.

తే. అనుచరపతి కెంగేలనచలకన్య
కాత్రపార్శుర గూఢాంగకములు దడవె
నొయ్య, నాభి కుచాది నిమ్నోన్నత ప్ర
దేశములు తద్విగాహేచ్ఛ దెలియుకరణి (6-88)

ఇందులో "నరపతి' శబ్దమున్నది. ఇది రాజపరమైనను సార్థకముగా వాడబడినది. నవాబులశ్వపతులు. గజపతులు కటకేశ్వరులు. విజయనగర రాజులు నరపతులు. ఇది యొక్కచోటనేకాదు. రాజశబ్దము వాడవలసినప్పుడంతయు భూషణకవి "నరదేవ", (1, 161) "జనవీర" (2, 18) "మానవనాథ" (3,35) యిత్యాది శబ్దములనే యెక్కువగా వాడుచుండును. ఇట్లువాడినచోటులు సుమారు రెండు పదులకుపైగానున్నవి. వీనియన్నిటికి 'నరపతుల'నియే తాత్పర్యార్థము. 'అభిరామ' శబ్దము మరియొక్కచోటను వచ్చును.

సీ. అభిరామ నవపల్ల వారామకుఁజ వా
టికల గీరముల నాడించుకొనుచుఁ
బద్మాలయోదర ప్రౌఢసారస వీధి
నంచలవేడెంబులంపి కొనుచు
గాంగేయధామశ్యంగ విటంకముల నీల
కంధరోజ్జ్వలగతుల్ గాంచికొనుచు
విమల సింధుద్వీపవేదిక నరుణాశ్వ
ఖగవిహారప్రౌఢి వొగడికొనుచు

రతియుఁ జేతోభవుండు, భారతియు నజుఁడు
శచియు నమరాధినాథుండు జలధిసుతయు
నబ్జనాభుండు నన మించి యభిసమయ
సముచితక్రీడ సలిపిరి సతియుఁబతియు. (6-87)

వసురాజు కోలాహలపర్వతము నెగమీటినాఁడు. ఆ సందర్భమును వర్ణించుచు మూర్తికవి -

తే ప్రబల కోలాహలాహార్య పతనరుద్ధ
విపులశుక్తిమతీ మగ్నవిపుల కతని
చరణ నఖరేఖ సంవర్తసమయజలధి
నుద్ధరించిన కిటిదంష్ట్రియొఱపుఁ దెలిపె. (1-119)

"కోలాహలుఁడు శుక్తిమతి నడ్డగించినాఁడు. దానియందు మగ్నమైన విపులకు వసురాజు చరణనఖరేఖ సంవర్తసమయ జలధినుద్ధరించిన భూవరాహమూర్తియొక్క దంష్ట్రిసౌందర్యములు చేకూర్చినదట"! విజయనగరరాజుల ధ్వజము భూవరాహము, ఈ విషయము మనము జ్ఞాపకమంచికొని చూచినప్పుడు వసురాజులో రామరాయలున్నాఁడనటలో నీ పద్యమెంతయో దోడ్పడును. ఉపమానములుగూడఁగొన్ని 'కోదండరాము'ని జ్ఞప్తికెలయించుచునే యున్నవి. రెండవయాశ్వాసమున మంజువాణి వసురాజు విక్రమమును వర్ణించెను. ఆ సందర్భములో నీ పద్యమున్నది.

ఉ. అంతననంతవేగ భుజగాంతకు డన్యహికాంతుఁ డాశ్రిత
స్వాంతము సంతసిల్ల, సురచారణ సన్నుతిపర్వ, నవ్వనా
భ్యంతరరోధకంబగు మహోద్రి నఖంబునమీటె; నభ్రవి
భ్రాంతముగాఁగ దుందుభి కబంధము మీటిన రాము కైవడిన్. (2-153)

వసురాజు కోలాహలునిమీటుట రఘురాముఁడు దుందుభి కబంధమును మీటినట్లుండెనట! మంజువాణి గిరికావృత్తాంతమును జెప్పుటకు అధిష్ఠానపురమునకు వచ్చినది. ఆమె రత్నపుత్రికలలో రత్నపుత్రికయై దాగెను. వసురాజు తనలో దానేమియో భావించుకొనుచుండెను. నడుమ నడుమ గిరికాదేవిని గూర్చిననింద; అది విని మంజువాణి పకపక నవ్వినది. వసురాజింతకుముందొనర్చిన స్త్రీభూషణకామప్రతివాదమునేయనారంభించెను.

శా. మాయాశీలురు, చంచలాత్మ లనుకంపాళూన్య, లాత్మైక కా
ర్యాయత్తుల్, సమయానుకూల హృదయ వ్యాపార గోపాయనో
పాయజ్ఞుల్, మగవారలాపయి మహీపాలుల్ మహావైభవ
శ్రీయోగాంధులు, చెప్పనేల? మగవారిన్ నమ్మగావచ్చునే.
(4-90)

మంజువాణి తనకరమునందున్న గిరికాహారము నా 'నెఱిదొర' కంఠపీఠమున నిలిపెను. దానిచే నాతనియుత్సాహ ముప్పొంగినది. ఆది గిరికా హారమని యాతఁడు గుర్తించెను. అప్పుడాతఁడా దూతికను దర్శనమివ్వనాహ్వానించినాఁడు. ఆ ఘట్టమున నీ పద్యమున్నది -

సీ. అన విని రఘునంద నుని సన్నిధిఁబ్రభూత
చైతన్యమైపొల్చు చట్టుపొలతి
కరణి రత్నపుఁబొమ్మగతిమాని ధృతిపూని
క్షితిజానికి జోహారు చేసినిలిచి. (4-108)

ఈ యుపమానముగూడ సందర్భము తో నదుకకున్నను 'కోదండ రామునినే జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. ఇంతమాత్రమేగాదు. ఆతఁడవ్వు డప్పుడు అళియరాముని నామమునే రామనామముగ జపించిన ఘట్ట ములును గొన్నియున్నవి. ఒకటి యీ క్రిందిది -

ఉ. ఆదరణీయ రామకథనాంక శుకోక్తులతోడఁ దీవ ము
త్తెదువ చాలు శోభనపుటారతులెత్తె, సదాగతిన్ గిరి
క్షోదవినోదికిన్ జిగురుజొంపపు గెంపుల పల్లెరంబులన్
బ్రోదిదనర్చు నగ్గలపుమొగ్గలు ముత్తెపుమ్రుగ్గులీనగన్. (1-152)

పై పద్యమంత స్పష్టముగాకున్నను తన ప్రభువును గీర్తించిన ఘట్టములు, చాలవఱకా కావ్యమున వచ్చును.

తే. స్వామియారామ శుభవైభవములు సూడ
నెపుడు విచ్చేయుదురొయంచు నెదురుచూచు
సహజ సౌభాగ్యములుగూర్చి చైత్రుఁడతఁడు
కూర్మిభవదీయ వనపాలకుండు గాదె? (1-141)

తే. నృపుఁ డల వనీపకుల నవనీపకుల నొ
నర్చి యచ్చో, నిజారామ నవ వసంత
సమయ సౌభాగ్యములుచూడఁ జను మనో ర
థంబున రథంబు దెమ్మనఁ దడయకపుడు

అచే

శా. స్వారాజ్యంబునుబోలె నింద్రున కధిష్ఠానం బధిష్ఠానమై
యా రాజన్యున కింపుసొంపెసఁగు నిత్యశ్రీలతా వాలమై
యారామస్మయమాన సూనమకరందాసార శైవాలినీ
ధారావర్ధిత మాధురీగుణ లసత్కాంతార కాంతారమై.

తే. రత్నభూషితయైన యా రాజధాని
యరుతనురుతర ముక్తాఫలాభిరామ
దామకంబన-జాలి, నిద్దంపు జవుల
బరగు శుక్తిమతీనామ భవ్యతటిని

పై పద్యములలో 'రామ' శబ్దమున్నది. క్రిందిదానిలో మరల 'నభిరామ' పదము హోజరు. నేను పనిగట్టుకొని యిట్టి పదములము జూపించుచుండుట మీకు విడ్డూరముగఁ గన్పింపవచ్చును. ఇతర కవుల విషయమైనచో నది విడ్డూరమే కాని రామరాజభూషణుని విషయములో నదికాదని నా మనవి. ఆతఁడు చమత్కారప్రియుఁడని పలుమారు మనమనుకొన్నమాటయే. ప్రథమాశ్వాసమున నీమత్తేభము గలదు.

మ. అనఘాత్మీయ పదోపకంఠమునఁ బాణాచారమున్ బూను రీ
తి నితాంతానతశృంగమై, నిభృతమై, దిక్కేది, యక్కొండ యుం
డినఁ గొన్నాళ్లకుఁ గేళిశైలముగఁ బాటించెన్ మహీజాని, మ
న్ననఁ దచ్ఛైలశిరంబుపై మృదుపదన్యాసంబు గావించుచున్

(1-122)

వెనుగొండను జూచివవారికి యీ పద్యములోని యర్థమెంత సార్థకమో మనసునకు వచ్చును. ఆ పర్వతముచుటును ఒకనాఁడు రాజభవనములే యుండెడివి, ఆ కొండ మూర్తికవియన్నట్లే నితాంతానత

శృంగము, నిభృతమును, దిక్కేదినదియు, దానివ్యాపనము నైఋతి మూలనుండి వాయవ్యమునకు, వర్షాకాలములందును వసంతములందును దాని శోభనుజూచి తీరవలెను. నాటి రాజులకేగాదు, మా చిన్ననాఁడు, మా కందరకుగూడ నది కేళిశైలము'గ నుండెడిది. భట్టుమూర్తి పాలికిఁ బెన్గొండయే యధిష్ఠానపురము, అతఁడన్నాఁడు.

మ. అమరుం దత్పురిచెంత కాంతకనకాభ్జాలంబు రోలంబ శు
క్తిమతీ వాహిని, సారసారణులు తత్కేదారకోదార స
స్యము ముక్కారును బండజేయ, దివి వారల్ వీటిసత్రాన్న భా
గములాసింపఁగ, దత్సరాలయనదీఖ్యాతిన్ విడంబించుచున్
(1-109)

మా బాల్యమున కోలాహలుని పట్టు దప్పించి కొనివచ్చు 'ముత్యాలవంక' క్రింద భూములు సాఁగెడిని, నేడు క్రమక్రమముగ కబంధహస్తములు జాచిన నాగరికత మాయధిష్ఠాన పురమును కల్పనలో మాత్రమే నిలిపినది. పుష్పలావికలుగూడ చూచుచుండగనే యస్తమించిరి. ఏక్కడో పెనుగొండ ప్రాంతములు 'గోరంట్ల' 'పాలకురికి' మొదలగు గ్రామములలో నాయాచారములు కొనప్రాణముతో నిలిచి యున్నవి. చారిత్రక దృష్టితోఁజూచినప్పుడు వసుచరిత్రలోని పీఠిక చాలవెల గలిగినది. సుల్తానులతో జరిగిన యుద్ధములనెన్నిటినో యది వర్ణించును. సదాశివరాయలు రామదేవరాయల కడ బందీగానుండెను. తళ్ళికోట యుద్ధము తరువాత తిరుమలుఁడు ఘూగిరికిఁ బరువెత్తినాఁడు. తనతో నాతఁడు సదాశివుఁనిగూడఁ దీసికొనిపోయెను. సంవత్సరమున కొక్కసారిమాత్ర మాతనిని ప్రజలకుఁ జూపించుట వాడుక, రామరాయలు-తిరుమలరాయలు, వీరిపాలనము జనముల కెంత సమ్మతముగా నుండెనో చెప్పలేము. రామరాయలు మహాపరాక్రమి. అందుచే నాతని మాటకెవ్వరు నెదురాడకుండిరి. కాని సామ్రాజ్యమున కాతఁడు వారసుఁడు గాదనుబాధ జనులకుండనే యుండెను. తిరుమల రాయల కాలమున నాయ సమ్మతి మరికొంత స్పష్టరూపమును దాల్చినది. తాము చాళుక్యులమని సమర్థించుకొనుట కాతఁడెన్నియో యవస్థలు పడెను. 'చాళుక్యనారాయణ'యను బిరుదును మాటిమాటికి ఘోషించి

కొన్నాఁడు. అతఁడీయవస్థలో నుండగనే "సదాశివుడు బ్రతికియున్న ఁగదా యీ బెడద" యని రఘునాథుఁడు వానినిఁ జంపెను. ఈ దురా గతము తిరుమలునకు గూడ నిష్టమున్నట్లు లేదు. అతఁడు పెద్దవాడైన రఘునాథునకుఁ బట్టము గట్టక, రెండవాఁడైన శ్రీరంగరాయలకు రాజ్యమొప్పించినాఁడు, రఘునాథునకిక మార్గమేమున్నది? వాఁడు భగవధ్యానముతో కాలము గడపెను. ఈ విషయమునీ క్రింది పద్యము దెలుపును.

చ. హరిపద భక్తిశీలుఁడగు నా రఘు నాథ నృపాలుకూర్మిసో
దరుఁడు శిరంగరాయ వసుధావరుఁడాత్మగుణప్రమోద వ
త్తిరుమల రాయశేఖర వితీర్ణమహా యువరాజ పట్టబం
ధురుఁడయి సర్వభూభువన ధూర్వహశక్తి వహించునెంతయున్
(1-70)

రఘునాథుఁడు తళ్ళికోట యుద్ధమునందే మరణించెనని చారిత్రకులవాచము. భట్టుమూర్తి వాడు బ్రతికియే యుండెనన్నాడు. తిరుమలుఁడే సదాశివునిఁ జంపించెనని యొకమాట. వెంకటపతి దేవరాయలు సదాశివుని జంపెనని వేరొక పలుకు; ఈ రెండు వాదములనీ పద్యము గాదనుచున్నది. ఇట్టివే యీ పీఠికలో మరికొన్ని విశేషములున్నవి. చారిత్రక విషయములతో మిమ్మల్ని విసిగించుట నాయభిమతము గాదు. ఆ దృష్టియున్నవారు 'హీరాస్ మహాశయుని' గ్రంథముతో పీఠికను జోడించి చదువుకొనవచ్చును. ఇంకొక్క విషయము మఱచితిని. గిరికయనగా వనమల్లికకుగూడ నర్థమున్నది. కనుక గిరికను వర్ణించు గొన్ని పద్యములలో వనమల్లిక పరముగాగూడ నర్థము చెప్పికొనవచ్చును. ఇంతగొడవ నెందుకుచేసితిననఁగా రామరాయల కాలమున జరగిన యేదోయొక సంఘటనను మనసులోనుంచుకొని భట్టుమూర్తి వసుచరిత్రను గ్రాసినాఁడు ఆ సంఘటనమేమి? నేను చెప్పలేను. మనకానాటిచరిత్ర సమగ్రముగఁ దెలియదు. కాని యేదో యొకటి జరగినదనుటమాత్రము నిక్కము.

కీర్తిశేషులు పూండ్ల కృష్ణయ్యగారు "అముద్రితగ్రంథ చింతామణి" యను పత్రిక నొకదానిని గొంతకాలము నడపిరి. దానిలోఁ

బండిత ప్రకాండులు యెన్నివిషయములనో చర్చించినాము. నాకా పత్రికలన్నియు దొరకలేదు. దొఅకినవి మాత్రమే యెత్తిపెట్టు కొన్నాను. వానిలోని కొన్ని పూర్వపక్ష సిద్ధాంతములను మీ ముందుంతును. వసుచరిత్రలో నీ పద్యమున్నది.

కం. అబ్రాసిధీర ! ధీరచి
త్రబ్రాహ్మ్యధవ వివేక ! తరుణచరణ భా
గిబ్రామశరణ ! సకలక
కుబ్రామాభరణ కరణ ! గుణసంభరణా ! (4-140)

ఆశ్వాసాంతములోనిదిది. 'అబ్రాసిధీర !' జలరాశివలె గంభీరమైన పాడా ! యనిటీక ! (1) నానార్థ నిఘంటువులోని శ్లోకమునుబట్టి 'ధీర' శబ్దమునకు గంభీరుడనియర్థము కానేరదు. ధైర్యగాంభీర్యములు క్రమముగా పర్వత సముద్రనిష్ఠములని కవి సమయ సిద్ధము (2) విశ్వవిశ్వంభరాంభోజకర్ణికాయ మానంబగు సువర్ణావర్యంబు ధైర్యంబును" "అమృతంబునకు నుత్పత్తి స్థానంబగు పయోనిధానంబు గాంభీర్యంబును అని శృంగారనైషధమున శ్రీనాథుడు ; భూషణకవి కవి సమయము నుల్లంఘించినాడని యాక్షేపము, ధీరశబ్దమునకు సుమారొక నేరర్థములున్నవి. (3) దేనినన్వయించి కొన్నను బాధలేదు.

"నానాసూన వితాన వాసనల" అనుపద్యములో 'గంధఫలి' యనగా సంపెంగమొగ్గ. (4) తపమొనర్చుటకుముందు సంపంగిమొగ్గకు సౌరభ్యము లేదు. తావిలేని గంధఫలికి నాయికాత్వము సిద్ధింపదు. ఆశబ్దమునకు చంపకపుష్పమని యర్థము చెప్పికొన్నను సందర్భము పొసగదు. తపమొనర్చుటకు ముందు దానికి సౌరభ్యములేదా! లేదనుట విరుద్ధము. తపస్సు చేసిన వెనుకనే 'గంధఫలి' సౌరభ్యసంవాసితమైన

---

(1) ధీరస్తునాబుధే, అంబుధౌచ త్రిషుద్వేషమందరే స్థైర్యవత్యపి :
(నానార్థరత్నమాల)

(2) శృంగారనైషధము (4-12)

(3) Moniar williams Dict : Steady, constant, Firm, Resolute, Brave Energicticte.

(4) "చాంపేయశ్చం పకోహేమపుష్పకః ఏతస్యకలికాగంధఫలీస్యాత్"

ల్లెందుకుఁ జెప్పినాఁడు?" ఇది సంశయము. గౌరిదేవి బాల్యావస్థ యందే యీశ్వరుని గూర్చి తపమొనర్చినది. స్కాందాదుల యందును గాళిదాసాదుల ప్రయోగమందును యిట్లెయున్నది, పుత్రవతిగాని స్త్రీ తన కిష్టమైన పురుషునిఁగోరి తపమొనర్చుట యుక్తమే నని యొక సమాధానము. తపస్సునకు ముందు 'గంధపలి' యొక్క సుమన స్సౌరభ్యము మాత్రమే యుండినది, తపించి, యది సర్వసుమన స్సౌరభ్యమును సంపాదించి కొన్నది. ఇది వేరొక సమాధానము. వసు చరిత్ర మూఁడవ యాశ్వాసమున నున్న దీక్రింది రచన. సందర్భము మన్మథపూజ.

ఉ. కొండట విల్లు, వే దలల కుండలిరాజటనారి, యమ్మనం
తుండట, బైటిపల్లి యలు దున్మినవాడట యొండురొండు భ
ర్గుండిది; నిండుపౌరుష మొకోయని గెల్వవె, ముజ్జగంబు లు
ద్దండత నొక్కతుంట విలుదాలిచి యంటిరగండు తూపులన్

"పరమశివునకు మేరువు శరాసనము శేషాహినారి లక్ష్మీశ్వరుఁడు బాణము ఇన్ని పరికరములతో నాతఁడు బైటిపల్లెల నొంటిరెంటినే దున్మెను. అది నిండుపౌరుషమగునా? నీవొ ఒక్క తుంటవిల్లు దాల్చితివి. బాణములా! యంటిరఁగందునవి వీనితో ముజ్జగములఁ గెల్చితివి. నీకుసరి యెవ్వఁని మన్మథుని పొగడ్త. కవి దృష్టాంతమున వింటిని వింటినారినిఁ జెప్పినాఁడు, మన్మథపరమైన యర్థమున ధను ర్బాణములుమాత్రమే వచించెను. జ్యావల్లియూ సెత్తలేదు. దార్ష్టాంతిక మందు లోపమున్నది.

దీనికి "గ్రియాసిద్ధి స్సత్వేభవతి మహతాం నోపకరణే" యని మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి సమాధానము; నారినిఁ జెప్పక పోవుటయు మన్మథుని విక్రమమునకు గుణాధాయకమేనట!

మంజువాణి మాయాయతినిట్లు బ్రశ్నించుచున్నది.

ఉ. ఎచ్చటినుండి యెచ్చటికినేగుచు నిచ్చటి కద్భుతంబుగా
వచ్చితి రార్యసన్నుత ! భవచ్చరణాబ్జ నఖేందు యుక్తిచే
నచ్చపుదెల్వివచ్చె, దమమంతయు విచ్చె, గలాకలాపముల్
హెచ్చె, మదాళిభాగ్యమిక నింద్రపురంధ్రులకైన గల్గునే ?
(2-86)

టీకగూడ, "చరణాబ్జ =పాదపద్మములయొక్క, నఖ = గోరనెడు, ఇందు=చంద్రుని యొక్క, యుక్తిచేన్ = కూడికొనుటచేత" ననియే యున్నది. "అబ్జములకును జంద్రునకును బొత్తుకుదురదు కదా!" యని యొక యాక్షేపము, విరోధము సూచితమగు చున్నదట! టీకాకారుడు గూడ నిచ్చట మరికొంత యాలోచింపవలసి యుండెను" అబ్జ చంద్రులకు సంబంధమును గూర్చినాడు గనుకనే యాశ్చర్యార్థక "యద్భుత"మని యొక సమాధానము. అబ్జమనగా నుత్పలమునకు గూడ నర్థమున్నది. ఉత్పలములతో, జకణములగ బోల్చుటయుగ్వా చిత్కముగ గలదు. మరియొక సమాధానము గూడగ జెప్పికొనవచ్చును. "చరణాబ్జ+న+ఖ+ఇందు యుక్తి, అని విభాగముచేయుటకువీలున్నది. 'న' శబ్దముచేత సమాసము వ్యాకరణ సమ్మతమే. ఆకాశ సంబంధము లేని చంద్రుడని యర్థము ప్రసిద్ధ చంద్రునితోనే పద్మములకు విరోధము అందుకే భూషణకవి "తెల్వి-తమము-కళాకలాపములు" అను వానిని శ్లిష్టముగ వాడినాడు. ఎట్లైనను నీ సందర్భమున నీ సమాధానము లన్నియు 'స్థితస్యగతిశ్చింతనీయా' వంటివిగనే యున్నవి. పెద్దన్నగారి దీ పద్యము.

మ. కలడుల్లోక యశఃపురంధ్రి జగతిన్ గంధర్వవంశంబునన్
నలనాభాహ్వయుడేతదీయ తనయుండన్ బ్రహ్మమిత్రుండు శి
ష్యులకున్ గంటను వత్తి బెట్టికొని యాయుర్వేదమోరంతప్రొ
ద్దులచే జెప్పన్ వినుచుండి, మానసమునందున్ దజ్జిఘృక్షాతిన్

ఈ యెత్తుగడను మనస్సునందుంచికొని భూషణుడు దానిని మించుటకు యత్నించెను. ఆరచన యిది.

మ. కలఁడుల్లోక మహోమహోగ్రహుతభుగ్జాలావళీనిర్జల
స్థలదంభోనిధి లక్ష్య హైమవత పఙ్క్తిద్రోద దఙ్కోరుది
గ్వలభీ దుర్భర భేరికాభయద భాంకారైక సంప్రీణితా
చలవైరిస్తుత కీర్తి సాంద్రుఁడు వసుశ్మాపాలచంద్రుండిలన్॥
(౭-101)

వసురాజు ప్రతాపమే మహాగ్ని, దాని జ్వాలలతో సముద్రజలమింకినది. మైనాకుఁడందు దాగికొన్నాఁడుగదా! వాఁడు బయలుపడెను. వసురాజు భేరీభాంకారములు వానిపఙ్క్తిద్రోదమొనర్చినవి, దీనిచే దేవేంద్రునకు సంతసము గలిగెను. అతఁడు వసురాజు కీర్తిని గీర్తించెనట. ఈ పద్యముపై నొక భట్టనాథ స్వాములకును దక్కిన పండితులకును వివాదము జరగినది. 'పర్వతముల రెక్కలు ఛేదించునది వజ్రాయుధమే భేరీభాంకారముల కాశక్తి లేదు. అందువలన నీ యుక్తి సరిపోదని' పూర్వపక్షము. దానికి భట్టనాథస్వామివారి సమాధానమిది, "ఎల్లప్పుడును దేవేంద్రుని వలని యత్యాహితము శంకించుచుండు మైనాకునకు వసురాజు ప్రతాపమచే సాగరము శుష్కమైనతోడనే యది తనకు సనాతన శత్రువగు దేవేంద్రునిపని యని శంకపుట్టుట సంభవమే. లోకమునఁ గూడనెన్నలేని యొక యుపద్రవము యిదమిత్థమని తెలియక గల్గినప్పుడిది తన శత్రుకార్యమని తలంచుట యనుభవ సిద్ధము. ఇట్లు సముద్రశోషణము తన శత్రుని కుసృష్టియని తలంచుచుండు మైనాకుఁడు భేరీభాంకారము వినబడగానే రంధ్రాన్వేషియైన పాకశాసనుఁడు సముద్రమునుండి వెలువడిన తన్ను విపత్తునిఁగాఁ జేయవచ్చుచున్నాఁడని తలంచి బెదరి యాపైని వచ్చునాపదల భావించి భావించి తుదకున్మాదంబునఁదత్రాప్త్యవస్థను గూడ దలఁచి తత్రాప్తుండపోలె యైయుండవచ్చును", దీనిలోని యౌచిత్య విచారమును మీకేవదలితిని. యశస్సునకును గీర్తికిని భేదమున్నది. అనర్ఘరాఘవ వ్యాఖ్యలో గీర్తియశస్సులకు భేదమిట్లు గల్పింపఁబడినది.

యశోదాన జాకృతిః, కీర్తిద్వీర్య జేతికవిసమయః
ప్రౌఢప్రవృత్తి స్సోత్సాహా ప్రారబ్ధ్యసఫలోదయా॥
"కృతిర్వ్యాపారమయత్యేవ విశ్వఁసా కీర్తి రుచ్యతే
సైవ దాన ప్రసూతాచే ద్యశయిత్యభిధీయతే" (భావప్రకాశము)

దానాదులచే లభించునది యశము. వీర్యాదులచే వచ్చునది కీర్తి. అందుకే అనర్ఘ రాఘవమునందిట్లు గలదు.

"యశస్తోమానుచ్చై రుపచిను చకోరప్రణయిన్
రసజ్ఞా పాండిత్యచ్ఛిదుర శశిధామ భ్రమకరాన్
అపి త్వత్తేజోభి స్తమసి శమితే రఙ్ఞతు దిశా
మసౌయాత్రాయామైత్రీం నభసి నితరామంబరమణిః

—ఆమురారియే ప్రతాపమును వర్ణించుచు

"దిక్కూలంకషకీర్తి ధౌతవియతో నిర్వ్యాజవీరోద్ధతా
తేయూయం రఘువః ప్రసిద్ధమహసః యైస్సోపిదేవాధిపః
బిభ్రాణైరసురాధిరాజ విజయక్రీడా నిదానం ధనుః
పౌలోమీకుచపత్రభంగ రచనా చాతుర్యమభ్యస్యతి॥"

మాఘుడును—

"అకృత్వాహేలయా పాదం ఉచ్చైర్మూర్ధ్నసు విద్విషాం
కథంకారమనాలంబా కీర్తి ర్వ్యామధిరోహతి"

అనెను, భట్టుమూర్తి యీ సందర్భమునఁ గీర్తిశబ్దమును వాడుటచే నాతని బహుకావ్యదర్శిత్వము స్పష్టమగుచున్నది. "వసుక్ష్మాపాలచంద్రుఁ"డను చోటి మరియొకయా జేపము. చంద్రోదయముతో సముద్రముప్పొంగుచున్నది. ఇది పూర్వోత్తర సందర్భవిరోధము. సాంద్రచంద్ర అనుచేకానుప్రాస చాపల్యమునకై వచ్చినది. కాని ఇక్కడ చంద్రుఁడనఁగా శ్రేష్ఠుఁడని యర్థము.

ఇట్లే ప్రియదర్శిక నాటికలో -

ధూమవ్యాకులదృష్టి రిందు కిరణై రాహ్లాదితాక్షీపునః
పశ్యంతీవర ముత్సుకా నతముఖీ భూయో హ్రియాబ్రహ్మణః
సేర్ష్యాపాదనఖేందుదర్పణగతే గంగాంధధానే శివే
స్పర్శాదుత్పులకా కరగ్రహవిధా గౌరీ శివాయాస్తు వహః

అని గలదు. "ఇందు" శబ్దము శ్రేష్ఠవాచకము కాకున్నచోఁ బండితరాజు చెప్పిన యీ క్రింది యాజేపము వచ్చును.

"నహిసాదృశ్యమూలై కాలంకారావచ్ఛిన్నే-సాదృ
శ్య మూలమలంకారాంతరం శోభతే యధాముఖ
కమలంతవచంద్రప త్ర్పతీమయతి"

పూర్వులు గొప్ప వ్యుత్పన్నులు. వారి విమర్శలన్నియుఁ పాండిత్యప్రధానములై యుండును.

ఆ పత్రికలలో రేఫ. ల. కారయతినిఁగూర్చియుఁ గొంతచర్చ జరిగినది. వసుచరిత్రములోని దీ క్రింది పద్యము.

శా. ఓలంబాలక ! యోలయోలయన నోలోలంచుమేలంబు
రోలంబాలక యోర్తుగ్రుంకి బిసవల్లుల్ దున్మితూటాడి, కెం
గేలంబట్టి తటాలునన్నెగసె నఖీణాంబునాధాంబుజా
ఖీలోకంబు జయించి వారలయశశ్శ్రీదెచ్చు చందంబునన్.
(3-162)

ఈ పద్యమందహోబలపతి 'రోలంబాలక' యను పాఠమునే గ్రహించెను. రేఫ, లకారముల కభేదము గనుక యతిచెల్లునని యతని వాదము. అప్పకవి దానినిఁగాదని 'లోలంబాలక' యనిదిద్ది లంబాలక లోన్ క్రుంకి అని యన్వయించినాఁడు. అట్లే 'రాయంచ కాళ్ళదొలకయమున్న' (4-125) అను ప్రయోగమును గొంతుపట్టు కొన్నది. దానిని కలహంసకాళ్ళద, వులకమున్న' అని నిష్కరుణముగాదిద్ది వేసినాఁడు. మూర్తికవియిట్టి కుంటిపాదము ప్రాయునా? యని యైన నాతఁ డాలోచింపలేదు. నన్నభట్టుల భారతములో

సీ. ఇప్పాట పాండు వంశేశులు రాజ్యార్హా
లగుదురు వసుమతీ రాజ్యమునకు (ఆ. 6-128)

అనియున్నది. దానిని ఇప్పాట పాండువంశేశులు వసుమతీ! రాజ్యార్హాలగుదురు రాజ్యమునకు అని అప్పకవి భక్తులు దిద్దివేసినారు. కాని-రేఫ. ల. కారయతినితే వచ్చెరుమాళ్ళయ్యగారే-

.....భా
ర మునన్ బుచ్చుచువర్ధమాన విరహాగ్లానిన్ మదింగుందుచున్
(శకుంతలా పరిణయము)

అని చూపిరి. అట్లే 'ఉకారాంతములైన మహత్తులపై - పు వర్ణకము బహుళముగానగు (తత్స. 50 సూ). అనుసూత్రముపైనను గొంత తర్జన భర్జనలు సాగినవి. 'వటువు వటుడు,' రెంటిని పోతన్న ప్రయోగించెను. 'వసువు వసుడు' రెండుప్రయోగములను రామరాజ భూషణు డాదరించినాడు

ఉ. అళలఁబెట్టియేచు వసువంచు వచింపఁగనేల సంతతో
చ్ఛాసి నిజాభిజాత్యమున దద్వసువున్ వెలగొన్న మోహసం
వాసపదంబు దా రమణి, వారక శుక్తిమతిం జనించె ల
క్ష్మీసముదగ్రమై జగ మశేషమునివ్వెఱగంద జేయగన్.

చ. సతినడిగించు, భవ్యగుణ శాలివసుండట! వేడవచ్చు వా
డతులిత దేవరాజ్య భరణైక ధురంధరుఁడైన యాశత
క్రతుఁడట...

అని ప్రయోగములు, దీనిపై 'మనుఁడను' ప్రయోగము చెల్లునా? యను తర్కము చెలరేగెను. ఇంతకును వైయాకరణులు ప్రయోగ శరణులు. శబ్ద చర్చనొనర్చు నప్పుడీవిషయమును జ్ఞాపకముంచికొనుట మంచిది.

రామరాజ భూషణునకుఁ బారిజాతాపహరణముపైఁగూడఁ జూపున్నట్లున్నది. ఆనాటి పండితులు కవులు వైయక్తికస్పర్థలెట్లున్నను పరస్పరము యోగ్యత లర్థము జేసికొనెడివారు. గుణమున్నచోట గౌరవించువారు, మొన్నటి యప్పయ్యదీక్షితులు పరమశైవుఁడు. మత చర్చ వచ్చినప్పుడు వైష్ణవమున కెదురుచుక్క. కాని దేశికుల గంధముల కర్తఁడు వ్యాఖ్యాత. నాటికవులు సమకాలిక గ్రంథములను జదువు చుండిరి. సాధ్యమైనంతకన్న బాగుగ వ్రాయవలెనని వారియాశ. మక్కువతిమ్మన్న -

కం. అలరుం బోడులలోపల
నలరుం బోడుములు నీకు నగ్గలమగుచున్.....
తలపూవాడకయుండుము
తలపూవు ధరించి వికచతామర సాక్షీ! (1-65)

అనియొక జాతీయమును లలితముగ వాడినాడు. అట్లే భట్టుమూర్తి -

భూరిసంపద తలపూవువాడనిభోగి
వరసుధర్మావాస్తిఁ బరగుసుకృతి... (3-4)

అని దేవేంద్రుని వర్ణించెను. అతని తలపై నున్నది కల్పవృక్ష కుసుమము. అదెట్లు వాడును? పారిజాతాపహరణములో

ఉ. ఇన్నిదినంబులున్ సవతులిందఱలోఁగడు గారవంబునన్
కన్నియ! నన్ను వల్లభుడు కన్నులఁగప్పికొనంగనుండి
వన్నెయువాసియుందరిగి వారుననుంచలతెత్తి సూడగా
సన్నలఁజాయలంబలుక సైతునెప్రాణము లెంతతీపొకో!
(1-88)

అని సత్యాదేవి చెలికత్తెలతోఁ బనవినది. దీనినిజూచి భూషణకవి 'తిమిరంపుగుంపు' నిట్లు వర్ణించెను.

సీ. తమినహల్యా జారతా రతాశయుఁడైన
జంభారికది రత్నజాలమయ్యె
వల్లవీరతిగూడి - మల్లాడుమాయ గొ
ల్లనికిది చూడాకలాపమయ్యె
దారుకావన మౌనిదార కాముకి డైన
పశుపతికిది గళాభరణమయ్యె
తారాభిసార సాదరత ద్రిమ్మరిన త
మ్మలదాయ కిది యురోముద్రయయ్యె

తే. నభిమత నవీనవర నిధానాప్తిహేతు
దివ్యనసిద్ధాంజనంబైన దీనివంటి
యనుఁగు గనుగవ నొత్తుచేయ ఱిటంచు
గుఱటలు నుతింపఁ దిమిరంపుగుంపులెసగె॥ (4-1)

ఇచ్చటి 'కనుగవ నొత్తుట సర్వథా సార్థకము 'దార వల్లవి, తార యిత్యాది శబ్దములు, అర్థపుష్టితో వాడబడినవి. తిమ్మన కృష్ణుకుపచారము లిట్లు వింగడించినాఁడు.

సీ. చంద్రికపూవన్నె జిలుగు దువ్వలువను
దడియొత్తె నొక్క కాంతాలలామ
కొనగోళ్ళ నెఱులుసిక్కులు వాపి మెలపున
శిరసార్చె నొక్కలే జిగుబు బోడి
వెన్నెల నిగ్గులు వెదజల్లెడు మడుంగు
లందిచ్చె నొక్కపూర్ణేందువదన
నవరత్నమయ భూషణ|వజంబులుమేన
గీలించె నొకరాజ కీరవాణి

గీ. విరులసరులిచ్చె నొక యరవిందగంధి
యలఁదెఁజందనమొక ధవళాయతాక్షి
సుదతియొక్కతె కపురంపు సరటి విసరె
నిలువుటద్దంబునొక యింతి నిలిపె నెదుట॥ (2-12)

వసురాజునకు మజ్జనమార్చుటకై దేవకాంత లిట్లు సందడించి
రారట!

సీ. ఈ రాజు గరమొప్పఁ జేరి సేవలుసేయ
తటి దారసిలె గదే తాన! యనుచు
రాజమాత్రుఁడె ధరేంద్రస్వామి యితనిమై
నంటు మైనంటు మేనకయటంచు
నీ సర్వమంగళావాసుని శిరమంట
శశిరేఖ నీవ పో జాణవనుచు
కమనీయగతి తిలోత్తమ నేర్చుగాక నూ
నియనంట నెవ్వారు నేర్తురనుచు.

గీ. పరమవసుసంవహన లీల బరిఢవిల్ల
రత్నమంజరి! నీవనేర్పరివటంచు
నతిచటులచాటు చతురోక్తులాడికొనుచు
గదిసి, తత్కాలమున శుభాకృతము లునుప. (5-74)

కృష్ణుని యంతఃపురములోని యింతులకును భట్టుమూర్తి సృష్టించిన చాతుర్యవతులకును భేదము మీకు స్పష్టమే. తిమ్మన్నగారి ప్రోవననుసరించి రచియించిన చాయలును లేకపోలేదు. ఒకటి యీ క్రిందిది -

ఉ. రాజులనెత్తుటన్ పరశురాముఁడు క్రంతలుసేసె రెండు మూ
డి జగతిన్ గణింప నది యెంతటి విస్మయమబ్జినీ సుహృ
త్తేజుఁడు కందుకూరికడ దిమ్మయ యీశ్వరుచే జనించె భూ
రాజిబెడందకోట యవనాశ్విక రక్తనదీసహస్రముల్. (1-10)

ఈ పద్యమువంటిదే భట్టుమూర్తి రచించిన -

ఉ. కొంచకయంబుధిన్ బడిన కొండలపత్రములూడ్చదయ్యె నూ
రంచులకత్తి. దానియుదుటంతయు నెంతని, కంతుచేతి నూ
రంచులకత్తి, హత్తి జవరాలి కుచాద్రులముంచె బత్ర రే
ఖాంచిత వైభవంబెడలనాతతబాష్ప మహోపయోనిధిన్.
(3-107)

ముక్కుతిమ్మన్న సాయంకాలమును గొంత దురుసుగానిట్లు చెప్పెను :

ఉ. ఆయత తేజముల్దరిగి యంబుజబాంధవుఁ డస్త సీమకున్
బోయినఁజూచి, వేచిన తమోవిభుడంప దినాంతయోధుడి
చాయ, దదీయపత్ని బెలుచన్ బడనీడిచి కొంచుబోయెడిన్
గో యనుమాడ్కినంతట శకుంతరవంబు చెలంగె నెల్లెడన్.
(2-30)

భట్టుమూర్తియు -

తే. తపనుదరిమి దురంత సంతమస మతని
సంతతులబట్టితెచ్చి శీర్షములపై ని
జాంకమిడి కాచి విడిచెనా నగ్రకలిత
కజ్జలములైన గృహదీపకళికలమరె. (4-1·

అన్నాఁడు. ఈ రెండు పద్యములును నాటి రాజుల జీవితము లను గూర్చి చెప్పునవి. 'ఇవువురు నా భావములే చెప్పిరి. ఇందులో ననుసరణ మేమున్నది? అన్నచో నాక్షేపణ లేదు. ఇట్టివియు నింత కన్నను దగ్గఱగా నుండునవియు నీ కావ్యములలోఁ జూలయున్నవి చూచికొనవచ్చును.

నారదుఁడు రుక్మిణీదేవి యంతఃపురమునకు వచ్చినపుడు తన 'పారిజాతంపు గ్రొన్నన' గుణములను యేఁడు పద్యములలో వర్ణించి నాఁడు. అట్లే భట్టుమూర్తియుఁ బద్యసప్తకమునే యందుకై వెచ్చించెను. నారదుఁడు—

"పౌలోమి పార్వతి, పద్మ పద్మజురాణి
యును శిరంబున దాల్తు రనుదినంబు...

అన్నాఁడు. మహేంద్రుఁడును వసురాజుతో—

చం. అరుదగు నీ విమానము బ్రజాధిపుఁడుంబురుషో త్తముండు శం
కరుఁడునుదక్కనన్యులకుఁగాదధిరోహ మొనర్ప, వారిసు
స్థిరకరుణా విశేషమునఁ జిష్ణుడనై గయి కొంటిదీని, నే
నరవర! సర్వసద్గుణ గణంబులప్రోవగు నీ కొసంగితిన్॥

అనిపల్కెను. వీణాముని—

క. నెలకొనివేసవి జలువయు
జలవేళల నుష్ణగుణము సముచితభంగిం
గలిగించు నీలతాంతము
కొలఁదులు నెప్పెంగ నిచ్చఁగ్రొత్తలు సుమ్మీ (1-61)

—అని చాలించి కొనఁగా దేవేంద్రుడా భావమును బెంచి పెంపు సేసినాఁడు.

సీ. మాననీయానంత మణికాంత ధామమై
యిది హిమానీ వేళనింపునింపు
శోణప్రవాళ మంజులతా నికాంతమై
యలరించునిది వసంతాగమమున

తరళముక్తాదీప్తి ధారాధివాసమై
వేసవి నిదిమహోల్లాస మొసఁగు
ప్రబల వజ్రోపల ప్రాసాదభాసమై
తొలకరినిది కుతూహలమునిలుపు

తే. జనవరో త్తమ! యిదిసర్వ సమయసౌఖ్య
జనకమింపలి యాలేఖ్యసాధ్యసిద్ధ
కిన్నరాంగనల విగీతగీత నృత్య
వాద్యములు సూపి నిలుతురు వలయునెడల (3-15)

నారదుఁడు 'అడిగినయంతలోన సరసాన్నములను సమకూర్చునని' తన సరకును వర్ణించెను. దానినిఁగూడ గుర్తుంచుకొన్న భట్టుమూర్తి 'అమృతాన్నసారప్రద' మని చెప్పుట మరచిపోలేదు. రాయవారి భావచ్ఛాయలుగూడ భట్టుమూర్తిలో నక్కడక్కడ నున్నవి. దయచేసి పండితులు పరీక్షింపవలెను. ఎన్నిరీతులఁజూచినను భట్టుమూర్తి మహా పండితుఁడు. కావుననే యతఁడు-

ఉ. కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిపుట్టు రత్నములవారిత సత్కవి కల్పనా విభూ
షావహపూర్వవృత్తములు సానలఁదీరిన జాతిరత్నముల్
గావున నట్టి మిశ్రకథగా.....

వనియు—

శా. భావంబెక్కడ లేక, వృత్తనియమాపాయంబు చింతింపకెం
దే వర్తించి పరార్థవంచనలచే దీపించి, మూర్ఖాళి సం
భావింపం గుకవిప్రణీతకృతి సామాన్యాకృతిం బూని పై
పై వన్నెల్పచరింప దాని దిలకింపంబోరు ధీరోత్తముల్.

అనియు గుండెలు విఱిచి చెప్పికొన్నాఁడు. అట్టిధైర్య మింకెవరికున్నది?

ఇఁక మిగిలినవి కడపటిమాటలు. నా శక్తికొలఁది-యోర్పు కొలఁది భట్టుమూర్తి నధ్యయనమొనర్చినాను. ఆతనిపై నాకున్న భావములు మీముందుంచినాను. గుణదోషములకుఁ బండితులు ప్రమాణము. నాకీ యవకాశమును గల్పించిన విశ్వవిద్యాలయాధికారులకుఁ గృతజ్ఞత. సహృదయులైన విద్వాంసులకు నమస్కారము. దయతో అచ్చొత్తించిన శ్రీరామరాజభూషణ సాహిత్య పరిషత్తువారికి నా ధన్యవాదములు.

శ్రీ రామరాజభూషణ సాహిత్య పరిషత్తు ప్రచురణలు

(సర్వహక్కులు పరిషత్తువి)

1. భూషణ కిరణావళి — మూల్యము రు 6-00

విషయము	రచయిత
ఆప్త వాక్యము	—శ్రీ దిగుమర్తి సీతారామస్వామి
రామరాజభూషణుని సాహితీశక్తులు	—శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి
వసుచరిత్ర తత్వము	—శ్రీ వాసిలి వేంకట లక్ష్మీనరసింహారావు
వసుచరిత్రలోని కబ్బపు తెలుగు	—శ్రీ విశ్వనాథ సత్యనారాయణ
సంగీత కళారహస్యనిధి	—శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
వసుచరిత్రయందలి నాటకరీతులు	—డాక్టరు దివాకర్ల వెంకటావధాని
వసుచరిత్ర ప్రశంసాలేశము	—శ్రీ యమ్. ఆర్. అప్పారావు

2. వసుచరిత్ర సాహితీసౌరభము — మూల్యము రు 5-00

రచయిత:

సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు

ప్రతులకు:

కార్యదర్శి

శ్రీ రామరాజభూషణ సాహిత్య పరిషత్తు

భీమవరం (ప. గో. జిల్లా) ఆంధ్రప్రదేశ్